www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



సోమవారం | 14-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 359 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి ఉ.8.26 తదుపరి విదియ; నక్షత్రం: స్వాతి రా.12.13 తదుపరి విశాఖ; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: మ.12.40-1.29, మ.3.09-3.58; అమృతఘడియలు: మ.2.18-4.06; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.03; సూర్యాస్తమయం: 6.27 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

# JEE MAIN - 2025 (Session 2) లో 300/300 మార్కులు సాధించిన శ్రీచైతన్య రెసిడెన్షియల్ విద్యార్థులకు మాత్రమే మ్యాథ్స్‌లో తెలిసిన విజయ రహస్యం ఏంటి?





JEE MAIN 2025 (SESSION-2)

300/300 Marks As Per NTA Provisional Key

Ajay Reddy Vangala
Appl. No. 250310255592

10వ తరగతి పూర్తిచేసి - IIT-JEE / NEETలో టాప్ ర్యాంక్స్ సాధించాలని కలలుగనే విద్యార్థుల కోసం Most Advanced Programmes

IPL IIT PREMIER LEAGUE SUPER 60 | AIIMS SUPER 60

మ్యాథ్స్/బయాలజీ, ఫిజిక్స్ & కెమిస్ట్రీలలో రిజల్ట్ ఓరియంటెడ్ ఫౌండేషన్‌తో...
ఇంటర్‌తో పాటు IIT/డాక్టర్ సీట్‌ను ఈజీగా సాధించవచ్చు.

## శ్రీచైతన్య మోస్ట్ అడ్వాన్స్‌డ్ ఫిజిక్స్ ప్రోగ్రామ్స్‌తోనే NEET లో టాప్ ర్యాంక్స్ ఎలా సాధ్యం?

**ఒక లక్ష్యం పెట్టుకుని శ్రీచైతన్యను ఫాలో అయితే మీరు అనుకున్నది సాధిస్తారు.**

మా పేరెంట్స్ కు నన్ను డాక్టర్‌గా చూడాలని కల. అందుకే నేను శ్రీచైతన్యని ఎంచుకున్నాను. డాక్టర్ సీట్ సాధించే లక్ష్యంతో డిజైన్ చేసిన శ్రీచైతన్య AIIMS-SUPER 60 ప్రోగ్రాం వల్లనే నాలో కాన్ఫిడెన్స్ రెట్టింపు అయింది. డైలీ ప్రాక్టీస్, మాక్ టెస్ట్‌లు, వీకెండ్ టెస్టులు, సైన్స్‌పై పట్టు సాధించే విధంగా ఎప్పటికప్పుడు డౌట్స్ క్లారిఫై సెషన్స్ నిర్వహించడంతో నా టార్గెట్ ఈజీగా రీచ్ అయ్యాను.

– Gattu Bhanu Teja
(AIIMS, Delhi)

**NEET కోసం అడ్వాన్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం తో నా అన్ని సందేహాలు క్లియర్ అయ్యాయి.**

NEET ర్యాంక్ నిర్ణయించే ఫిజిక్స్‌లో నేను చాలా సందిగ్ధంలో ఉన్నప్పటికీ శ్రీచైతన్య అడ్వాన్స్‌డ్ ఫౌండేషన్ ప్రోగ్రాం వల్ల ఏది అవసరం, ఎంతవరకు అవసరం అనే విషయాలు ప్రారంభంలోనే స్పష్టత రావడంతో, ఫిజిక్స్‌లో 180/180 మార్కులు సాధించాను. తద్వారా NEETలో 720/720 మార్కులతో ఆలిండియా 1st ర్యాంక్ సాధించగలిగాను.

– B Varun Chakravarthi
(AIIMS, Delhi, NEET All-India Open Category 1st Rank)

**శ్రీచైతన్య ప్రోగ్రామ్స్ మరియు ఫ్యాకల్టీ చెప్పింది తూచా తప్పకుండా పాటిస్తే, మీరు IIT సీటు సాధించవచ్చు.**

నేను IIT-JEEలో ఆలిండియా టాపర్‌గా నిలిచానంటే దానికి కారణం శ్రీచైతన్యలో ఇంటర్‌తో పాటే IIT-JEE లక్ష్యంగా సైంటిఫిక్ అప్రోచ్‌తో కూడిన IPL-SUPER 60 ప్రోగ్రాం మరియు ఫ్యాకల్టీ సపోర్ట్. ఈ విషయంలో వారి సపోర్ట్ ఎప్పటికీ మర్చిపోలేను.

– V Chidvilas Reddy
(CSE, IIT Mumbai, JEE Advanced All-India Open Category 1st Rank)

**మా పేరెంట్స్ - నన్ను శ్రీచైతన్యలో చేర్పడంతోనే నా ఆత్మ విశ్వాసం పెరిగింది... IIT-JEEలో టాప్ ర్యాంకర్ గా నిలిచాను.**

నా తల్లిదండ్రుల కల, నన్ను IITianగా చూడాలని. పదవ తరగతి తరువాత కాలేజీ ఎంపికపై ఆలోచిస్తుండగా శ్రీచైతన్య గురించి తెలుసుకొని శ్రీచైతన్యలో చేరడం జరిగింది. ఈరోజు నేను IITలో సీట్ సాధించానంటే, దానికి గల కారణం శ్రీచైతన్య పర్ఫెక్ట్ గైడెన్స్, స్టడీ మెటీరియల్ అని ఖచ్చితంగా చెప్పొచ్చు.

– S Venkata Koundinya
(CSE, IIT Madras, JEE Main All-India Open Category 1st Rank)

**శ్రీచైతన్య రెసిడెన్షియల్ క్యాంపస్‌లో ఉండటం వలన కఠినమైన మ్యాథ్స్ - సులభంగా క్రాక్ చేసి JEE MAIN - 2025 (Session 2)లో 300/300 మార్కులు సాధించగలిగాను.**
నేను నా జూనియర్స్‌కి చెప్పేది ఒక్కటే

- మీరు అనుకున్న గోల్ సాధించాలంటే శ్రీచైతన్య ప్రోగ్రామ్స్‌తో మీరు ప్రయాణం సాగిస్తే చాలు!
- శ్రీచైతన్య ప్రోగ్రామ్స్ మరియు ఫ్యాకల్టీ చెప్పింది తూచా తప్పకుండా పాటిస్తే, మీరూ IIT సీటు సాధించవచ్చు.
- ఒక లక్ష్యం పెట్టుకుని శ్రీచైతన్యను ఫాలో అయితే మీరు అనుకున్నది సాధిస్తారు.
- స్కూల్ స్థాయిలోనే శ్రీచైతన్య ఇచ్చిన ఫౌండేషన్ JEE Main లో 300 కి 300 మార్కులు సాధించడంలో ఎంతో ఉపయోగపడింది.

నేను ఈ రోజు IIT-JEEలో సక్సెస్ కావడానికి కారణం శ్రీచైతన్యలో ఉండే వన్-టు-వన్ అడాప్షన్, డైలీ టీచింగ్ షెడ్యూల్, అసైన్మెంట్స్, స్టడీ అవర్స్, డౌట్స్ క్లారిఫై చేసే విధానం, ఎగ్జామ్ పాటర్న్ పై పూర్తి పట్టు సాధించే విధంగా విద్యాబోధన.

– Ajay Reddy Vangala
JEE Main 2025, Session-2, 300/300 Marks, As Per NTA Preliminary Key

### JEE ADV. 2024 - ఓపెన్ కేటగిరిలో ఆలిండియా టాప్ 10 లోపు 5 ర్యాంకులు

ALL INDIA RANK 1 – RAGHAV SHARMA

| Rank | Marks | Name |
|---|---|---|
| 4 | 337/360 | RHYTHM KEDIA |
| 5 | 334/360 | PUTTI KUSHAL KUMAR |
| 6 | 333/360 | RAJDEEP MISHRA |
| 9 | 329/360 | DHRUVIN HEMANT DOSHI |
| 10 | 329/360 | A S S D B SIDHVIK SUHAS |

ఆలిండియా ఓపెన్ కేటగిరి 100 లోపు 30 ర్యాంకులు | ఆలిండియా ఓపెన్ కేటగిరి 500 లోపు 122 ర్యాంకులు | ఆలిండియా ఓపెన్ కేటగిరి 1000 లోపు 205 ర్యాంకులు | ఆలిండియా ఆల్ కేటగిరి 100 లోపు 146 ర్యాంకులు | ఆలిండియా ఆల్ కేటగిరి 1000 లోపు 789 ర్యాంకులు | JEE ADVANCED 2024 4,187+

### NEET 2024 - 720 కి 715 మార్కులు ఆపైన సాధించిన 11 మంది విద్యార్థులు

RANK 1 – ALL INDIA OPEN CATEGORY – 720/720 – IRAM QUAZI

| Marks | Name |
|---|---|
| 715/720 | P PRAVIN KUMAR REDDY |
| 715/720 | G BHANUTEJA SAI |
| 715/720 | V MUKESH CHOWDARY |
| 715/720 | V KALYAN |
| 715/720 | AADARSH SINGH MOHAL |
| 715/720 | DARSH PAGHDAR |
| 715/720 | ISHA KOTARI |
| 715/720 | UJJWAL KUMAR |
| 715/720 | ADI SETHI |
| 715/720 | AMINA ARIF KADIWALA |

ఆలిండియా 100 లోపు 53 ర్యాంకులు | ఆలిండియా 200 లోపు 85 ర్యాంకులు | ఆలిండియా 500 లోపు 187 ర్యాంకులు | ఆలిండియా 1000 లోపు 298 ర్యాంకులు | STUDENTS QUALIFIED IN NEET 2024 22,000+ | STUDENTS TO BECOME DOCTORS 9,512+

### JEE MAIN 2024 - ఆలిండియా టాప్ 10 లోపు 4 ర్యాంకులు

| All India Rank | Marks | Name |
|---|---|---|
| 1 | 300/300 | K.C. BASAVA REDDY |
| 3 | 300/300 | THOTAMSETTY NIKHILESH |
| 6 | 300/300 | HIMANSHU THALOR |
| 9 | 300/300 | ROHIT ANIL |

Total Qualified Ranks for JEE ADVANCED 2024 24,403+

ఆలిండియా ఓపెన్ క్యాటగిరి 100 లోపు 25 ర్యాంకులు | ఆలిండియా ఓపెన్ క్యాటగిరి 500 లోపు 108 ర్యాంకులు | ఆలిండియా ఓపెన్ క్యాటగిరి 1000 లోపు 222 ర్యాంకులు | ఆలిండియా ఆల్ క్యాటగిరి 100 లోపు 97 ర్యాంకులు | ఆలిండియా ఆల్ క్యాటగిరి 1000 లోపు 888 ర్యాంకులు

ప్రతియేటా వేలాది తెలుగు విద్యార్థుల్ని ఇంజనీర్లుగా మారుస్తున్న ప్రోగ్రాములు
IPL SUPER 60 | IPL IC | C-IPL | C-120

ప్రతియేటా వేలాది తెలుగు విద్యార్థుల్ని డాక్టర్లుగా మారుస్తున్న ప్రోగ్రాములు
AIIMS SUPER 60 | ELITE NEET | MPL | MEDICON

Infinity Learn | 40

శ్రీచైతన్య విద్యాసంస్థలు

Ph.: 040 66 06 06 06 | srichaitanya.net

*T&C apply | Note: Any inadvertent error published in this advertisement could be brought to our notice | Note: The information is as per students feedback

## నేటి మ్యాచ్
వేదిక లఖ్‌నవూ
లఖ్‌నవూ x చెన్నై రా.7.30 నుంచి

## సిక్స్ కొడితే రూ.లక్ష
**పీఎస్‌ఎల్ టీమ్ వితరణ**

కరాచీ: పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్‌ఎల్)కు చెందిన ముల్తాన్ సుల్తాన్స్ జట్టు పాలస్తీనాకు సంఘీభావం ప్రకటించింది. ఇందులో భాగంగా తమ బ్యాటర్లు కొట్టే ప్రతీ సిక్సర్‌కు.. అలాగే తమ బౌలర్లు తీసే ప్రతీ వికెట్‌కు రూ.లక్ష (భారత కరెన్సీలో 30,683) చొప్పున పాలస్తీనా చారిటబుల్ సంస్థలకు విరాళంగా అందిస్తామని ముల్తాన్స్ యజమాని అలీ ఖాన్ తరాని ప్రకటించాడు. ఇజ్రాయెల్-పాలస్తీనా మధ్య నిరంతరం ఘర్షణలు జరుగుతున్న విషయం తెలిసిందే.

## ఐపీఎల్‌లో రోబో డాగ్


న్యూఢిల్లీ: ఐపీఎల్ ప్రత్యక్ష ప్రసారంలో సరికొత్త అనుభూతిని అందించేందుకు బీసీసీఐ కృత్రిమ మేధను అందిపుచ్చుకొంది. ఈ మేరకు రోబో డాగ్‌ను ప్రవేశపెట్టింది. ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసింది. బ్రాడ్‌కాస్టింగ్ టీమ్‌లో చేరిన రోబో డాగ్‌ను ప్రముఖ కామెంటేటర్ డానీ మారిసన్ పరిచయం చేశాడు. ముంబై, ఢిల్లీ జట్లు సాధన చేస్తున్న సమయంలో ఆటగాళ్లను కొత్త అతిథి పలకరించింది. అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్యాకు షేక్ హ్యాండ్ ఇచ్చింది. మారిసన్ వాయిస్ కమాండ్‌లకు తగ్గట్టుగా ఫీట్లు చేసి అలరించింది.

## లూకాస్ మార్టెన్స్ ప్రపంచ రికార్డు


స్టాక్‌హోమ్: ఒలింపిక్ చాంపియన్ స్విమ్మర్ లూకాస్ మార్టెన్స్ (జర్మనీ) పురుషుల 400 మీ. ఫ్రీస్టయిల్‌లో వరల్డ్ రికార్డు నెలకొల్పాడు. స్విస్ ఓపెన్‌లో భాగంగా శనివారం జరిగిన ఈ విభాగంలో 3:39.96 సెకన్ల టైమింగ్‌తో ప్రథమ స్థానంలో నిలిచాడు. దీంతో 2009లో సహచర జర్మన్ స్విమ్మర్ పాల్ బీడర్‌మన్ నెలకొల్పిన రికార్డును 0.11 సెకన్ల తేడాతో అధిగమించాడు. 23 ఏళ్ల మార్టెన్స్ పారిస్ ఒలింపిక్స్‌లోనూ 400మీ. ఫ్రీస్టయిల్‌లో స్వర్ణం అందుకున్నాడు.

## ధీరజ్ టీమ్‌కు రజతం


### ఫైనల్లో చైనా చేతిలో ఓటమి
న్యూఢిల్లీ: ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-1లో ధీరజ్ బొమ్మదేవర నేతృత్వంలోని భారత పురుషుల రికర్వ్ జట్టు రజతంతో సరిపెట్టుకొంది. అమెరికాలోని సెంట్రల్ ఫ్లోరిడాలో ఆదివారం జరిగిన ఫైనల్లో ధీరజ్, తరుణ్‌దీప్ రాయ్, అతాను దాస్‌లతో కూడిన భారత్ 1-5 పాయింట్ల తేడాతో చైనా టీమ్ చేతిలో పరాజయం పాలైంది. తొలి సెట్ 54-54తో సమమైంది. అయితే, రెండో సెట్‌ను 58-55తో చైనా నెగ్గడంతో.. మ్యాచ్‌లో నిలవాలంటే మూడో సెట్‌లో భారత్ తప్పనిసరిగా నెగ్గాల్సిన పరిస్థితి. కానీ, భారత్ 54-55తో ఓడడంతో చైనాకు స్వర్ణం ఖాయమైంది. కాంస్య పతకాన్ని కూడా చైనానే సొంతం చేసుకొంది.

# ఢిల్లీ రనౌట్
- సీజన్‌లో తొలి ఓటమి
- 12 రన్స్ తేడాతో ముంబై విజయం
- కరుణ్ నాయర్ పోరాటం వృథా


కర్ణ్ శర్మ (3/36)

న్యూఢిల్లీ: ఢిల్లీ క్యాపిటల్స్ వరుస విజయాల జోరుకు బ్రేక్ పడింది. ఆఖర్లో అనూహ్య తడబాటుతో గెలుపు ముంగిట బోల్తా పడింది. మూడేళ్ల తర్వాత ఐపీఎల్ ఆడిన కరుణ్ నాయర్ (40 బంతుల్లో 12 ఫోర్లు, 5 సిక్సర్లతో 89) అద్భుత ఆటతీరుతో జట్టును విజయం ఖాయమనే స్థితికి చేర్చాడు. అయితే 19వ ఓవర్‌లో అశుతోష్ (17) సహా ముగ్గురు రనౌట్‌గా వెనుదిరగడంతో డీసీ మూల్యం చెల్లించుకుంది. దీంతో మరో ఓవర్ ఉండగానే ముంబై 12 పరుగుల తేడాతో రెండో విజయాన్నందుకుంది. అటు ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో ఢిల్లీకిదే తొలి ఓటమి. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 5 వికెట్లకు 205 పరుగులు చేసింది. తిలక్ (33 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సర్లతో 59), రికెల్టన్ (25 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 41), సూర్యకుమార్ (28 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 40), నమన్ (17 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 38 నాటౌట్) రాణించారు. కుల్దీప్, విప్రజ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఢిల్లీ 19 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. పోరెల్ (33) ఫర్వాలేదనిపించాడు. స్పిన్నర్లు కర్ణ్‌కు మూడు, శాంట్నర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా కర్ణ్ శర్మ నిలిచాడు.

**కరుణ్ పోరాడినా..:** భారీ ఛేదనలో ఢిల్లీ మొదటి బంతికే ఓపెనర్ మెక్‌గుర్క్ (0) వికెట్‌ను కోల్పోయింది. కానీ మరో వికెట్ కోసం పది ఓవర్ల వరకు వేచి చూడాల్సి వచ్చింది. ఇందుకు ఇంపాక్ట్ ప్లేయర్ కరుణ్ నాయర్ ఆటతీరే కారణం. నాయర్-పోరెల్ కలిసి రెండో వికెట్‌కు ఢిల్లీ 119 పరుగుల భారీ భాగస్వామ్యం లభించింది. దేశవాళీల్లో అదరగొట్టిన కరుణ్ ఇక్కడా అదే ఫామ్‌ను కనబర్చాడు. ఈ జోడీ ప్రమాదకరంగా మారిన వేళ 11వ ఓవర్‌లో పోరెల్‌ను స్పిన్నర్ కర్ణ్ శర్మ అవుట్ చేశాడు. ఇక్కడి నుంచి ఢిల్లీ ఒక్కసారిగా తడబడింది. తర్వాతి ఓవర్‌లోనే కరుణ్‌ను శాంట్నర్ బౌల్డ్ చేయగా.. కర్ణ్ వరుస ఓవర్లలో స్టబ్స్ (1), రాహుల్ (15)లను అవుట్ చేసి షాకిచ్చాడు. ఇక అక్షర్ (9), విప్రజ్ (14) వైఫల్యంతో చివర్లో అశుతోష్ జోరు పెంచాడు. 12 బంతుల్లో 23 రన్స్ కావాల్సిన వేళ 19వ ఓవర్‌లో అతడు రెండు ఫోర్లు బాది ఉత్కంఠ పెంచాడు. కానీ రెండో పరుగు కోసం వెళ్లిన అశుతోష్‌తో పాటు వరుస బంతుల్లో కుల్దీప్ (1), మోహిత్ (0) కూడా రనౌట్ కావడంతో ముంబై సంబరాలు చేసుకుంది.


తిలక్ (59)

**కలిసికట్టుగా..:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇన్నింగ్స్‌లో ఓపెనర్ రికెల్టన్, సూర్యకుమార్‌తో పాటు మిడిలార్డర్‌లో తిలక్ వర్మ జట్టుకు అండగా నిలిచారు. అతడికి డెత్ ఓవర్లలో నమన్ ధిర్ అద్భుత సహకారం అందించాడు. ఐదో ఓవర్‌లో విప్రజ్ ఎల్బీతో వెనుదిరగ్గా తొలి వికెట్‌కు 47 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే కుల్దీప్ గూగ్లీకి రికెల్టన్ బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత సూర్య-తిలక్ జోడీ డీసీ బౌలర్లను ఆడేసుకుంది. 13వ ఓవర్‌లో సూర్య 6,4 తిలక్ 4తో 17 రన్స్ సమకూరాయి. ఇక ఆఖరి ఓవర్‌లో తిలక్ స్లాగ్ స్వీప్ షాట్‌ను ప్రయత్నించగా..బౌండరీ లైన్‌కు అత్యంత సమీపంలో పోరెల్ సూపర్ క్యాచ్ తీసుకోవడంతో ఐదో వికెట్‌కు 62 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అయితే ఈ ఓవర్‌లో నమన్ రెండు ఫోర్లతో 11 రన్స్ రాగా 200 దాటింది.

### పాయింట్ల పట్టిక

| జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే | పా | నె.రరే |
|---|---|---|---|---|---|---|
| గుజరాత్ | 6 | 4 | 2 | 0 | 8 | 1.081 |
| ఢిల్లీ | 5 | 4 | 1 | 0 | 8 | 1.006 |
| బెంగళూరు | 6 | 4 | 2 | 0 | 8 | 0.672 |
| లఖ్‌నవూ | 6 | 4 | 2 | 0 | 8 | 0.162 |
| కోల్‌కతా | 6 | 3 | 3 | 0 | 6 | 0.803 |
| పంజాబ్ | 5 | 3 | 2 | 0 | 6 | 0.065 |
| ముంబై | 6 | 2 | 4 | 0 | 4 | 0.027 |
| రాజస్థాన్ | 6 | 2 | 4 | 0 | 4 | -0.838 |
| హైదరాబాద్ | 6 | 2 | 4 | 0 | 4 | -1.245 |
| చెన్నై | 6 | 1 | 5 | 0 | 2 | -1.554 |

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

**స్కోరుబోర్డు**

ముంబై: రోహిత్ (ఎల్బీ) విప్రజ్ 18; రికెల్టన్ (బి) కుల్దీప్ 41; సూర్యకుమార్ (సి) స్టార్క్ (బి) కుల్దీప్ 40; తిలక్ (సి) పోరెల్ (బి) ముకేశ్ 59; హార్దిక్ (సి) స్టబ్స్ (బి) విప్రజ్ 2; నమన్ (నాటౌట్) 38; జాక్స్ (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 20 ఓవర్లలో 205/5. వికెట్ల పతనం:** 1-47, 2-75, 3-135, 4-138, 5-200; **బౌలింగ్:** స్టార్క్ 3-0-43-0; ముకేశ్ 4-0-38-1; విప్రజ్ 4-0-41-2; కుల్దీప్ 4-0-23-2; అక్షర్ 2-0-19-0; మోహిత్ 3-0-40-0.

ఢిల్లీ: మెక్‌గుర్క్ (సి) జాక్స్ (బి) చాహర్ 0; పోరెల్ (సి) నమన్ (బి) కర్ణ్ 33; కరుణ్ (బి) శాంట్నర్ 89; రాహుల్ (సి అండ్ బి) కర్ణ్ 15; అక్షర్ (సి) సూర్య (బి) బుమ్రా 9; స్టబ్స్ (సి) నమన్ (బి) కర్ణ్ 1; అశుతోష్ (రనౌట్) 17; విప్రజ్ (స్టంప్) రికెల్టన్ (బి) శాంట్నర్ 14; స్టార్క్ (నాటౌట్) 1; కుల్దీప్ (రనౌట్) 1; మోహిత్ (రనౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 19 ఓవర్లలో 193 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-0, 2-119, 3-135, 4-144, 5-145, 6-160, 7-180, 8-192, 9-193, 10-193. **బౌలింగ్:** చాహర్ 3-0-24-1; బౌల్ట్ 2-0-21-0; బుమ్రా 4-0-44-1; శాంట్నర్ 4-0-43-2; హార్దిక్ 2-0-21-0; కర్ణ్ 4-0-36-3.

# ఏకపక్షం!
- బెంగళూరు ఘన విజయం
- 9 వికెట్లతో రాజస్థాన్ చిత్తు
- జైస్వాల్ అర్ధ శతకం


సాల్ట్ (65) కోహ్లీ (62 నాటౌట్)

జైపూర్: ఫిల్ సాల్ట్ (33 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లతో 65), కోహ్లీ (45 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 62 నాటౌట్) అర్ధ శతకాలతో చెలరేగడంతో.. ఐపీఎల్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఘన విజయాన్ని నమోదు చేసింది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 9 వికెట్ల తేడాతో రాజస్థాన్ రాయల్స్‌ను చిత్తు చేసింది. తొలుత రాజస్థాన్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 173 పరుగులు చేసింది. యశస్వీ జైస్వాల్ (75), ధ్రువ్ జురెల్ (35 నాటౌట్), రియాన్ పరాగ్ (30) రాణించారు. క్రునాల్, భువనేశ్వర్ చెరో వికెట్ పడగొట్టారు. ఛేదనలో బెంగళూరు 17.3 ఓవర్లలో 175/1 స్కోరు చేసి గెలిచింది. దేవ్‌దత్ పడిక్కల్ (40 నాటౌట్) దూకుడుగా ఆడాడు. **సాల్ట్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'** దక్కింది.

**ఆరంభం నుంచే బాదుడు..:** రాజస్థాన్ బ్యాటర్లు తడబడిన పిచ్‌పై ఓపెనర్ సాల్ట్ భారీ షాట్లతో విరుచుకుపడడంతో మ్యాచ్ ఏకపక్షమైంది. మరో ఓపెనర్ కోహ్లీతో కలసి సాల్ట్ తొలి వికెట్‌కు 52 బంతుల్లో 92 పరుగులు జోడించడంతో.. బెంగళూరు అలవోకగా గెలిచింది. బౌండ్రీతో అర్ధ శతకం పూర్తి చేసుకొన్న సాల్ట్‌ను కార్తికేయ అవుట్ చేశాడు. అనంతరం వన్‌డౌన్‌లో వచ్చిన పడిక్కల్‌తో కలసి కోహ్లీ రెండో వికెట్‌కు అజేయంగా 83 పరుగులు జోడించడంతో.. బెంగళూరు మరో 15 బంతులు మిగిలుండగానే గెలుపుగీత దాటింది. ఈ క్రమంలో హసరంగ బౌలింగ్‌లో సిక్స్ బాదిన కోహ్లీ.. టీ20ల్లో తన వందో అర్ధ శతకాన్ని నమోదు చేశాడు.

**శాంసన్ విఫలం..:** ఓపెనర్ జైస్వాల్ అర్ధ శతకంతో ఆకట్టుకోగా.. జురెల్ ఫినిషింగ్ టచ్ ఇవ్వడంతో రాజస్థాన్ గౌరవప్రద స్కోరు చేసింది. ఆరు ఓవర్లు ముగిసే సరికి రాజస్థాన్ 45/0తో నిలిచింది. అయితే, ఆ తర్వాతి ఓవర్‌లో క్రునాల్ బౌలింగ్‌లో శాంసన్ స్టంపౌట్ కావడంతో.. తొలి వికెట్‌కు 49 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వన్‌డౌన్‌లో వచ్చిన పరాగ్.. జైస్వాల్‌కు చక్కని సహకారం అందించాడు. ఈ క్రమంలో 13వ ఓవర్‌లో సింగిల్‌తో జైస్వాల్ ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. ఆ తర్వాతి ఓవర్‌లో పరాగ్‌ను యశ్ అవుట్ చేసి దెబ్బకొట్టాడు. ఇక, హాజెల్‌వుడ్ బౌలింగ్‌లో జైస్వాల్ ఎల్బీగా వెనుదిరిగాడు. 11 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కోహ్లీ క్యాచ్‌వదిలేయడంతో బతికిపోయిన జురెల్..తర్వాత ధాటిగా ఆడడంతో స్కోరు 170 మార్క్ దాటింది.

**కోహ్లీకి లైఫ్..:** 7 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద సందీప్ బౌలింగ్‌లో కోహ్లీ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను పరాగ్ నేలపాలు చేశాడు. లాంగ్ ఆన్ నుంచి వచ్చిన పరాగ్.. నిర్లక్ష్యంగా క్యాచ్‌ను అందుకోవడంతో అది చేజారింది.

**క్యాచ్ చేజార్చిన విరాట్..:** ఫీల్డింగ్‌లో కోహ్లీ ఎంతో చురుగ్గా ఉంటాడనేది తెలిసిందే. అలాంటి విరాట్ చేతిలో పడ్డ బంతి కిందపడిపోవడంతో.. ఫ్యాన్స్ మండిపడుతున్నారు. 17వ ఓవర్‌లో జురెల్ కొట్టిన బంతిని బౌండ్రీ వద్ద నుంచి ముందుకు వచ్చిన కోహ్లీ పట్టినట్టేపట్టి వదిలేశాడు. దీంతో అభిమానులు సోషల్ మీడియాలో విమర్శలు గుప్పిస్తున్నారు.

**స్కోరుబోర్డు**

రాజస్థాన్: జైస్వాల్ (ఎల్బీ) హాజెల్‌వుడ్ 75, శాంసన్ (స్టంప్) జితేష్ (బి) క్రునాల్ 15, పరాగ్ (సి) కోహ్లీ (బి) యశ్ 30, జురెల్ (నాటౌట్) 35, హెట్‌మయర్ (సి) పడిక్కల్ (బి) భువీ 9, రాణా (నాటౌట్) 4; **ఎక్స్‌ట్రాలు: 5; మొత్తం: 20 ఓవర్లలో 173/4; వికెట్ల పతనం:** 1-49, 2-105, 3-126, 4-169; **బౌలింగ్:** భువనేశ్వర్ 4-0-32-1, యశ్ దయాళ్ 4-0-36-1, హాజెల్‌వుడ్ 3-0-26-1, క్రునాల్ పాండ్యా 4-0-29-1, లివింగ్‌స్టోన్ 1-0-8-0, సుయాష్ శర్మ 4-0-39-0.

బెంగళూరు: సాల్ట్ (సి) జైస్వాల్ (బి) కార్తికేయ 65, కోహ్లీ (నాటౌట్) 62, పడిక్కల్ (నాటౌట్) 40; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 17.3 ఓవర్లలో 175/1; వికెట్ల పతనం:** 1-92; **బౌలింగ్:** ఆర్చర్ 4-0-36-0, తుషార్ దేశ్‌పాండే 2-0-21-0, సందీప్ 2.3-0-29-0, తీక్షణ 2-0-21-0, కుమార్ కార్తికేయ 3-0-25-1, హసరంగ 3-0-33-0, పరాగ్ 1-0-10-0.

# బిజినెస్

## భారత్ కోసం ఎలక్ట్రిక్ కారు
### తయారీపై నిస్సాన్ కసరత్తు.. 2027 నాటికి మార్కెట్లోకి


న్యూఢిల్లీ: జపాన్‌కు చెందిన ఆటోమొబైల్ దిగ్గజం నిస్సాన్ భారత మార్కెట్ కోసం అందుబాటు ధరల్లో విద్యుత్ కారు (ఈవీ) తయారీపై కసరత్తు చేస్తోంది. ఈ కారును 2026-27 ఆర్థిక సంవత్సరం చివరి కల్లా మార్కెట్లో విడుదల చేయాలని భావిస్తోంది. అలాగే ఏడు సీట్ల మల్టీ పర్పస్ వెహికల్ (ఎంపీవీ)ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో మార్కెట్లోకి తీసుకురావటంతో ఐదు సీట్ల ఎస్‌యూవీని వచ్చే ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు నిస్సాన్ మోటార్ ఇండియా ఎండీ సౌరభ్ వత్స వెల్లడించారు. భారత్‌లో వ్యాపార విస్తరణపై ప్రణాళికలు ప్రకటించిన నిస్సాన్.. కొత్త వాహనాలు మార్కెట్లోకి విడుదల చేయనున్నట్టు గతంలోనే ప్రకటించింది. ప్రస్తుతం కంపెనీ రెండు కాంపాక్ట్ ఎస్‌యూవీలు సరికొత్త మాగ్నైట్, ఎక్స్-ట్రయల్ విక్రయిస్తోంది. కాగా కొత్తగా విడుదల చేసే కార్లు రెండూ పూర్తిగా జపాన్ డీఎన్ఏ కలిగి ఉండడంతో పాటు బలమైన నిస్సాన్ టెక్నాలజీలు కలిగి ఉంటాయని సౌరభ్ పేర్కొన్నారు. భారత మార్కెట్లో ప్రవేశపెట్టాలనుకుంటున్న ఏడు సీట్ల కాంపాక్ట్ ఎస్‌యూవీ విడుదల తేదీని తదుపరి ప్రకటిస్తామని ఆయన చెప్పారు. ఈ ఏడాది దేశీయ అమ్మకాలు మూడు రెట్లు పెంచడంతో పాటు లక్ష ఎగుమతుల లక్ష్యం పెట్టుకున్నట్టు నిస్సాన్ ఇప్పటికే ప్రకటించింది.

## అరబిందో 'రివారోక్సాబాన్'కు ఎఫ్‌డీఏ గ్రీన్‌సిగ్నల్
హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అరబిందో ఫార్మా మరో ఔషధాన్ని అమెరికాలో మార్కెట్ చేయబోతోంది. కంపెనీ అభివృద్ధి చేసిన 'రివారోక్సాబాన్' టాబ్లెట్లకు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి (యూఎస్ ఎఫ్‌డీఏ) ఆమోదం తెలిపింది. దీంతో కంపెనీ ఈ ట్యాబ్లెట్లను తయారు చేసి, అమెరికాలో మార్కెట్ చేసేందుకు అవకాశం ఏర్పడింది. గుండెపోటు నివారణ, రక్తనాళాల్లో రక్తసరఫరా మెరుగుపరిచేందుకు ఈ ఔషధం ఉపయోగపడుతుంది. ప్రస్తుతం జాన్సెన్ ఫార్మా ఇంక్ ఈ ఔషధాన్ని 'క్సారెల్టో' అనే బ్రాండ్ పేరుతో అమెరికాలో 2.5 ఎంజీ సామర్థ్యాలతో విక్రయిస్తోంది. ఇప్పుడు అరబిందో ఫార్మా ఇవే టాబ్లెట్లను జెనరిక్ వెర్షన్‌లో 'రివారోక్సాబాన్' పేరుతో మార్కెట్ చేయబోతోంది. ఈ ఏడాది జూన్‌లోగా తమ టాబ్లెట్లను అమెరికా మార్కెట్లోకి విడుదల చేస్తామని వెల్లడించింది. 2025 ఫిబ్రవరితో ముగిసిన 12 నెలల కాలానికి గాను అమెరికాలో ఈ ఔషధ విక్రయాలు 850 కోట్ల డాలర్లు (సుమారు రూ.73,610 కోట్లు)గా ఉన్నాయి.

**నేడు మార్కెట్లకు సెలవు**

సోమవారం డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్టాక్ మార్కెట్లు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు. కమోడిటీ, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు. మంగళవారం మార్కెట్లు యధావిధిగా పనిచేస్తాయి.

## సుంకాల అనిశ్చితి
# కొద్ది కాలమే
### కొద్ది నెలల్లో అన్నీ సర్దుకుంటాయి
### టీసీఎస్ సీఈఓ కృతివాసన్


ముంబై: అమెరికా తాజా సుంకాల ప్రభావం భారత ఐటీ రంగంపై పెద్దగా ఉండదని దేశంలోనే అతిపెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) భావిస్తోంది. ఈ సుంకాలతో నెలకొన్న అనిశ్చితి ప్రభావం తాత్కాలికమని టీసీఎస్ సీఈఓ,ఎండీ కృతివాసన్ చెప్పారు. వచ్చే కొద్ది నెలల్లోనే ఈ అనిశ్చితికి తెర పడుతుందని భావిస్తున్నట్టు తెలిపారు. ఈ సుంకాల నేపథ్యంలో క్లయింట్లు ధరలు తగ్గించమని ఒత్తిడి చేస్తున్నట్టు వస్తున్న వార్తలను ఆయన తోసిపుచ్చారు. తమకైతే ఇప్పటి వరకు ఆ పరిస్థితి ఎదురు కాలేదన్నారు. నిజానికి తాము కొన్ని ప్రాజెక్టుల ధర స్వల్పంగా పెంచినట్టు కృతివాసన్ వెల్లడించారు.

**జీడీపీ వృద్ధికి దెబ్బే మూడీస్**

అమెరికా సుంకాలతో చైనా, భారత్‌తో సహా అనేక ప్రధాన ఆసియా దేశాల జీడీపీ వృద్ధి రేటు దెబ్బతినే ప్రమాదం ఉందని మూడీస్ రేటింగ్ హెచ్చరించింది. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం ముదిరినా ఆ ప్రభావం ఆసియా దేశాలపై తప్పదని కూడా స్పష్టం చేసింది.

**బీటీఏతో మేలే**

ట్రంప్ సుంకాలతో భారత కార్ల పరిశ్రమకు పెద్దగా వాటిల్లే నష్టమేమీ లేదని మెర్సిడెస్ బెంజ్ ఇండియా సీఈఓ, ఎండీ సంతోష్ అయ్యర్ తెలిపారు. మన దేశం నుంచి అమెరికాకు కార్ల ఎగుమతులు లేకపోవడమే ఇందుకు కారణమన్నారు. అయితే రూపాయి మారకం రేటు తగ్గటంతో దేశంలో లగ్జరీ కార్ల ధర మరింత పెరిగి ఆ ప్రభావం అమ్మకాలపై పడే ప్రమాదం ఉందన్నారు. అమెరికాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) దీర్ఘకాలంలో భారత్‌కు మేలు చేస్తుందన్నారు.

**చైనా కంటే మన ఐఫోన్లే చౌక**

ప్రతీకార సుంకాలను 90 రోజుల పాటు పక్కన పెడుతూ ట్రంప్ సర్కారు తీసుకున్న తాజా నిర్ణయం కూడా మన దేశానికి మేలు చేయనుంది. దీంతో మన దేశం ఐఫోన్లు, స్మార్ట్‌ఫోన్లు, టాబ్లెట్లు, ల్యాప్‌టాప్‌లు, ఎలక్ట్రానిక్ వినియోగ పరికరాలను చైనా కంటే 20 శాతం తక్కువ ధరకే అమెరికాకు ఎగుమతి చేయగలుగుతుందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. చైనాపై ఇంకా 20 శాతం దిగుమతి సుంకాలు కొనసాగడం, మన దేశ ఉత్పత్తులపై ఎలాంటి సుంకాలు లేకపోవడం ఇందుకు కారణం. అమెరికా ఏటా 2,500 కోట్ల డాలర్ల (సుమారు రూ.2.16 లక్షల కోట్లు) విలువైన స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు దిగుమతి చేసుకుంటోంది. ఇది భారత్‌కు కలిసి వస్తుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

## ఎఫ్‌పీఐల అమ్మకాలు రూ.31,575 కోట్లు
న్యూఢిల్లీ: విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) ఈ నెలలో ఇప్పటి వరకు భారత మార్కెట్ నుంచి రూ.31,575 కోట్లు ఉపసంహరించారు. అంతకు ముందు మార్చి 21 నుంచి 28 తేదీల మధ్య కాలంలో ఎఫ్‌పీఐలు నికరంగా రూ.30,927 కోట్లు ఇన్వెస్ట్ చేయడంతో మార్చి నెలలో తరలించిన నికర నిధుల విలువ రూ.3,973 కోట్లకు తగ్గింది. ఫిబ్రవరిలో రూ.34,574 కోట్లు, జనవరిలో రూ.78,027 కోట్ల మొత్తాలను ఎఫ్‌పీఐలు తరలించుకుపోయారు. దీంతో ఏడాది మొత్తం మీద ఎఫ్‌పీఐలు ఉపసంహరించుకున్న నిధుల పరిమాణం రూ.1.48 లక్షల కోట్లకు చేరింది.

## మ్యూల్ ఖాతాలపై బ్యాంకుల దృష్టి
న్యూఢిల్లీ:సైబర్ కేటుగాళ్లకు ఉపయోగపడుతున్న మ్యూల్ ఖాతాలకు తమంతట తామే తెరదించాలని బ్యాంకులు యోచిస్తున్నాయి. సైబర్ నేరగాళ్లు అక్రమంగా సంపాదించిన సొమ్మును ఈ ఖాతాల ద్వారా స్వాహా చేస్తుంటారు. అక్రమ నగదు లావాదేవీల నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) ప్రస్తుత నిబంధనల ప్రకారం కోర్టులు లేదా దర్యాప్తు సంస్థల అనుమతి లేకుండా బ్యాంకులు తమంతట తాము ఇలాంటి ఖాతాలను స్తంభింప చేయలేవు. ఈ అనుమతులు లభించేందుకు చాలా సమయం పడుతోంది. దీన్ని నివారించేందుకు తమ అంతర్గత సమాచారం ఆధారంగా వెంటనే తమంతట తామే ఈ ఖాతాలను స్తంభింప చేసే అధికారం కావాలని బ్యాంకులు కోరుతున్నాయి.

## 23,200 పైన బుల్లిష్
(ఏప్రిల్ 15-17 తేదీల మధ్య వారా


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

అప్‌ట్రెండ్

గత వారం నిఫ్టీ : 22,829 (-76)


నిఫ్టీ గత వారం 21,744-22,924 పాయింట్ల మధ్యన కదలాడి 76 పాయింట్ల నష్టంతో 22,829 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23,200 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 22,594, 22,763, 23,138, 22,806 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 23,200 బ్రేక్‌డౌన్ స్థాయి: 22,425
నిరోధ స్థాయిలు: 23,025, 23,125, 23,225 (22,925 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 22,625, 22,525, 22,425 (22,725 దిగువన బేరిష్)

### ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్


| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 120 | విజయవాడ | 130 |
| వరంగల్ | 120 | గుంటూరు | 127 |
| కరీంనగర్ | 120 | ఒంగోలు | 127 |
| మహబూబ్‌నగర్ | 120 | చిత్తూరు | 93 |
| కర్నూలు | 120 | నెల్లూరు | 98 |
| విశాఖపట్నం | 124 | అనంతపురం | 98 |
| గోదావరి | 130 | | |

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)


| 14వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 395 | విజయవాడ | 420 |
| వరంగల్ | 397 | గోదావరి | 400 |
| చిత్తూరు | 460 | విశాఖపట్నం | 415 |
| | | దజను గుడ్లు రూ. 60 | |

# 'ఫారెక్స్'లో పెరిగిన పసిడి వాటా
- తగ్గిన అమెరికా ప్రభుత్వ బాండ్స్
- పెట్టుబడుల వ్యూహాలు మార్చిన ఆర్‌బీఐ




ముంబై: విదేశీ మారక ద్రవ్య (ఫారెక్స్) నిల్వల పెట్టుబడుల వ్యూహాన్ని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మార్చింది. అమెరికా ప్రభుత్వ రుణ పత్రాల్లో (బాండ్స్) పెట్టుబడులు తగ్గించి పసిడిలో పెట్టుబడులు పెంచుతోంది. ఈ ఏడాది జనవరి నాటికి ఉన్న 63,060 కోట్ల డాలర్ల (సుమారు రూ.54.61 లక్షల కోట్లు) ఫారెక్స్‌లో 22,570 కోట్ల డాలర్లను (సుమారు రూ.19.54 లక్షల కోట్లు) అమెరికా ప్రభుత్వ రుణ పత్రాల్లో మదుపు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 1,040 కోట్ల డాలర్లు తక్కువ. అమెరికా ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ తాజా వివరాలు విడుదల చేసింది.

**8 నుంచి 11 శాతానికి పసిడి వాటా:** ఇదే సమయంలో మొత్తం ఫారెక్స్ నిల్వల్లో పసిడి వాటా 8 శాతం నుంచి 11 శాతానికి చేరింది. ప్రస్తుతం ఆర్‌బీఐ వద్ద 879 టన్నుల పసిడి నిల్వలు ఉన్నాయి. గడిచిన 14 నెలల్లో 12 నెలలు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతి నెలా సగటున 6.3 టన్నుల చొప్పున బంగారం కొనుగోలు చేసింది.

**కారణాలు ఏంటి?**

ఆర్‌బీఐ ఫారెక్స్ నిల్వల్లో అమెరికా ప్రభుత్వ రుణ పత్రాల వాటా తగ్గడానికి స్పష్టమైన కారణాలు తెలియడం లేదు. మారకం రేటులో మార్పులు లేదా అమ్మకం లేదా కాలం తీరిపోవడం కారణమై ఉండవచ్చని బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) ప్రధాన ఆర్థికవేత్త మదన్ సబ్నవిస్ చెప్పారు. ఏదేమైనా ఆర్‌బీఐ ఫారెక్స్ నిల్వలను ఒకటి రెండు పెట్టుబడులకే పరిమితం కాకుండా మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా పసిడి, యూరో, పౌండ్ వంటి ప్రత్యామ్నాయ పెట్టుబడుల్లోకి వివిధీకరిస్తోందన్నారు. ఇటీవల ప్రధాన కరెన్సీలతో డాలర్ మారకం రేటు గణనీయంగా తగ్గటం ఇందుకు కారణమై ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

## నిరోధ స్థాయి 23,000
టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం కనిష్ఠ స్థాయిల నుంచి బలమైన రికవరీ సాధించి వారం గరిష్ఠ స్థాయి 22,800 సమీపంలో ఆ స్థాయి కన్నా పైన క్లోజయింది. ఈ రికవరీతో తక్షణ ముప్పును కూడా తప్పించుకుంది. కాని ఈ బలమైన రికవరీ ప్రభావం వల్ల వచ్చే వారంలో పుల్‌బ్యాక్ రియాక్షన్ ఏర్పడవచ్చు. అంతే కాదు, గత వారంలో మార్కెట్ తీవ్ర ఆటుపోట్లకు, భారీ ఎగుడుదిగుడులక గురయినందు వల్ల ఈ వారంలో నిలదొక్కుకోవడం తప్పనిసరి. ఇప్పుడు పాజిటివ్ ట్రెండ్‌కు ఆస్కారం ఉన్నప్పటికీ కీలక స్థాయి 23,000 వద్ద కొంత నిరోధం ఎదురుకావచ్చు. ఈ వారంలో మూడే ట్రేడింగ్ దినాలున్నందు వల్ల కన్సాలిడేషన్‌కు కూడా ఆస్కారం ఉంది. 23,000 వద్ద నిఫ్టీ పరీక్షకు గురి కావచ్చు.

**బుల్లిష్ స్థాయిలు:** మరింత పాజిటివ్ ట్రెండ్‌లో ట్రేడయినట్టయితే 23,000 వద్ద స్వల్పకాలిక కన్సాలిడేషన్ ఏర్పడవచ్చు. 1,250 పాయింట్ల ర్యాలీ అనంతరం స్వల్పకాలిక లక్ష్యాన్ని కూడా చేరింది. మరింత స్వల్పకాలిక సానుకూలత కోసం ఈ నిరోధం కన్నా పైన పటిష్ఠంగా క్లోజ్ కావాలి.

**బేరిష్ స్థాయిలు:** 23,000 వద్ద విఫలమైతే అప్రమత్త సంకేతం ఇస్తుంది. మైనర్ మద్దతు స్థాయి 22,700 వద్ద విఫలమైతే మైనర్ బలహీనత ఏర్పడుతుంది. ప్రధాన మద్దతు స్థాయి 22,500. అంతకన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనత ఏర్పడుతుంది.

**బ్యాంక్ నిఫ్టీ:** ఈ సూచీ కూడా మంచి ర్యాలీ సాధించినా 500 పాయింట్ల నష్టంతో 51,000 సమీపంలో క్లోజయింది. ఇక్కడ పరీక్ష ఎదుర్కొనవచ్చు. నిరోధ స్థాయిలు 51,600, 52,000. మైనర్ మద్దతు స్థాయి 50,600 వద్ద విఫలమైతే మైనర్ బలహీనతకు ఆస్కారం ఉంటుంది.

**పాటర్న్:** మార్కెట్ ప్రస్తుతం 23,000 సమీపంలో 25, 50 డిఎంఏల వద్ద పరీక్ష ఎదుర్కొంటోంది. భద్రత కోసం ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి. ఇదే స్థాయిలో "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద బ్రేకౌట్ సాధిస్తే మరింత స్వల్పకాలిక సానుకూల సంకేతం ఇస్తుంది.

**టైమ్:** ఈ సూచీ ప్రకారం గత వారంలో బాటమ్ ఏర్పడింది. సాధారణ పరిస్థితుల్లో తక్షణ డౌన్ ట్రెండ్ ముప్పు ఉండకపోవచ్చు.

| సోమ వారం స్థాయిలు | |
|---|---|
| నిరోధం | 22,930, 23,000 |
| మద్దతు | 22,780, 22,700 |

www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 14-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 359 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి ఉ.8.26 తదుపరి విదియ; నక్షత్రం: స్వాతి రా.12.13 తదుపరి విశాఖ; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: మ.12.40-1.29, మ.3.09-3.58; అమృతఘడియలు: మ.2.18-4.06; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.03; సూర్యాస్తమయం: 6.27 | హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



పేలుడు ధాటికి ధ్వంసమైన బాణసంచా తయారీ కేంద్రం

ఏపీలో బాణసంచా కేంద్రంలో పేలుడు..

## 8 మంది మృతి

మరో 8 మందికి తీవ్ర గాయాలు

షాట్ బాక్స్‌లో మందుగుండు కూరుతుండగా ఘటన.. అనకాపల్లి జిల్లాలో ఘోరం 9

మృతుల కుటుంబాలకు 15 లక్షల పరిహారం

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం: సీఎం బాబు

ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్ర్భాంతి

## ఎస్సీ వర్గీకరణ నేటి నుంచే..



మూడు గ్రూపులు.. 59 ఉప కులాలు..

మొత్తం 15 శాతం రిజర్వేషన్లు

గ్రూపు-1కు 1 శాతం, గ్రూపు-2కు 9, గ్రూపు-3కు 5 శాతం వర్తింపు

ప్రాధాన్య క్రమంలో ఉద్యోగ ఖాళీల భర్తీ

నేడు ఉదయం 11 గంటలకు జీవో 9 విడుదల చేయనున్న రేవంత్ సర్కారు

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాల్లో (ఎస్సీ) బాగా వెనుకబడి, రిజర్వేషన్ల ఫలాలను సరిగా పొందలేకపోయిన కులాల కల నెరవేరుతోంది. రాష్ట్రంలో ఎస్సీలకు ఇప్పటివరకు గంపగుత్తగా అమలైన 15శాతం రిజర్వేషన్లు.. ఇక నుంచి వర్గీకరణ ప్రకారం అందనున్నాయి. అందులోనూ గ్రూపులు, కులాల ప్రాధాన్యతా క్రమంలో ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం ఉదయం 11 గంటలకు ఎస్సీ గ్రూపులు, కులాల వారీగా అందే రిజర్వేషన్ల వివరాలతో జీవో 9ని విడుదల చేయనుంది. అంతకంటే ముందు ఎస్సీ వర్గీకరణపై ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం సచివాలయంలో భేటీ అవుతుంది. ఉత్తర్వులను విడుదల చేసిన అనంతరం మంత్రులు జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి.. ఎస్సీ రిజర్వేషన్ల అమలు జీవో తొలి కాపీని అందిస్తారు. జీవో అమల్లోకి వచ్చినప్పటి నుంచి వెలువడే అన్ని ప్రభుత్వ ఉద్యోగ నియామక ప్రకటనలు, విద్యా సంస్థల ప్రవేశాలకు

మిగతా 12వ పేజీలో...

### చిత్తశుద్ధి చాటుకున్నాం

వర్గీకరణ చేసి మాట నిలుపుకొన్నాం

దశాబ్దాల డిమాండ్‌ను నెరవేర్చాం

వచ్చే జనాభా లెక్కల ఆధారంగా ఎస్సీ రిజర్వేషన్లు పెంచుతాం

మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడి 12



# తెలుగు ఆంగ్లం ఉర్దూలో.. భూ భారతి

## ఏకకాలంలో కోటి మంది బ్రౌజ్ చేసినా సవ్యంగా పనిచేసేలా సర్వర్

రంగుల్లో అక్షరాలు.. పంటలకు ఆకుపచ్చ, సాగునీటికి నీలం రంగులతో లోగో

లోగోలో తెలంగాణ తల్లి విగ్రహానికి చోటు

సైబర్ దాడులపై అప్రమత్తంగా ఉండాలి

అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

నేడు అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎం భేటీ

నేడే ఆవిష్కరణ.. నాగార్జున సాగర్, తిరుమలగిరి, కీసరలో పైలెట్ ప్రాజెక్టు

566 రైతు వేదికల ద్వారా ప్రత్యక్ష ప్రసారం




హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): భూ భారతి వెబ్‌సైట్‌ను తెలుగు, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పోర్టల్‌లో వాడే భాషకు సంబంధించిన ఫాంట్ అందరికీ అర్థమయ్యేలా.. ఆకర్షణీయమైన రంగుల్లో ఉండాలని సూచించారు. ధరణి స్థానంలో తీసుకురానున్న భూభారతి చట్టం, పోర్టల్, లోగో విషయాల్లో వరుస సమావేశాలు నిర్వహిస్తున్న సీఎం.. శని, ఆదివారాల్లో జరిగిన సమీక్షల సందర్భంగా కీలక సూచనలు చేశారు. భూభారతి పోర్టల్ అందుబాటులోకి వచ్చాక నాణ్యమైన వనరులున్న సర్వర్‌ను వినియోగించాలని, ఏకకాలంలో కోటి మంది బ్రౌజ్ చేసినా.. సవ్యంగా పనిచేయాలని ఆదేశించారు. "అంతే కాదు.. సాంకేతికత, అవసరమైన బ్యాకప్‌ను ముందుగానే ఏర్పాటు చేసుకోవాలి. ఇందుకోసం వివిధ రాష్ట్రాలు వినియోగిస్తున్న సాంకేతికతపై అధ్యయనం చేయాలి" అని పేర్కొన్నారు. సైబర్ దాడులను దీటుగా ఎదుర్కొనేలా పోర్టల్‌ను సన్నద్ధం చేయాలన్నారు. "రాజకీయంగా మమ్మల్ని ఎదుర్కోలేనివాళ్లు.. సాంకేతికంగా కృత్రిమ మేధ(ఏఐ)ని వినియోగించి, పోర్టల్‌లో బగ్స్‌ని సృష్టించే ప్రమాదాలున్నాయి. అధికారులు కూడా సైబర్ సెక్యూరిటీపై దృష్టిసారించాలి. ఏఐని వినియోగించుకుని, సర్వర్‌కు, పోర్టల్‌కు భద్రత కల్పించాలి. ఏఐ సాయంతో ఎప్పటికప్పుడు సైబర్ సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించేలా నిఘా ఉంచాలి. పటిష్ఠమైన ఫైర్‌వాల్స్‌ను వినియోగించాలి. అవసరమైతే సైబర్‌క్రైమ్ విభాగం సహకారం తీసుకోవాలి. వందేళ్లు పనిచేసేలా పోర్టల్ ఉండాలి. పోర్టల్ రియల్-టైమ్ అనుభవంలో ఊహించని సమస్యలు తలెత్తే ప్రమాదముంది. అలాంటి సమస్యలు వచ్చిన వెంటనే సరిచేయగలగాలి. అందుకే.. ఈ పోర్టల్ నిర్వహణను విశ్వసనీయత ఉన్న సంస్థకు అప్పగించాలి" అని మార్గనిర్దేశనం చేశారు. ధరణితో ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను భూభారతి పోర్టల్ పరిష్కరించేలా ఉండాలన్నారు. ఇందుకోసం పోర్టల్ అందుబాటులోకి రాగానే.. ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని

మిగతా 11వ పేజీలో...

### జూన్ 2 నుంచి రాష్ట్రమంతా భూ భారతి 11

ప్రజా ప్రయోజనాలు కాపాడేందుకే కొత్త చట్టం

మేలో గ్రామ పాలనాధికారుల నియామకం

భూ భారతిపై గందరగోళం సృష్టిస్తే చర్యలు

వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ఇదే రెఫరెండం

'ధరణి'తో కొల్లగొట్టిన భూములపై త్వరలో ఆడిట్.. మీడియాతో ఇష్టాగోష్ఠిలో పొంగులేటి

### పండుగలా అంబేడ్కర్ జయంతి

- నేడు నిర్వహించేందుకు సర్కారు ఏర్పాట్లు
- ట్యాంక్‌బండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించనున్న ముఖ్యమంత్రి, మంత్రులు 11
- భావితరాలకు స్ఫూర్తి అంబేడ్కర్: సీఎం రేవంత్‌రెడ్డి
- అంబేడ్కర్ వల్లే తెలంగాణ ఏర్పాటు: కేసీఆర్





### యువ వికాసానికి సర్వర్ బిజీ సమస్య

దరఖాస్తుల సమర్పణలో ఇబ్బందులు

మూడు రోజులుగా సర్వర్ బిజీబిజీ

అర్ధరాత్రి కూడా అదే పరిస్థితి 9

పథకం దరఖాస్తుకు నేటితో గడువు పూర్తి

ఇప్పటికే 16 లక్షలకు పైగా దరఖాస్తులు!

మరో వారం గడువు ఇవ్వాలని డిమాండ్

## జానారెడ్డిది ధృతరాష్ట్రుడి పాత్ర



నాకు మంత్రి పదవి రాకుండా అడ్డుపడుతున్నారు

జానా లేఖతోనే మంత్రివర్గ విస్తరణ ఆలస్యం

నేను అర్హుడిననుకుంటేనే మంత్రి పదవి ఇవ్వాలి

రిజర్వేషన్ కోటాలో కాదు.. మాటిచ్చారనీ కాదు

అధిష్ఠానం ఇస్తానంటే కొందరికి చెమటలు పడ్తున్నయ్.. పదవి కోసం అడుక్కునే స్థితిలో లేను

అన్నదమ్ములిద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పా?

నాకే ఇలా జరుగుతుంటే బాధనిపిస్తోంది: కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్/చండూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ధర్మరాజులా ఉండాల్సిన జానారెడ్డి ధృతరాష్ట్రుడి పాత్రను పోషిస్తున్నారని మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు మంత్రి పదవి రాకుండా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన కొందరు కీలక నాయకులు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. 16 నెలలుగా మంత్రివర్గ విస్తరణ జరగకపోవడంతో పదవులన్నీ ఖాళీగా ఉన్నాయని, మంత్రి పదవులు ఇచ్చే సమయంలో మాజీ మంత్రి జానారెడ్డి అధిష్ఠానానికి ఉత్తరం రాయడంతో విస్తరణ జాప్యం అవుతోందన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ, నల్లగొండ జిల్లా చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గాల ప్రమాణ స్వీకార కార్యక్రమాలకు హాజరైన

మిగతా 11వ పేజీలో...



## 'కంచ గచ్చిబౌలి'పై ఏం చేద్దాం?

ఢిల్లీలో సీఎస్ శాంతికుమారి సమాలోచనలు

న్యాయవాదుల బృందంతో సుదీర్ఘ భేటీ

16న సుప్రీంకు సమర్పించాల్సిన నివేదిక, అమికస్ క్యూరీ అడిగిన ప్రశ్నలపై చర్చలు

కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టులో 'బీ ద చేంజ్ వెల్ఫేర్ సొసైటీ' పిటిషన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో సుప్రీంకోర్టుకు సమర్పించబోయే నివేదికపై రాష్ట్ర ప్రభుత్వం ముమ్మర కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నేతృత్వంలో అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ సహా సుమారు పది మందితో కూడిన అధికారుల బృందం ఢిల్లీలో రెండు రోజుల పాటు సమాలోచనలు చేసింది. శనివారం ఢిల్లీకి చేరుకున్న బృందం ఆదివారం సాయంత్రం

మిగతా 11వ పేజీలో...

భారత్ అమ్ముల పొదిలో

## లేజర్ అస్త్రం!

లేజర్ పుంజాలతో డ్రోన్ల విధ్వంసక వ్యవస్థ


దేశంలో తొలిసారి అత్యంత అధునాతన డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్.. ఎంకే-2(ఏ) ప్రయోగం

కర్నూలులో పరీక్షలు నిర్వహించిన డీఆర్‌డీవో

30 కిలోవాట్ లేజర్ సామర్థ్యంతో విధ్వంసం

నిఘా సెన్సార్లకు అడ్డుకట్ట, తొలి ప్రయోగం సక్సెస్.. డీఈడబ్ల్యూ దేశాల సరసన భారత్

ఇదో గేమ్ చేంజర్: డీఆర్‌డీవో





లేజర్ పుంజాలతో డ్రోన్‌పై దాడి చేస్తున్న డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్.. ఎంకే-2(ఏ)

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: భారత్ అమ్ముల పొదిలో అధునాతన ఫ్యూచరిస్టిక్ 'స్టార్ వార్స్'గా పేర్కొంటున్న లేజర్ అస్త్రాలు త్వరలోనే చేరనున్నాయి. లేజర్ పుంజాలతో శత్రువుల డ్రోన్లు, క్షిపణులను విధ్వంసం చేయగల లేజర్ డైరెక్టెడ్ ఎనర్జీ వెపన్(డీఈడబ్ల్యూ) ఎంకే-2(ఏ)ను రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీవో) తొలిసారి ప్రయోగాత్మకంగా పరీక్షించి.. విజయం సాధించింది. ఏపీలోని కర్నూలులో ఉన్న నేషనల్ ఓపెన్ ఎయిర్ రేంజ్‌లో ఆదివారం.. ఎంకే-2(ఏ)ను వినియోగించి లేజర్ పుంజాలతో డ్రోన్ల సమూహాలను, ఫిక్స్‌డ్ వింగ్ యూఏవీలను ధ్వంసం చేసింది. ఈ లేజర్ పుంజాలు

మిగతా 8వ పేజీలో...

## గడువు వద్దు!

బిల్లుల ఆమోదం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు సమయం నిర్దేశించడాన్ని పునఃపరిశీలించాలి

సుప్రీంలో రివ్యూ పిటిషన్ వేయనున్న కేంద్రం

కేంద్రం లేవనెత్తిన పలు అంశాలను కోర్టు పరిగణనలోకి తీసుకోలేదంటున్న అధికారులు

సాంకేతికంగా రద్దయిన బిల్లులకు ఈ తీర్పు ప్రాణం పోసేలా ఉందని వెల్లడి 8



### హెచ్ఐవీ రోగుల్లో మహిళలే ఎక్కువ

తెలుగు రాష్ట్రాల్లో 3.53 లక్షల రోగుల్లో మహిళలు 1.93 లక్షల మంది! 9

హెచ్ఐవీ కేసులు దక్షిణాదిలోనే అధికం

56 శాతం రోగులు ఐదు రాష్ట్రాల్లోనే

తెలంగాణలో 1.31 లక్షల మంది రోగులు

ఐదో స్థానంలో రాష్ట్రం.. 2వ స్థానంలో ఏపీ

### లా కమిషన్ చైర్‌పర్సన్‌గా జస్టిస్ దినేశ్ మహేశ్వరి!

ఈ వారంలోనే నోటిఫికేషన్ 8

## అమరావతి.. డబుల్!

ఏపీ రాజధాని విస్తరణకు మరో 44 వేల ఎకరాలు?

4 మండలాల్లోని 11 గ్రామాల్లో భూ సమీకరణకు ప్రతిపాదన

కొందరు రైతుల నుంచి అభిప్రాయ సేకరణతో వెలుగులోకి

హరిశ్చంద్రాపురం, వడ్డమానులో పూర్తిగా..

పెదపరిమిలో పాక్షిక సమీకరణ

వైకుంఠపురం, ఎండ్రాయి, కర్లపూడి, మోతడక, నిడుముక్కల, తాడికొండ, కంతేరు, కాజల్లో కూడా..

తాజాగా అమరావతివైపు పలు సంస్థల చూపు

ఎయిర్‌పోర్ట్, రైల్వే లైన్, మెట్రోకు ఇప్పుడున్న భూములు చాలవు

అందుకే సమీకరణకు యోచన?



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పరిధి రెట్టింపు కాబోతోందా..? మరికొన్ని వేల ఎకరాల భూములను ల్యాండ్ పూలింగ్ కింద తీసుకోవాలని సీఆర్‌డీఏ భావిస్తోందా..? గత కొన్ని రోజులుగా రైతులతో అధికారులు జరుపుతున్న చర్చలు దీనినే సూచిస్తున్నాయని అంటున్నారు. అనేక ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు అమరావతికి వచ్చేందుకు ఆసక్తి చూపుతుండడంతో రాజధానిని విస్తరించాలన్న యోచనతో.. మరో 44 వేల ఎకరాల భూములను సమీకరణ కింద తీసుకునేందుకు సీఆర్‌డీఏ ప్రతిపాదన రూపొందించినట్లు తెలుస్తోంది. 12

హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం సమీపంలో వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా చేపట్టిన నిరసన కార్యక్రమానికి భారీగా తరలివచ్చిన ముస్లింలు



## వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా భారీ నిరసన

అంబేడ్కర్ విగ్రహం వద్ద ముస్లింల దీక్ష

హాజరై సంఘీభావం తెలిపిన టీపీసీసీ చీఫ్

బషీర్‌బాగ్‌లో ముస్లింల ర్యాలీ 12

19న భారీ నిరసన సభ: అసదుద్దీన్ ఒవైసీ

### బెంగాల్‌లోకి బంగ్లా ఉగ్రవాదం

'వక్ఫ్' అల్లర్లలో జేఎంబీ ఉగ్రసంస్థ.. 7 జిల్లాల్లోకి విస్తరణ

మదర్సాల నుంచి ఎంపికలు.. కేంద్ర నిఘా వర్గాల ఆందోళన

అల్లర్లతో మాల్దాకు పారిపోయిన 400 మంది హిందువులు

కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించండి: బీజేపీ 8




# ఎవరైతే నా ఇంటికి ఎన్నటికీ రాబోరో

ఎవరైతే నా ఇంటికి ఎన్నటికీ రాబోరో
వాళ్లను కలవడానికి
నేనే వాళ్ల దగ్గరికి పోతా

ఓ పొంగుతున్న నది ఎన్నటికీ రాదు నా ఇంటికి

నదుల్లాంటి మనుషుల్ని కలవడానికి
నదీ తీరానికి వెళ్తా
ఈతలు కొడతా, మునిగిపోతా

కొండలు గుట్టలు శిలలు చెరువులు
అసంఖ్యాకమైన చెట్లు పొలాలు
ఎన్నటికీ రావు నా ఇంటికి

పొలాలూ గాదెల్లాంటి మనుషుల్ని కలవడానికి
ఊరూరికీ, అడవులూ వంకలకూ వెళ్తా

ఎప్పుడూ పనిలో ఉండే వాళ్లను
నేను తీరికగా కాదు
వాళ్లతో ఒక అవసరమైన పని లాగా

కలుస్తూ ఉంటా—

దీన్ని నా ఏకైక చివరి కోరికలా
మొట్టమొదటి కోరికగా ఉంచుకోవాలనుంది.

హిందీ మూలం ■ **వినోద్ కుమార్ శుక్లా**

అనువాదం ■ **సుమనస్పతి రెడ్డి**

✆ 96761 80802

సోమవారం 14 ఏప్రిల్ 2025

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్

### గోవిందరాజు సీతాదేవి పురస్కారం

గోవిందరాజు సీతాదేవి జాతీయ సాహితీ పురస్కారాన్ని నవలా విభాగంలో ఆర్.సి. కృష్ణస్వామి రాజు ('మేకల బండ'), కథా సంపుటి విభాగంలో కె.ఎ. మునిసురేష్ పిళ్లె ('గారడీవాడు') ఎంపికయ్యారు. త్వరలో నెల్లూరులో పురస్కార ప్రదానం జరుగుతుంది. పురస్కారానికి మొత్తం 10 నవలలు, 35 కథా సంపుటాలు వచ్చాయి. పంపిన రచయితలు అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు.

**గోవిందరాజు సుభద్రాదేవి**

### బిరుదురాజు శతజయంతి

సాహిత్య అకాడమీ - శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో బిరుదురాజు రామరాజు శతజయంతి సదస్సు ఏప్రిల్ 16 ఉ.10గంటలకు ఎన్‌టిఆర్ కళామందిరం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, నాంపల్లి, హైదరాబాద్‌లో జరుగుతుంది. స్వాగతోపన్యాసం సి.మృణాళిని, అధ్యక్షులు టి. ఉదయవర్లు, ముఖ్య అతిథి వెలుదండ నిత్యానందరావు, కీలకోపన్యాసం అమ్మంగి వేణుగోపాల్, గౌరవ అతిథి కె. లీలావతి. పాకనాటి జ్యోతి, గౌరీశంకర్, తిరునగరి దేవకీదేవి తర్వాతి మూడు సమావేశాలకు అధ్యక్షత వహిస్తారు. శతజయంతి స్మారక సంచిక ఆవిష్కరణ ఉంటుంది.

**సాహిత్య అకాడమీ**

### నాగభైరవ సాహితీ పురస్కారం

నాగభైరవ సాహిత్య పీఠం ఈ సంవత్సరం అనువాద సాహిత్యాన్ని ఆహ్వానిస్తున్నది. తెలుగు లోకి అనువాదమై 2021–2024 సంవత్సరాల మధ్య ప్రచురితమైన కథా సంపుటాలు, నవలలను నాలుగేసి ప్రతులను మే 10 లోపు పంపాలి. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో రచనలకు వరుసగా రూ.10వేలు, రూ.5వేలు బహుమతులు. 2025 ఆగస్టు 17న బహుమతి ప్రదాన సభ. ప్రతులు పంపాల్సిన చిరునామా: నాగభైరవ ఆదినారాయణ, 202 - శ్రీ వెంకటసామి రెసిడెన్సీ, 2వ లైన్, రామయ్య నగర్, ఒంగోలు - 523 002, ప్రకాశం జిల్లా, ఆంధ్ర ప్రదేశ్. వివరాలకు: 98497 99711.

**నాగభైరవ ఆదినారాయణ**

### మలిశెట్టి పురస్కారం

జజ్జూరి వేణుకు మలిశెట్టి సీతారాం సాహిత్య పురస్కార ప్రదానం, ఎమ్మెస్సార్ కథల పోటీలో బహుమతి పొందిన కథలతో 'కథా ప్రపంచం' కథా సంకలనం 2024 ఆవిష్కరణ, జొన్నవిత్తుల శ్రీరామచంద్ర మూర్తి నవల 'సాక్షాత్కారం' ఆవిష్కరణ, పలమనేరు బాలాజి కవితా సంపుటి 'లోపలేదో కదులుతున్నట్టు' ఆవిష్కరణ... ఈ కార్యక్రమాలు ఏప్రిల్ 20 ఉ.10గంటల నుండి రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతాయి. వివరాలకు: 99850 13234.

**మలిశెట్టి శ్యాం ప్రసాద్**

## 'Final Mission'

### షైనల్ కౌడు

చిన్నదాన్ని నేను
చిన్నతల నాది
అందులో తెలివి ఉందో లేదో తెలీదు
లేదనే అనుకుంటున్నాను
ఉంటే ఇలా మాట్లాడను కదా!

పాతకాలం దాన్ని నేను
శాంతి, గాంధీ, అహింస అనుకుంటూ
పాత మాటల్ని మననం చేసుకుంటూ
తిరుగుతున్నాను

అడవిని నమ్మిన దాన్ని నేను
అడవి అంటే అమ్మ
అడవి అంటే అన్నం
అందుకే అడవి అంటే మక్కువ

Insurgency, counterinsurgency
దశాబ్దాల రక్త చరిత్రను చూసింది అడవి
సల్వాజుడుం, గ్రీన్ హంట్, ఆపరేషన్ సమాధాన్,
ఇప్పుడేమో కగార్ - ఫైనల్ మిషన్

హింస ప్రతిహింసల మధ్య తల్లడిల్లిపోతుంది అడవి
ఆదివాసీలు అడవి బిడ్డలు
పాపం, ఇప్పపూలు రాలినట్టు రాలిపోవడం
చూడలేకపోతున్నాను



ఆదివాసీలు ప్రజలే కదా!
ప్రజలు రాజ్యానికి పిల్లలే కదా!
సొంత పిల్లల్ని చంపుకోవడం న్యాయమేనా?
Genocide! ఈ ఊచకోత ఎవరి కోసం?
'శాంతి చర్చలు' శాంతిని ఇస్తాయి గాని,
'ఆపరేషన్ సమాధాన్'తో శాంతి వస్తుందా?

సెకండ్ సిటిజెన్‌ని నేను
తెలీక ప్రశ్నిస్తున్నాను
ఏమీ అనుకోవద్దు
ముందే చెప్పాను
చిన్నతల నాది

■ **మహెజబీన్**

# అంబేడ్కర్ తాత్త్వికతకు ఆనాటి కవితాభాష్యం

జాతీయోద్యమం, తదనంతర వామపక్ష, విప్లవోద్యమాల నేపథ్యంలో వెలువడిన కవిత్వంలో మహాత్మా గాంధీ, కారల్ మార్క్స్, లెనిన్, మావోల ప్రభావం ప్రగాఢంగా కనిపిస్తుంది. ఈ దిశగా కొంత పరిశోధన జరిగింది. ఆధునిక సాహిత్యంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ప్రభావం గురించి సమగ్ర చర్చ జరగాల్సిన అవసరముంది. సమకాలీన సంక్లిష్ట సందర్భానికి ఈ చర్చ దారిదీపంలా వెలుగునిస్తుంది. రాజ్యాంగ నైతికత దిశగా సృజనకారులు దృష్టి సారించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుంది. ఆది ఆంధ్ర ఉద్యమం నుండి ఈనాటి దళిత ఉద్యమం వరకూ వెలువడిన వందేళ్ల సాహిత్యంలో అంబేడ్కర్ స్ఫూర్తిని విశ్లేషిస్తేనే తెలుగు విమర్శ పరిపుష్టమవుతుంది.


కుసుమ ధర్మన్న నుండి ఈనాటి దళిత కవుల వరకూ ఎంతోమంది అంబేడ్కర్ ఆశయాలను సముచితంగా కవిత్వీకరించారు. అంబేడ్కర్ తాత్త్వికతను శ్వాసగా ఏకైక ధ్యాసగా భావించి ప్రభావశీలమైన కవిత్వం, పాటలు రాసిన ప్రజాకవి రావూరి ఏకాంబరం. నిబద్ధుడైన 'భీమ' కావ్యకర్తగా కార్యకర్తగా అణగారిన వర్గాల్లో ఏకాంబరం అనంత చైతన్యాన్ని కలిగించాడు.

అంబేడ్కర్ సిద్ధాంతాన్ని 'సిరానిష్ఠం' చేసుకొన్న ప్రజాకవి రావూరి ఏకాంబరం, కృష్ణా జిల్లా పామర్రు సమీపంలోని నల్లకుంట గ్రామంలో 1924 సెప్టెంబర్ 24న జన్మించాడు. తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. మాల సామాజిక వర్గానికి చెందిన కుటుంబంలో పుట్టిన ఏకాంబరం ఎంతో కష్టపడి కాకినాడ పిఆర్ కళాశాలలో డిగ్రీ విద్యను అభ్యసించాడు. హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయన పౌర సంబంధాల అధికారిగా 20ఏళ్ళ సేవలందించాడు. గన్నవరం శాసన సభ్యుడిగా షెడ్యూల్ కాస్ట్ పెడరేషన్ పార్టీ నుండి పుచ్చలపల్లి సుందరయ్యపై పోటీ చేసి ఓడిపోయాడు. అంబేడ్కర్ అడుగుజాడల్లో మడమ తిప్పకుండాసాగిపోయిన ఈ ధన్యజీవి 2001 ఏప్రిల్ 21న తుది శ్వాస విడిచాడు.

విజయవాడ, గుడివాడ ప్రాంతాల్లో 1944లో జరిగిన బహిరంగ సభల్లో అంబేడ్కర్ ఆంగ్ల ప్రసంగాన్ని తెలుగులోకి అనువాదం చేసిన ఏకాంబరం, ఆ మహా నాయకుని దృష్టిని ఆకర్షించాడు. ఈ సందర్భంలోనే ఏకాంబరం రాసిన "డాక్టరో అంబేడ్కరా! నీ నాయకత్వం లోకమెల్లను మేలు కొల్పెను" అనే పాట ఉభయ గోదావరి జిల్లాల్లో 'భీమ' మంత్రమై మారు మోగింది. "ఇంత పెద్ద విశాలదేశము/ సెంటు భూమి మాకు లేదు/ కసవు గుంటలే కాపురాలు/ జోరుగా పెనుగాలి వీచెను/ జోరుమని జడివాన కురిసెను/ కూలి నాలి జనాళి కొంపలు/ కూలిపోతే కష్టమెవరికి/ మాలవాడని మాదిగోడని మారు పేరు చండాలుడాయని/ మాల మాదిగ లేకమైతే మారిపోదా కాలచక్రం" అంటూ లయాన్వితంగా సాగే ఈ పాటకు నేటికీ ప్రాసంగికత ఉంది. చోడగిరి చంద్రరావు వందలాది సభల్లో ఈ పాటను ఆలపించి, ప్రజలను ఉర్రూతలూగించాడు. ఈ పాట విని అంబేడ్కర్ ఆనంద పరవశుడై కన్నీరు పెట్టుకున్నాడని పొనుగుమట్ల విష్ణుమూర్తి తన పరిశోధనా గ్రంథంలో రాశాడు.

రావూరి ఏకాంబరం ఆశు కవి. ప్రజాసమూహంలో పర్యటించే క్రమంలో సందర్భానుసారంగా ఆశువుగా, భావగర్భితంగా ఎన్నో పద్యాలు, పాటలు ఆలపించేవాడు. 1944 నుండి 1980 వరకూ ఏకాంబరం ఎన్నో పద్యాలు, పాటలు రాశాడు. వీటిలో చాలావరకు పత్రికల్లో ప్రచురితం కాకపోయినప్పటికీ పాత తరం అంబేడ్కరీయుల గుండె గొంతుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. 1984లో రావూరి ఏకాంబరం సాహితీ ప్రచురణ కమిటీ ఏర్పడి ఆయన పద్యాల్లో కొన్నింటిని సేకరించి 'అంబేద్కరో సమర సింహ' పేరుతో పద్యకవితల సంకలనాన్ని ప్రచురించారు. 46 పద్య కవితలున్న ఈ సంకలనం ఎంతో విలువైనది. జస్టిస్ కొత్తపల్లి పున్నయ్య, బొజ్జతారకం విశ్లేషణాత్మకమైన ముందు మాటలు రాశారు. ఆంధ్ర ప్రాంతంలో అంబేడ్కర్ పర్యటించడానికి మూలకారకుడైన నందనార్ హరికి ఈ గ్రంథాన్ని అంకితం చేశాడు కవి.

అంబేడ్కర్ ఔన్నత్యాన్ని, ఆయన బహుముఖీన ఉద్యమ కార్యాచరణ ఆవశ్యకతను, దేశ పునర్నిర్మాణానికి అవసరమైన సాంస్కృతిక విలువలను ఈ కావ్యం ద్వారా ఏకాంబరం చాటిచెప్పాడు. "నీ మహోజ్వల నిరుపమ నిర్విరామ/ సర్వతోముఖ విప్లవ సమర జ్వాల/ సమతకు పునాది వేసెను భీమ రాయ! భావ విప్లవ సామ్రాజ్య సార్వ భౌమ" అంటూ, నాలుగు దశాబ్దాల పాటు సాగిన అపూర్వమైన అంబేడ్కర్ పోరాటాన్ని నాలుగు పాదాల్లో ఏకాంబరం సముచితంగా పద్యీకరించాడు. "దేశభక్తుడెవడొ, దేశద్రోహియెవడొ/ గత చరిత్ర తవ్వి కథలు చెప్పి" పాలకులకు అంబేడ్కర్ దిక్సూచిగా నిలిచాడని ఈ కవి నిర్ధారించాడు. కులం, మతం, సంస్కృతి, భగవద్గీత, ప్రజాస్వామ్యం, బ్రాహ్మణవాదం, ప్రతిభ, గాంధీ తత్త్వం, రిజర్వేషన్లు, కులాంతర వివాహాలు తదితర అంశాలను అంబేడ్కర్ ఆలోచనల వెలుగుల్లో ఈ కవి నిర్వచించాడు. వాటి చుట్టూ రాజకీయ రహస్యాలను బట్టబయలు చేశాడు.




> 'అంబేద్కరో సమరసింహ' పద్య కవితాసంపుటి అంబేడ్కర్ తాత్త్వికతకు ఒక సాహిత్య మేనిఫెస్టో లాగా, రావూరి ఏకాంబరం నిశిత విమర్శనా శక్తికి అక్షర దర్పణంలా కనిపిస్తుంది. నిష్ఠూరమైన నిజాలను, కఠినమైన వాస్తవాలను, ఆచరణ యోగ్యమైన సామాజిక సత్యాలను తన పద్యాల ద్వారా కవి తేటతెల్లం చేశాడు 'పీడిత జననేత భీమ రాయ!', 'భీమరాయ అంబేడ్కరో సమరసింహ!' లాంటి మకుటాలతో శతక శైలిలో ఈ కావ్యాన్ని ఏకాంబరం రచించాడు.




ఈ పద్య కవితా సంపుటి అంబేడ్కర్ తాత్త్వికతకు ఒక సాహిత్య మేనిఫెస్టోలాగా, రావూరి ఏకాంబరం నిశిత విమర్శనా శక్తికి అక్షర దర్పణంలా కనిపిస్తుంది. నిష్ఠూరమైన నిజాలను, కఠినమైన వాస్తవాలను, ఆచరణ యోగ్యమైన సామాజిక సత్యాలను తన పద్యాల ద్వారా కవి తేటతెల్లం చేశాడు. "బోధిసత్వుపైన పోటీగా బ్రాహ్మణుల్/ మాంస భక్షణమును మానివేసి/ మాంసభక్షకులని" (గో మాంస భక్షణ) అంటరాని ప్రజలను వెలివేశారని బౌద్ధానికి వ్యతిరేకంగా రగిలిన అలనాటి కుహనావ్యూహాలను కవి తెలియపరిచాడు. 'పీడిత జననేత భీమరాయ!', 'భీమరాయ అంబేడ్కరో సమరసింహ!' లాంటి మకుటాలతో శతక శైలిలో ఏకాంబరం ఈ కావ్యాన్ని రచించాడు. 'విశ్వకళ్యాణదాయక', 'విప్లవాలరేడ', 'దళిత సాహితీ విధాత', 'నవ్య బౌద్ధధర్మ కావ్యశిల్పి' లాంటి ఔచితీమంతమైన విశేషణాలు అంబేడ్కర్ అసాధారణ మూర్తిమత్వానికి నిదర్శనంగా కనిపిస్తాయి.

ప్రాచీన, ఆధునిక సాహిత్యధోరణులపై ఏకాంబరం కన్నెర్రజేశాడు. బాస, కాళిదాస, వ్యాస, వాల్మీకులు వస్తుపరంగా ఒకే మూస పద్ధతిలో కావ్య రచన గావించారని, "బ్రాహ్మణాధిక్యమున్, బ్రాహ్మణోద్ధరణమున్ బోధించు గ్రంథాలు" (వ్యాసాదులు) రాసారని తద్వారా "బ్రాహ్మణేతరులను మానసిక బానిసలుగా" మార్చివేశారని ఏకాంబరం తీవ్రంగాఆరోపించాడు. "పాలు బోసి పెంచు పాడు సాహిత్యము/ మూఢ నమ్మకాలు ముదిరిపోవ" అంటూ అంధవిశ్వాసాలను పోషించేది పాడు సాహిత్యమని కవి త్రోసిపుచ్చాడు. సాహిత్యాన్ని మలుపు తిప్పిన అభ్యుదయ రచయితల సంఘం, విప్లవ రచయితల సంఘం పరిమితులను సాహసోపేతంగా ప్రశ్నించాడు. సాహిత్యంతో సమరభేరి మోగించిన ప్రగతి శీల రచయితలకు "దండెత్త కులముపై దమ్ములు లేవని" వాదించాడు. "అడ్డుగోడ కులము, అడ్డమస్పృశ్యత/ వర్గదృష్టి జంపు, ప్రగతి జంపు/ అడ్డుగోడ మరిచి అరచెదరేలరా!" (అరసం, విరసం) అంటూ కుల మనే అడ్డు గోడలు కూల్చకుండా విప్లవం విజయవంతం కాదని చెప్పిన అంబేడ్కర్ దృష్టితో ఏకాంబరం రచయితలను నిరసించాడు. "మార్క్సును స్మరియించు, మావోను స్మరియించు/ పిల్లి మొగ్గలేయు కుల మడ్డు పడగానే" అని మేధావుల వైఖరిని దుయ్యబట్టాడు. "పిట్సుబర్గులోన వెంకన్న ప్రతిమను/ దర్శనంబు చేసి పరవశించు/ శ్రీశ్రీయా మార్క్సిస్టు?" అని మహాకవిని కూడా నిలదీశాడు. దళితేతరులు అంబేడ్కర్ స్మారక సభలను, వైశ్యేతరులు గాంధీ సభలను, కమ్మజనేతరుల్ త్రిపురనేని రామస్వామి చౌదరి స్మారక సభలను నిర్వహించినపుడే విశ్వ సోదర భావము వెల్లివిరుస్తుందని ఈ కవి పిలుపునిచ్చాడు.

దళిత విద్యావంతులు, మేధావులు తమ జాతి లోని నిరుపేదల, నిరక్షరాస్యుల ఉద్ధరణకు ఏమాత్రం పాటుపడటం లేదని చివరి దశలో అంబేడ్కర్ బాధపడ్డాడు. "దళిత మేధావులు దాసానుదాసులైరి/ దళిత మేధావులు దండగ సరుకైరి, దళితుల తెగనమ్ము త్రాష్టులైరి" అంటూ ఏకాంబరం విమర్శించాడు. దళిత ప్రతినిధులు పాలక 'పార్టీల పాలేర్లు'గా మారిపోతున్నారని ఆవేదన చెందాడు. ఈ మేధావులు దండకమ్ములు మాని, దళితుల చరిత్రను వెలికి తీయాలని, దాస్యభాష్యాలు మాని సూటిగా సత్యాలు తెలియ చెప్పాలని హితవు పలికాడు. "నీవు పెట్టిన భిక్షకు నిజము తండ్రి! కుక్క మూతి పిందెలు కాచెనకట! అని కవి వాపోయాడు." "దాస్య జాడ్య జనిత దౌర్భాగ్య శేఖరుల్" అని తన జాతి జనులను ఆగ్రహంగా నిందించాడు. "సిద్ధాంతములు నాస్తి, రాద్ధాంతములు జాస్తి/ సిగపట్లు జాస్తయ్యె సిగ్గులేక/ స్వార్థ ప్రయోజనాల్, బహునాయకత్వాలతో" అంబేడ్కరీయులే అంబేడ్కరీయులకు ఆగర్భశత్రువులగా మారుతున్నారని ఆత్మ విమర్శ దృక్కోణంలో నుండి ఆరోపించాడు. బహుజనులకు మాల మాదిగలన్న చులకన అని, పై కులాలకు వీరు పచ్చి బానిసలని, కులపిశాచిని కూల్చంగా కలిసి రావాలని బహుజనులకు కవి పిలుపు చెప్పాడు. "మతకలహాలలో మృతి చెందు బహుజనుల్/ అగ్రకులోన్మాదులాదరికె రారు" అని మతకలహాల్లోని హింసను వ్యతిరేకించాడు.

ప్రత్యేకంగా తెలుగు భాషా సాహిత్యాలను, వ్యాకరణాన్ని అధ్యయనం చేయనప్పటికీ ఏకాంబరం ప్రతిభావంతంగా పద్య రచన చేశాడు. పంచమాత్రా గణాల ప్రయోగంతో అలవోకగా సీస పద్యాలను పాఠకుల హృదయ క్షేత్రాల్లో కదం తొక్కించాడు. ప్రజాకవుల పాటల్లా వ్యవహారిక భాషలో ఆటవెలది, తేటగీతి పద్యాలను తీర్చిదిద్దాడు. కావ్య శిల్పానికి ప్రాధాన్యత నివ్వకుండా జనజాగృతియే ధ్యేయంగా, అంబేడ్కర్ ఆశయాల ప్రచారానికి, దళిత చైతన్యానికి వాహికగా పద్యాన్ని మలుచుకున్నాడు. నిశిత భావ ప్రకటనకు యతి ప్రాసలు ప్రతిబంధకమైన సందర్భంలో ఛందో నియమాలను కూడా ధిక్కరించాడు. అర్ధశతాబ్దం క్రితమే స్పష్టమైన అంబేడ్కర్ దృక్పథంతో, ప్రగాఢమైన భావ సాంద్రతతో రావూరి ఏకాంబరం రాసిన 'అంబేద్కరో సమరసింహ' కావ్యం సమకాలీన సాహిత్యానికి గొప్ప స్ఫూర్తిని అందిస్తుంది.

*(నేడు అంబేడ్కర్ జయంతి)*

■ **కోయి కోటేశ్వరరావు**

✆ 94404 80274

## ఒక గాయం రంగులేసుకునే కల

వ్యక్తిగతం కావచ్చు, సమాజగతం కావచ్చు, నైరాశ్యం నుండి ఆశవైపు తీసుకెళ్ళడమే ఏ కవితకైనా తొలి విజయం. ప్రేమలో ఒకటవడం, కారణాలేవైనా విడిపోతూ గాయపడటం వీటిని డీల్ చేసిన కవితను చదివి ప్రియమైనదిగా అనుకున్నామంటే ఆ కవిత నిర్మాణంలో కొత్తదనం మనల్ని వెంటాడుండవచ్చు. ఎత్తుగడలోనే- గాయాల మీద నడవడం ఇప్పుడు జీవితానికి పెద్ద పరీక్ష అంటాడు కవి.



ఆ సమయంలో ఎదురయ్యే హాయిగొలిపే గాలికి ప్రతిగా ఆనందం వ్యక్తం చేయలేని స్థితిని గుర్తుచేస్తూనే, ఇది పరామర్శలనో సానుభూతులనో వెతికి పెట్టే గీతం కాదు... కన్నీళ్ళకు మలుపులే తప్ప మజిలీలు ఉండవు అంటూ కొత్త ఆలోచనల పేటిక తెరుస్తాడు. ఏ విషయం పదేపదే కల్లోల పరుస్తుందో ఎంతకీ బోధపడక ఏ నిర్ధారణకూ రాలేని స్థితిలో ఉన్న మనిషిని బహుసున్నితమైనది కూడా బాధపెడుతుంది. ఎవరినైనా ప్రేమించడం, తనలోకి ఆహ్వానించడం, హృదయానికున్న జబ్బుగా ప్రకటించి, ప్రేమ పొందిన వాళ్లే చివరికి గాయపరిచినపుడు భరించలేనివారిగా తయారయ్యాక, గుండెని ఓదార్చేవాళ్ళెవరూ ఉండని నిస్సహాయతను చెబుతూ వెంటనే ఆ హృదయం చీకట్లో కిచకిచమని వెర్రి పాట పాడుకుంటుందంటాడు.

గాయపడినవాడిగా నీకు నీవే తోడు అంటూ తనకు తానే దిశానిర్దేశం చేసుకుంటాడు. చిట్టిపిల్లలాంటి తన హృదయాన్ని తానే ముద్దులాడుకోవాలంటాడు. చీకట్లో ప్రయాణం చేసే కళ్ళు తప్పనిసరిగా హాయిని ప్రసాదిస్తాయన్న నిర్ధారణ కొస్తాడు. గుండెల్ని తవ్వుకున్న గాయాల దేహంలోనే అలసట దాహం తీర్చే నదులున్నాయని గుర్తుచేసుకుంటాడు. కన్నీళ్ళను కూడా తీయగా అనుభవించడమనేది రాబోయే జీవితాన్ని అందంగా మలచుకోగలిగే ఆలోచన. చివరిగా రాత్రి పూసే నక్షత్రాలను చూస్తూ గడపడం ఊరటగా వాటిని తెంపుకుంటే అవి ఉదయానికి పరిమళించే పూవులవుతాయనడమే గొప్ప ఊహ. దానికి కొనసాగింపుగా పువ్వులు మనుషుల్లా గాయపరచవు, సువాసన కొడతాయి అంటూ ముగిస్తాడు. ఈ కవితలో గాయం దుఃఖాన్ని ప్రేరేపిస్తుందన్న సామాన్య భావనను దాటి చూడగల అనుభూతిని అందుకోగలిగితే ఇది నాకే కాదు అందరికీ ప్రియ పద్యమే అవుతుంది.

■ **పాయల మురళీకృష్ణ**

✆ 83094 68318




## ప్రియ పద్యం

### లోపలికి

ఇది కొంత రాసుకునే పూట
ఏవేవో రంగులేసుకునే కల

గాయాల మీద నడుస్తూ పోతే ఏ ఊరొస్తుంది.
తీపిసలిపే గాలికి ఏం చెప్పాలి. ఇదేమీ
వెతుకులాటల గీతం కాదు. పరామర్శల పాచిక
లాడేందుకు తెగిన హృదయాలకు చేతులుండవు.
కన్నీళ్లకు మలుపులే కానీ మజిలీల ఊసుండదు.


ఏ గాలిపొర సర్రున కోసిపోతుందో అర్థం కాదు.
తల తెగిపడేవరకూ కత్తి పట్టుకుందెవరో బోధ
పడదు. ముద్దుచేసి తలుపులు తీయడమే
హృదయాలకున్న జబ్బు. గుండెల్లో కూర్చోపెట్టు
కున్న తర్వాత మనుషులు బరువు పెరుగుతారు.

లోపలి సావాసగాడా విను...
హృదయాలు మనుషుల్లో ఎగిరే చిట్టిపిల్లలు.
వాటికేదుపొస్తే అమ్మలుండరు. చీకటిగట్టు మీద
కిచకిచమంటమే తెల్సు. అదో వెర్రి పాట.
కన్నీళ్ల ఊట.

గాయాల వాడా...
నీ లోపలకి దర్జాగా నడువు. హృదయానికో
ముద్దుపెట్టు. చీకటిముసురు మీద పాకుతున్న
కళ్ళల్లోనే హాయిని పాడే పావురాలుంటాయి.
గుండెల్ని తవ్వి దారిచ్చిన వాళ్ల దేహాల్లోనే
దాహాలని తీర్చే నదులుంటాయి. కన్నీళ్లకూ నవ్వు
తెప్పించే మార్మికతల యేరులుంటాయి.

పిచ్చివాడా...
వెళ్తూవెళ్తూ నాలుగు నక్షత్రాలు తెంపుకుపో.
తెల్లారికి మల్లెపూలవతాయి. దిగులు పడకు.
పూలు మనుషులు కాదు. పొద్దుటకు సువాసన
కొడతాయి.

■ **సిద్దార్థ కట్టా**





ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.7 కనిష్ఠం 23.7



మమ్మల్ని కాపాడండి

## మహో ప్రభో..!

టెంట్ వేసి.. ప్లకార్డులు పట్టుకుని రోడ్డెక్కిన వీరంతా ఏ పార్టీనో, సంఘానికో చెందిన వారు కాదు. ఉద్యోగాల కోసమో, జీతాల కోసమో ఆందోళన చేయడం లేదు. కంపెనీలు సృష్టిస్తున్న వాయు కాలుష్యం నుంచి తమను కాపాడాలని అధికారులను, ప్రభుత్వ పెద్దలను కోరుతున్నారు. పీసీబీ డౌన్ డౌన్ అంటూ బాచుపల్లికి చెందిన పలు కాలనీల ప్రజలు ఆదివారం ఇలా రోడ్డెక్కి నిరసనను వ్యక్తం చేశారు. 6

మద్యం కోసం

## గ్రూప్ వార్

**ఒకరికి కత్తిపోట్లు**



రాజేంద్రనగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : మద్యం కోసం రెండు గ్రూపుల మధ్య జరిగిన వాగ్వాదం కత్తి పోట్లకు దారితీసింది. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అత్తాపూర్ ఖాజానగర్‌లో సయ్యద్ బాబా (35) నివసిస్తున్నాడు. శనివారం రాత్రి ఓ నిర్మానుష్యమైన ప్రాంతంలో రెండు గ్రూపులు మద్యం సేవిస్తున్నాయి. సయ్యద్ బాబా ఉన్న గ్రూపులో మద్యం అయిపోయింది. దీంతో సయ్యద్ బాబా రెండవ గ్రూపు వద్దకు వెళ్లి వారి మద్యం తీసుకోవడంతో గొడవ జరిగింది. అడగకుండా మద్యం ఎలా తీసుకుంటావని గొడవపడ్డారు. ఈ క్రమంలో వారు సయ్యద్ బాబాపై కత్తులతో దాడిచేయడంతో ముఖంపై, కడుపులో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా వారు వైద్యం చేయడానికి నిరాకరించారు. అక్కడినుంచి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం సయ్యద్ బాబా ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

కూల్.. చిల్..!



చింతల్‌బస్తీలో ఓ యువతి ఎండ వేడి నుంచి రక్షణగా ఫేస్‌షీల్డ్ ధరించి, కొబ్బరిబొండాం నీటిని తాగుతూ ఇలా చిల్ అవుతూ కనిపించింది.

ఫొటో : ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్

# 205 ఆస్తులు..



# రూ.212 కోట్లు..

**పాతబస్తీ మెట్రో కోసం జోరుగా పరిహారం చెల్లింపులు**

- రంజాన్ నేపథ్యంలో పనుల్లో కాస్త జాప్యం
- మళ్లీ వడివడిగా ముందుకు..
- ఇంకా 895 ఆస్తులను సేకరించాల్సిన పరిస్థితి



పాతబస్తీలో మెట్రో విస్తరణ పనుల కోసం భవనాలను కూలుస్తున్న దృశ్యం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న పాతబస్తీ మెట్రో పనులు మళ్లీ పుంజుకున్నాయి. రంజాన్ పండుగ నేపథ్యంలో దాదాపు నెల రోజులకు పైగా ఓల్డ్‌సిటీ వైపునకు వెళ్లని హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) అధికారులు వారం రోజులుగా కూల్చివేత పనులను ముమ్మరం చేశారు. ఇప్పటికే నష్టపరిహారం చెక్కులను స్వీకరించిన బాధితుల ఇళ్లు, కమర్షియల్ భవనాలను వేగంగా తొలగిస్తున్నారు. మెట్రో రెండో దశ విస్తరణలో భాగంగా కారిడార్-6 కింద ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల పనులను చేపడుతున్న విషయం తెలిసిందే. అయితే, ఈ మార్గంలో 1,100 ఆస్తులు ప్రభావితమవుతున్నట్లు హెచ్ఏఎంఎల్ అధికారులు గతంలో గుర్తించారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు 900 ఆస్తులకు నోటిఫికేషన్ జారీ చేయగా.. అందులో 400 ఆస్తులకు ప్రిలిమినరీ డిక్లరేషన్ ఇచ్చి నష్ట పరిహారం చెల్లిస్తున్నారు.

**రూ.1,100 కోట్ల కేటాయింపు**

మొత్తం 1,100 ఆస్తుల సేకరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.1,100 కోట్లను కేటాయించింది. ఈ మేరకు స్థానికులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా పరిహారం అందజేస్తూ ముందుకుసాగుతోంది. 2028 ఎన్నికల్లోగా పాతబస్తీలో మెట్రో రైలును ప్రారంభించాలనే ఏకైక లక్ష్యంతో కాంగ్రెస్ సర్కారు పనిచేస్తోంది. ఇందులో భాగంగా 2023-24 బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించింది. అయితే గతేడాది సవరించిన రూ.106.88 కోట్లతో కలిపి తాజా బడ్జెట్‌లో మరో రూ.500 కోట్లు కేటాయింపులు చేసింది. కాగా, మొత్తం 1,100 ఆస్తుల్లో భాగంగా ఇప్పటివరకు 205 ఆస్తులను సేకరించి రూ.212 కోట్ల చెల్లింపులు చేశారు.

**స్వచ్ఛందంగా వస్తున్నారు..**



మెట్రో కారిడార్ నిర్మాణంలో ఆస్తులను కోల్పోతున్న యజమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నష్టపరిహారాన్ని ఆమోదించి తీసుకెళ్తున్నారు. ఇప్పటికే రోడ్డు విస్తరణ కోసం లాహోటి భవనం, అక్బర్ ఫంక్షన్‌హాల్‌ను కూల్చి, వాటి శిథిలాలను అక్కడి నుంచి తరలించాం. షబ్బర్ కేఫ్, మీనా ప్లాజా, పిస్తాహౌజ్, స్వాగత్ హోటల్, లిల్లీ రోజ్ స్కూల్ తదితర భవనాల తొలగింపు పనులు కొనసాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి డీపీఆర్‌కు అనుమతి వచ్చిన వెంటనే నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

- ఎన్వీఎస్ రెడ్డి, హెచ్ఏఎంఎల్ ఎండీ

**వచ్చే నెలలోపు..**

రంజాన్ పండుగ నేపథ్యంలో పాతబస్తీలో మెట్రో పనులను పూర్తిగా నిలిపివేశారు. కారిడార్ నిర్మాణంలో ఇళ్లను కోల్పోతున్న బాధితులను పండుగ సమయంలో ఇతర ప్రాంతాలకు పంపించొద్దనే ఉద్దేశంతో అధికారులు అటువైపు వెళ్లకుండా దూరంగా ఉన్నారు. అయితే రంజాన్ ముగిసిన తరుణంలో స్థానికుల సహకారంతో వారం రోజులుగా మళ్లీ పనులను పునఃప్రారంభించారు. రోడ్డుకు ఇరువైపులా చిక్కు ముడులుగా ఉన్న విద్యుత్‌వైర్లు, టెలిఫోన్ కేబుళ్లను హెచ్ఏఎంఎల్ ఇంజనీరింగ్ సిబ్బంది జాగ్రత్తగా తొలగిస్తున్నారు. వచ్చే నెలలోపు అన్ని నిర్మాణాలనూ తొలగిస్తామని అధికారులు చెబుతున్నారు.



పునరుద్ధరణ పనులు చేయని రామంతపూర్‌లోని రోడ్డు

రోడ్ల పునరుద్ధరణలో

# ఉదాసీనత

**ఇష్టానికి తవ్వి.. దుమ్ము, ధూళికి వదిలి..**

- పనుల నిర్వహణలో వాటర్‌బోర్డు నిర్లక్ష్యం
- వాహనదారుల తిప్పలు.. పలుచోట్ల ప్రమాదాలు
- జీహెచ్ఎంసీ లేఖలనూ ఖాతరు చేయని బోర్డు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):

- రాంనగర్‌లోని సాగర్‌లాల్ ఆస్పత్రి నుంచి బంధన్ ఫంక్షన్ హాల్ రోడ్డు మార్గంలో లీకేజీలు అరికట్టేందుకు వాటర్ బోర్డు కొత్త తాగునీటి పైపులైన్(1000 ఎంఎం డయా) నిర్మించింది. తవ్విన గుంతలు పూడ్చిన ఆ సంస్థ రహదారి పునరుద్ధరణ పనులు చేపట్టలేదు. బల్దియా అధికారులు బోర్డు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ డివిజన్-5 డీజీఎంకు లేఖలు రాసినా పట్టించుకోకపోవడం గమనార్హం.
- రామంతాపూర్ శ్రీనివాసపురం కాలనీలోని స్ట్రీట్ నెంబర్-4లో యేడాది క్రితం తాగునీటి పైపులైన్ మరమ్మతు చేశారు. రహదారి పునరుద్ధరించాలని జీహెచ్ఎంసీ అధికారులను సంప్రదిస్తే.. ఆ పనులతో మాకు సంబంధం లేదు వాటర్‌బోర్డు చేయాలని చెబుతున్నారు.

గ్రేటర్‌లోని చాలా ప్రాంతాల్లో ఇదే దుస్థితి. తాగునీరు, డ్రైనేజీ పైపులైన్ల నిర్మాణం, మరమ్మతు పనుల కోసం రోడ్డు తవ్వకాలు చేపడుతోన్న వాటర్‌బోర్డు వాటి పునరుద్ధరణను పట్టించుకోవడం లేదు. నెలలు, సంవత్సరాలు గడిచినా కొన్ని ఏరియాల్లో పనులు చేసేందుకు ఆసక్తి చూపడం లేదు. జీహెచ్ఎంసీ అధికారుల విజ్ఞప్తులు చేసినా.. లేఖలు రాస్తున్నా ఖాతరు చేయడం లేదు. అదే సమయంలో ఆ రహదారుల పునరుద్ధరణ పనులు తాము చేయమని జీహెచ్ఎంసీ కరాఖండిగా చెబుతోంది. దీంతో పౌరులు ఇబ్బందులు పడుతున్నారు. తవ్వి వదిలేసిన రోడ్లతో రాత్రి వేళల్లో వాహనదారులతో పాటు నడుచుకుంటూ వెళ్లే వృద్ధులు, చిన్నారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారులు జీహెచ్ఎంసీ పరిధిలోని

మిగతా 4వ పేజీలో..



తవ్వి సరిగా పూడ్చని రాంనగర్ పరిధి సాగర్‌లాల్ రోడ్డు



## అగ్గితో జాగ్రత్త

- నేటినుంచి అగ్నిమాపక వారోత్సవాలు 6
- నివారణపై అవగాహన కార్యక్రమాలు



మహనీయుల జీవితాలపై

## అధ్యయనం చేయాలి 6

- వర్సిటీలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచన




## ఉర్దూ భాష పరిరక్షణకు కృషి 6

- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

మెయిల్ ద్వారా

# విద్యుత్ బిల్లులు

- **హెచ్‌టీ కనెక్షన్‌కు ఏఎంఆర్‌తో బిల్లింగ్**




హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హెచ్‌టీ మీటర్‌కు ఏఎంఆర్ (ఆటోమేటిక్ మీటర్ రీడింగ్) మోడెంతో ప్రతి నెలా బిల్లులు జారీ చేసే దిశగా దక్షిణ తెలంగాణ విద్యుత్‌సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) చర్యలు చేపట్టింది. అధికారులతో సంబంధం లేకుండా ఏఎంఆర్‌తో ప్రతినెలా విద్యుత్‌బిల్లులు ఆన్‌లైన్‌లో వినియోగదారుల మెయిల్‌కు చేరుతాయి. ఏవైనా సాంకేతిక సమస్యల కారణంగా బిల్లు రాకపోతే ఆ సమాచారం డిస్కం ప్రధాన కార్యాలయంలోని బిల్లింగ్ అధికారులకు చేరుతుంది. దీంతో వారు స్థానిక అధికారులను పంపించి బిల్లింగ్ ప్రక్రియను పూర్తిచేయడంతో పాటు సమస్యను పరిష్కరిస్తారు. ఏఎంఆర్ బిల్లింగ్‌తో ఏ రోజులో ఎన్ని యూనిట్లు విద్యుత్ వినియోగించారనే సమాచారం రికార్డవుతుంది. ఈ విధానం అందుబాటులోకి వస్తే సర్వర్ల ద్వారానే ప్రతినెలా హెచ్‌టీ బిల్లులు 100శాతం ఆన్‌లైన్‌లోనే జారీ చేస్తారు. టీజీఎస్పీడీసీఎల్‌లో సుమారు 16 వేల హెచ్‌టీ విద్యుత్ కనెక్షన్లు ఉండగా గ్రేటర్ పరిధిలో 11వేల హెచ్‌టీ కనెక్షన్లు ఉన్నాయి. దక్షిణ డిస్కంకు ప్రతి నెలా వచ్చే ఆదాయంలో 50 శాతం హెచ్‌టీ కనెక్షన్ల నుంచే వసూలవుతోంది.



## విశాల్ దివస్

ఆధ్యాత్మికత, సమైక్యతకు ప్రతీకగా భావించే వైశాఖీ వేడుకలను ఆదివారం సిక్కులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈ సందర్భంగా అమీర్‌పేట గురుద్వారా వద్ద భారీ ర్యాలీ నిర్వహించారు. ఫొటో :ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ 6



# దమ్ మారో దమ్..

**ఫామ్‌హౌస్‌లలో గంజాయి, హుక్కా, డ్రగ్స్, మద్యం వినియోగం**

- కొత్తగా ముజ్రా, రేవ్ పార్టీలు సైతం..
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారుతున్న వైనం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- స్థానికుల ఫిర్యాదులతోనే పోలీసుల స్పందన

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ శివారు ప్రాంతాల్లోని ఫామ్‌హౌస్‌లలో నిర్వహించే పార్టీలలో డ్రగ్స్, గంజాయిల వినియోగం యథేచ్ఛగా సాగుతోంది. పుట్టినరోజు, గెట్ టు గెదర్ పేరుతో పార్టీలను నిర్వహిస్తూ దమ్ మారో దమ్.. అంటూ గంజా మత్తులో తేలియాడుతున్నారు. వీటిపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వాటినే అడ్డాగా చేసుకొని పలువురు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఇటువంటి వాటిపై ఫిర్యాదులొస్తేనే పోలీసులు స్పందిస్తున్నారన్న విమర్శలున్నాయి.



**గుట్టుగా డ్రగ్స్**

నగరానికి సమీపంలోనే వందల సంఖ్యలో ఫామ్‌హౌస్‌లు ఉన్నాయి. తమను ఎవరూ ఏమీ చేయలేరన్న ధీమాతో కొందరు వీటిని అసాంఘిక కార్యకలాపాలకు ఎంచుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా రకరకాల పార్టీలను నిర్వహిస్తున్నారు. నిజానికి ముందస్తు అనుమతి లేనిదే ఫామ్‌హౌస్‌లలోకి మద్యం తీసుకువెళ్లేందుకు వీలుండదు. అయినా, ఈ నిబంధనను ఎవరూ పట్టించుకోవడం లేదు. మద్యం మాత్రమే కాదు.. గంజాయి, డ్రగ్స్, హుక్కా వంటివి కూడా ఇందులోకి కొందరు గుట్టుగా చేరుస్తూ పార్టీలు చేసుకుంటున్నారు. వీకెండ్ వచ్చిందంటే చాలు పుట్టిన రోజు, గెట్ టు గెదర్ పేరుతో పార్టీలను నిర్వహిస్తూ మద్యం, గంజాయి, డ్రగ్స్ సేవిస్తున్నారు.

**చట్ట విరుద్ధ కార్యకలాపాలే అధికం**

నగర శివార్లలోని ఫామ్‌హౌస్‌లలో చట్టవిరుద్ధ కార్యకలాపాలే అధికంగా జరుగుతున్నాయన్న ఆరోపణలున్నాయి. ఒక్కోటి ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి

మిగతా 4వ పేజీలో..

## ● నయనానందకరం

రవీంద్రభారతి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): లయబద్ధమైన నాట్యాంశాలకు వైవిధ్యభరితంగా నర్తంచిన కళాకారులు ప్రేక్షకుల్ని నయనానందాన్ని పంచారు. ఆదివారం రవీంద్రభారతిలో నర్తనం సంస్థ రెండవ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అకాడమీలో శిక్షణ పొందిన కళాకారులు పలు నృత్యరీతుల్ని ప్రదర్శించారు. నాట్య గురువు వర్షిణి నేతృత్వంలో నర్తించిన కళాకారులు ఆహుతుల్ని ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి అతిథులుగా ఎమ్మెల్సీ సురభివాణీదేవి, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణతో పాటు పలువురు ప్రముఖులు హాజరై కళాకారులను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



నాట్యం చేస్తున్న కళాకారులు

## ● నూతన వధూవరులకు సీఎం ఆశీస్సులు

బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి దంపతుల కుమారుడు హారేన్ రెడ్డి వివాహం ఆదివారం జరిగింది. ఈ వేడుకకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

(రాంనగర్, ఆంధ్రజ్యోతి



# రోడ్ల పునరుద్ధరణలో ఉదాసీనత

(3వ పేజీ తరువాయి)

అంశమైనందుకే వాటర్‌బోర్డు ఉద్దేశ పూర్వక నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందన్న ప్రచారమూ జరుగుతోంది. ఆ విభాగంలోని కొందరు ఉన్నతాధికారుల తీరు ఈ విషయంలో వివాదస్పదంగా మారుతోంది.

**ఇష్టానికి తవ్వి..**

మహానగరంలో రహదారి తవ్వాలంటే ప్రభుత్వ/ప్రైవేట్ సంస్థలైనా, వ్యక్తులైనా జీహెచ్‌ఎంసీ అనుమతి తీసుకోవాలి. తవ్విన రహదారి పునరుద్ధరణకు అయ్యే మొత్తం ముందే చెల్లిస్తే మాన్‌సూన్ మినహా ఇతర సీజన్లలో తవ్వకాలకు అనుమతి ఇస్తారు. అనుమతులు తీసుకోవడం, నిర్ణీత మొత్తం చెల్లింపులో జాప్యం జరుగుతోందన్న ఆలోచనతో తవ్విన రహదారులను మేమే పునరుద్ధరిస్తామని వాటర్‌బోర్డు ముందుకు వచ్చింది. అందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు ఉన్నతస్థాయిలో నిర్ణయం తీసుకుని సమ్మతించారు. ఈ క్రమంలో పలు ప్రాంతాల్లో జీహెచ్‌ఎంసీకి డబ్బులు చెల్లించకుండా వాటర్‌బోర్డు ఇష్టానికి రోడ్లు తవ్వింది. రోడ్ల పునరుద్ధరణ పనుల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. దీంతో పౌరులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుమ్ము, ధూళితో అనారోగ్యానికి గురవుతున్నారని భార్య, పిల్లలను నెల క్రితం బంధువుల ఇంటికి పంపినట్లు సాగర్‌లాల్ ఆస్పత్రి మార్గంలో ఉండే ఓ వ్యక్తి తెలిపారు. 'వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.. ప్రమాదాలకు గురవుతున్నారు. వీలైనంత త్వరగా పునరుద్ధరణ పనులు చేపట్టండి..' అంటూ వాటర్‌బోర్డుకు జీహెచ్‌ఎంసీ లేఖ రాసినా.. బోర్డు అధికారుల స్పందన కరువైంది. కూకట్‌పల్లి, అంబర్‌పేట, గోషామహల్, ఉప్పల్, శేరిలింగంపల్లి, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లోనూ ప్రధాన, అంతర్గత రహదారులను తవ్విన ప్రభుత్వ విభాగాలు పునరుద్ధరణ పనులు చేపట్టడం లేదు. నిర్మాణ పనులు చేపట్టేందుకు ఇది అనువైన సీజన్ అయినప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే అకాల వర్షాలు కురుస్తుండగా.. మరో రెండునెలల్లో మాన్‌సూన్ మొదలయ్యే అవకాశముంది. అప్పుడు పనులు చేయడం ఇబ్బందికరమని తెలిసినా.. ఉదాసీనంగా వ్యవహరిస్తుండడం గమనార్హం.

# దమ్ మారో దమ్..

(3వ పేజీ తరువాయి)

ఉంటుండడంతో లోపల ఏం జరుగుతుందో తెలుసుకోలేరనే ధీమాతో నిర్వాహకులు ఉన్నారు. ఎక్కువగా జూదం, మాదకద్రవ్యాల వినియోగం, అనధికార పార్టీల వంటి చట్టవిరుద్ధమైన సమావేశాలకు ఫామ్ హౌజ్‌లు స్వర్గధామాలుగా మారుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. కొత్తగా రేవ్ పార్టీలు, ముజ్రా పార్టీలు సైతం ఫామ్‌హౌజ్‌లలో నిర్వహిస్తున్నారు. స్థానిక ప్రజలు ఆయా ఫామ్‌హౌజ్‌ల్లోకి వెళ్లకుండా భారీ ప్రహరీలతో పాటు చెయిన్ ఫెన్సింగ్‌లు, ఎత్తయిన గేట్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఎవరూ రాకుండా గట్టి నిఘాను పెట్టుకొని చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. కొన్నిమార్లు ఫిర్యాదు చేస్తే పోలీసులు వచ్చి వెళుతున్నారే తప్ప పార్టీ నిర్వాహకులపైనా, ఫామ్‌హౌజ్‌లను లీజులకు, అద్దెకు ఇస్తున్న వారి పట్ల ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానిక గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

**కోడి పందాలు.. ముజ్రా పార్టీలు**

ఫామ్‌హౌజ్‌లలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్న స్థానికుల ఫిర్యాదులతో ఇటీవల పోలీసులు మెరుపుదాడులు చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. మొయినాబాద్‌లోని ఓ ఫామ్‌హౌజ్‌లో కోడి పందేలు ఆడుతున్న 63మందిని అదుపులోకి తీసుకోగా.. తాజాగా అదే ప్రాంతంలోని మరో ఫామ్ హౌజ్‌లో అశ్లీల నృత్యాలతో ముజ్రా పార్టీ నిర్వహిస్తున్న 14మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



మాట్లాడుతున్న కేటీఆర్, పక్కన రాజశేఖర్‌రెడ్డి తదితరులు

# కాంగ్రెస్, బీజేపీలను తిరస్కరించండి

● బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మల్కాజిగిరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): 'ఒక్కసారి మోసపోతే అది మోసం చేసేటోడి తప్పు. అవాస్తవ వాగ్దానాలు, అసంబద్ధ హామీలు నమ్మి పదే పదే మోసపోతే అది మన పొరబాటవుతుంది. రేవంత్ లాంటి మోసగాడిని నమ్మినందుకు రాష్ట్రానికి చివరికి చేతిలో చిప్ప మిగిలింది' అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ విఫల పాలనతో ప్రజల జీవితాలు సంక్షోభంలో పడితే.. రేవంత్‌రెడ్డి ఒక్కడు మాత్రం ఆనందంగా ఉన్నట్లు కనిపిస్తుందన్నారు. మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు మాత్రం అసంతృప్తిగా ఉన్నారన్నారు. మల్కాజిగిరిలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంతకు ముందు ఆనంద్‌బాగ్ నుంచి సభ నిర్వహించే శ్రీలక్ష్మీసాయి గార్డెన్స్ వరకు రోడ్‌షో నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఎన్నిక ఏదైనా.. సందర్భం ఏదైనా.. కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పాల్సిన అవసరముందన్నారు. వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఆ రెండు పార్టీలను తిరస్కరించాలని కోరారు. తెలంగాణ ఆత్మ గౌరవం, స్వాభిమానం కాపాడాలంటే, ప్రజలకు భరోసా కల్పించే పార్టీ ఒక్క బీఆర్ఎస్‌యేనని అన్నారు. రానున్న రోజుల్లో ప్రాంతీయ పార్టీలదే అధికారమని, ప్రాంతీయ పార్టీలుగా తెలుగుదేశం, బీఆర్ఎస్‌లు మాత్రమే నిలదొక్కుకున్నాయన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు, రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ ఎంబీసీ ఛైర్మన్ నందికంటి శ్రీధర్‌తో పాటు కార్పొరేటర్లు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

# ఆ కులాలను బీసీల్లో చేర్చవద్దు

● ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

బర్కత్‌పుర, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం జాబితా నుంచి తొలగించిన 26 కులాలను తిరిగి బీసీ జాబితాలో చేర్చాలన్న యోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు. ఏపీలోని కులాలను తెలంగాణలో ఉన్న బీసీ జాబితాలో చేర్చి నోటికాడి కూడు లాక్కొనే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. బీసీలంతా ఏకమై దీనిని అడ్డుకుంటారని హెచ్చరించారు. ప్రభుత్వానికి ఆ కులాలపైన అంత మోజు ఉంటే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లలో చేర్చితే ఎలాంటి ఇబ్బందిలేదని స్పష్టం చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బీసీ-ఏ కులాల హక్కుల పరిరక్షణ సమితి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలలోని చాలా కులాలు సంచార జాతులుగా భిక్షాటన చేసేవారే అధికంగా ఉంటారన్నారు. వారిని ఇబ్బందులకు గురి చేయడానికే తొలగించిన 26 కులాలను బీసీ జాబితాలో చేర్చుతున్నారని ఆరోపించారు. బీసీ కమిషన్ వెంటనే స్పందించి బీసీల అభివృద్ధికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఎం.ఎస్ నరహరి, డాక్టర్ బాగయ్య, జి. శ్రీహరి, అంబటి సుధాకర్, సాంబమూర్తి, కిషన్, శ్రీనివాస్, ఎం పరమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటకులకు గుడ్‌న్యూస్

● జూ పార్కు వారాంతపు సెలవు రద్దు

మదీన, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి నేపథ్యంలో సోమవారం జూ పార్కు యధావిధిగా తెరిచి ఉంటుందని క్యూరేటర్ జె.వసంత తెలిపారు. సాధారణంగా ప్రతీ సోమవారం జూ పార్కుకు వారాంతపు సెలవు ఉంటుంది. అటవీ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సెలవును రద్దు చేసి సందర్శకుల కోసం అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జూ పార్కు తెరిచి ఉంటుందన్నారు.



జూపార్కు

# నేటి నుంచి 'మా భూమి' రథయాత్ర

● డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్

హైదరాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బీసీ, ఎస్సీ, ఎస్టీలను సంఘటిత పరచి, వారిలో చైతన్యం కలిగించి రాజ్యాధికారం సాధించే లక్ష్యంతో మా భూమి రథయాత్ర కొనసాగుతుందని ధర్మసమాజ్ పార్టీ (డీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ యాత్ర మూడేళ్ల మూడు నెలల పాటు లక్ష కిలోమీటర్లు కొనసాగుతోందని పేర్కొన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి ప్రారంభమై హైదరాబాద్ వరకు యాత్ర సాగుతోందని పేర్కొన్నారు. ఈ యాత్రలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని తెలిపారు.




# మండల కమిషన్ సిఫార్సులను అమలు చేయాలి

● రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య


మండల్ అవార్డు అందుకుంటున్న
తెలంగాణ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు యాదయ్య గౌడ్

**బర్కత్‌పుర, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):** మండల్ కమిషన్ సిఫార్సులను పూర్తిస్థాయిలో అమలు చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీల ఆశాజ్యోతి బీపీ మండల్‌కు భారత రత్న ఇచ్చి గౌరవించాలని కోరారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో యాదవ రాజ్యాధికార సమితి బీసీ ఐక్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణిస్తున్నవారికి బిందేశ్వర్ మండల్ అవార్డులను ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని, దేశంలోని అన్ని రాష్ట్రాల్లో గురుకుల పాఠశాలలను నిర్మించాలన్నారు. బీపీ మండల్ మనవడు ప్రొఫెసర్ సూరజ్ మండల్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం కులగణన చేపట్టి బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు కల్పించడం అభినందనీయం అన్నారు. జాతీయ స్థాయిలో కూడా కులగణన చేపట్టాలని బీసీ రిజర్వేషన్‌లకు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. బీసీలు ముఖ్యంగా యాదవ కులస్థులకు రాజకీయంగా రాణించేందుకు త్వరలో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈసందర్భంగా తెలంగాణ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుదిని యాదయ్య గౌడ్‌తో పాటు పలువురికి బీపీ మండల్ అవార్డులను ప్రధానం చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, బీమా రాంచందర్ యాదవ్, చిన్నశ్రీశైలం యాదవ్, యాదవ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బడుగుల నాగార్జున యాదవ్, బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు బేరి రాంచందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేడ్కర్‌ను గౌరవించేది బీజేపీనే


రాజేంద్రనగర్‌లోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం ఆవరణలో బీజేపీ నాయకులు

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను గౌరవించేది బీజేపీనే అని ఆ పార్టీ రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్ గౌడ్ అన్నారు. కేంద్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం బుద్వేల్ బాబు జగ్జీవన్‌రామ్, రాజేంద్రనగర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని బీజేపీ నాయకులు శుద్ధి చేశారు. ఈసందర్భంగా పంతంగి రాజ్‌భూపాల్ గౌడ్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కాంగ్రెస్ పార్టీ ఎన్నో సార్లు అవమానపరిచిందన్నారు. అంబేడ్కర్ లోక్‌సభకు పోటీ చేసిన సమయంలో ఆయనను ఓడించిన ఘనత కూడా కాంగ్రెస్ పార్టీకే దక్కుతోందని విమర్శించారు. అంబేడ్కర్‌ను అన్ని విధాలుగా గౌరవించిన పార్టీ బీజేపీ ఒక్కటే అని గుర్తు చేశారు.

ఈ కార్యక్రమంలో పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ ఎస్.మల్లారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ కన్వీనర్ పి.మల్లేశ్ యాదవ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరని సదానంద్, ఎస్సీ మోర్చా చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ జోగి రవి, రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి కోరని క్రాంతి, సీనియర్ నాయకుల వేముల మల్లేశ్, కె.హరికిషన్‌జీ, షాబాద విజయ్‌కుమార్, పి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## వనజీవి రామయ్యకు భారత రత్న ఇవ్వాలి

● ప్రపంచ పర్యావరణ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ బద్ర


వనజీవి రామయ్యకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు, సీహెచ్ బద్ర

**బర్కత్‌పుర, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):** ఇటీవల మరణించిన వనజీవి రామయ్యకు కేంద్ర ప్రభుత్వం భారత తర్న ఇవ్వాలని ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ బద్ర డిమాండ్ చేశారు. ఆదివారం సంస్థ ఆధ్వర్యంలో సంతాప సభ ఎంఎంసీసీ టాలెంట్ స్కూల్‌లో కరస్పాండెంట్ తమ్మినేని సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగాక సీహెచ్ బద్ర మాట్లాడుతూ.. వనజీవి రామయ్య కోటి మొక్కలు నాటి వివిధ వృక్షజాతులను, జంతుజాతులను సంరక్షించడానికి తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఆయన పేరుమీద యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సంస్థ కార్యవర్గ సభ్యులు దయానంద రావు, నిఖిల్, రిజ్వాన్, రాజేష్, రామకృష్ణ, గణేష్, లక్ష్మణ్, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):** రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000 - 2001విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఆదివారం బుద్వేల్‌లోని ఎస్ఎస్ఆర్ బంకెట్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమ్మేళనంలో బుద్వేల్, కిస్మత్‌పూర్ పాఠశాలలతో పాటు రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తమకు విద్యా బుద్ధులు నేర్పించిన 20 మంది ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు అనంతరెడ్డి, గాబ్రియేలమ్మ, శాంత, యాదయ్య, అనంతప్ప, వరలక్ష్మీ, ఉమ, సునేత్రీ, అంజలీదేవి, నీరజ, ఉత్తర, ఉమారాణి, లలిత, హేమలత, వాణి, ఎ.భీమయ్య, రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన వెంకటనారాయణ రెడ్డిని సన్మానించారు.

## తెలంగాణలో టీడీపీ పూర్వవైభవానికి కృషి చేయాలి


టీడీపీలో సభ్యత్వం తీసుకున్న వారికి
గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న నర్సింహులు, నాగు నాగేష్

**చాంద్రాయణగుట్ట/చార్మినార్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):** దేశంలోనే ఎక్కువ సభ్యత్వాలు కలిగిన ఏకైక పార్టీ టీడీపీ అని, ఈ పార్టీలో సభ్యత్వం తీసుకున్న వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కిని నర్సింహులు, హైదరాబాద్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ నాగు నాగేష్‌లు అన్నారు. ఆదివారం పార్టీ సీనియర్ నాయకుడు బి.వై. శ్రీకాంత్ ఆధ్వర్యంలో గౌలిపురాలో నిర్వహించిన ముఖ్యఅతిథిగా విచ్చేసి సభ్యత్వ నమోదు గుర్తింపు కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు అధిష్ఠానం ప్రత్యేక గుర్తింపు ఇస్తోందన్నారు. హైదరాబాద్ పార్లమెంట్‌లో అత్యధికంగా పార్టీ సభ్యత్వాలు తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తయ్యబా తస్నీం, శంకర్ ముదిరాజ్, కృష్ణ గౌడ్, షఫీక్, రాజ్ కుమార్, శ్రీకాంత్, దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు.

## 29న పరశురాం జయంతి


సమావేశమైన పరశురాం జయంతి నిర్వాహకులు

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):** ఈనెల 29న భగవాన్ పరశురాం జయంతిని నిర్వహించనున్నట్టు అత్తాపూర్‌కు చెందిన శ్రీపరశురాం భక్త మండలి నిర్వాహకులు అశోక్ శర్మ, శ్రీకాంత్‌శర్మ తెలిపారు. ఆదివారం అత్తాపూర్ రాంబాగ్ రామాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. ఈ సమావేశానికి జయంతి నిర్వాహకులు సుదర్శన్ ప్రసాద్ తివారీ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. భగవాన్ పరశురాం జయంతికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. శోభా యాత్ర కూడా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బాబులాల్ జోషీ, శోభా పాండే, లక్ష్మీకాంత్ గ్యాస్, శశికాంత్ శర్మ, ఓం ప్రకాశ్ శర్మ, మీనాదేవీ, కమల్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు అంబేడ్కర్ జయంతి

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):** రాజేంద్రనగర్ అంబేడ్కర్ చౌరస్తాలో సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్టు జయంత్యుత్సవాల కమిటీ నిర్వాహకులు తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్‌లో మహనీయుల జయంత్యుత్సవాల కమిటీ ఆధ్వర్యంలో జరిగే అంబేడ్కర్ జయంత్యుత్సవాలకు ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ కె.స్వామిగౌడ్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణ మాదిగ, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, వివిధ పార్టీల నాయకులు పి.కార్తీక్‌రెడ్డి, వై.శ్రీధర్, కార్పొరేటర్లు పి.అర్చన జయప్రకాశ్, మోండ్ర సంగీత గౌరీశంకర్, తోకల శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ టి.ప్రేందాస్‌గౌడ్‌తో పాటు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొంటారన్నారు.

## నేడు రక్తదాన శిబిరం

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):** కాటేదాన్ టీఎన్‌జీవోస్ కాలనీ, మణికంఠ హిల్స్‌లోని అయ్యప్ప ఆలయం ఆవరణలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు శ్రీ అయ్యప్ప సేవా సమితి నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలన్నారు. తలసీమియాతో బాధపడుతున్న వారి కోసం ఈ రక్తదానం చేయడం జరుగుతుందన్నారు.


● హనుమాన్ టేకిడీలోని శ్రీఉమామహేశ్వరి మహంకాళి ఆలయంలో హనుమంతుడి జయంతి వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ మీర్‌పేట్ డివిజన్ కార్పొరేటర్ మాధవి ఈశ్వర్‌గౌడ్, జాంబాగ్ డివిజన్ బీసీ సెల్ అధ్యక్షు డు అశోక్ యాదవ్ - మంగళ్‌హాట్, (ఆంధ్రజ్యోతి)

## యువత విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి


క్రీడాకారులను సన్మానిస్తున్న రాజ్ నారాయణ్ ముదిరాజ్

**చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):** యువత విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించినపుడే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ అన్నారు. ఆదివారం ఫూల్‌బాగ్ చమన్ జీహెచ్‌ఎంసీ గ్రౌండ్‌లో శిక్షణ పొంది సికింద్రాబాద్ జయశంకర్ స్టేడియంలో నిర్వహించిన క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందిచారు. బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన భవానీ, క్యాంస పతకం సాధించిన అఖిల సన్మానించారు. కార్యక్రమంలో వాకర్ అసోసియేషన్ సభ్యులు ఎస్ సురేందర్, ఈ గిరీష్, రంగరాజు, ప్రభు, తీగల నరేందర్ రెడ్డి, ఆంజనేయులు చారి తదితరులు పాల్గొన్నారు.

## ఈద్ మిలాప్ మతసామరస్యానికి ప్రతీక



కార్యక్రమంలో మాట్లాడుతున్న సబితా ఇంద్రారెడ్డి

**పహాడిషరీఫ్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):** ఈద్ మిలాప్ మత సామరస్యానికి ప్రతీక అని, సర్వ మతాల ఔన్నత్యాన్ని కాపాడడానికి ఎల్లప్పుడూ ముందుంటానని మాజీ విద్యాశాఖ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం జల్‌పల్లి మున్సిపాలిటీ, జల్‌పల్లి సిద్ధార్థ యువజన సంఘంలో జమతే ఇస్లాం ఏ హింద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈద్ మిలాప్ కార్యక్రమానికి సబితా ఇంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సర్వ మతాలకు చెందిన వ్యక్తుల మధ్య సోదరభావాన్ని, మత సామరస్యాన్ని పెంచే విధంగా నిరంతరంగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జమాత్ ఇస్లామి హింద్ ప్రతినిదులు డా. ముబషీర్ అహ్మద్, మొహమ్మద్ మసరూర్ అలీ, షేక్ అఫ్జల్, సూరెడ్డి కృష్ణారెడ్డి, షర్ఫుద్దీన్ హమీద్, అర్జున్, జనార్ధన్, నగేష్, సాయిద్ పటేల్, బదర్, తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గాల పునర్విభజనపై చర్చ


రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రముఖులు

**అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):** నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణ భారతదేశానికి నష్టం జరగకుండా కాపాడుకోవడంతోపాటు రావాల్సిన హక్కులను, వాటాను సాధించుకోవాలని వక్తలు అభిప్రాయపడ్డారు. నియోజకవర్గాల పునర్విభజన- అవగాహన అనే అంశంపై మహారాజ్‌గంజ్, గౌలిగూడలోని ప్రజా ఏక్తా పార్టీ కార్యాలయంలో ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ప్రజా ఏక్తా పార్టీ జాతయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజకీయ నాయకులు, సీనియర్ జర్నలిస్టు నేలంటి మధు సమన్వయకర్తగా వ్యవహరించారు. సామాజిక, పాత్రికేయ, వ్యాపార రంగాలకు చెందిన పది మంది వక్తలు పాల్గొని దాదాపు రెండు గంటలపాటు నియోజకవర్గాల పునర్విభజన అంటే ఏమిటి అనే అంశంపై, దాని పూర్వాపరాలు, జనాబా ఆధారంగా జరిగే పునర్విభజన వల్ల దక్షిణ భారతదేశానికి కలిగే నష్టాలు, ఉత్తర భారతీయ పార్టీలు మన పట్ల చూపుతున్న వివక్ష తదితర అంశాలపై చర్చించారు. సౌత్ ఇండియా జాగో అనే నినాదంతో తమ పార్టీ పనిచేస్తోందని బోనాల శ్రీనివాస్ ప్రకటించారు. కార్యక్రమంలో సామాజిక వేత్త చికిలె మధుబాబు, బీజేపీ నాయకుడు ఉపేంద్ర ప్రసాద్ దూబె, బిజినెస్ పర్సన్ బోనాల శేషశాయి, నరేశ్ దూత్, ఎం.కే నరేందర్, సల్ల శ్రీశైలం యాదవ్, మహేశ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీజగదాంబిక మహంకాళి ఆలయ చీఫ్ అడ్వైజరీ కమిటీ ఎన్నిక


శ్రీజగదాంబిక మహంకాళి ఆలయ కమిటీ సభ్యులు

**కార్వాన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):** గోల్కొండ శ్రీజగదాంబిక మహంకాళి ఆలయ చీఫ్ అడ్వైజరీ కమిటీ ఎన్నిక ఆదివారం జరిగిందని ప్రెసిడెంట్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. చీఫ్ అడ్వైజర్‌గా రాజు వస్తాద్, లీగల్ అడ్వైజర్‌గా రమేష్, ప్రెసిడెంట్‌గా సత్యనారాయణరెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా ఎం.నాగేశ్వరరావు, కె.నర్సింగ్‌రావు, జనరల్ సెక్రటరీగా బాలప్రసాద్ తివారి, జాయింట్ సెక్రటరీలుగా కె.ఆంజనేయులు, డి.శ్రీధర్‌గౌడ్, బి. పరమేష్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పి.జి. రాంబాబు యాదవ్, ఎం.ఆనంద్‌కుమార్, టి. వినేష్‌సింగ్, ట్రెజరర్‌గా బి. శ్రీకాంత్‌చారి ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఇ.శ్రీరాములు, పి.నర్సింగ్‌రావు, వీర్‌సింగ్, ఎం.శ్రీకాంత్, ఎన్. శ్రీకాంత్, జి.నర్సింహారెడ్డి, టి. విశాల్‌సింగ్‌లు ఎన్నికయ్యారు.

## అభినందనలు


దూల్‌పేట్‌లోని ఆకాశ్‌పురి హనుమాన్ దేవాలయం వద్ద జరిగిన పూజలకు ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎమ్మెల్యే రాజాసింగ్‌లను కలిసి అభినందనలు తెలుపుతున్న గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం అధ్యక్షుడు, బీజేపీ నాయకులు బోయిని వెంకటేశ్ యాదవ్, శైలేందర్ యాదవ్, భూలక్ష్మీ దేవాలయం చైర్మన్ వై.బాబుగురు, సి.మాణిక్‌రావు, విష్ణు జోషి తదితరులు - గోషామహల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి)

## శాంతి భద్రతలను కాపాడడంలో కాంగ్రెస్ విఫలం

● జల్‌పల్లి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హమేద్



**పహాడిషరీఫ్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తెలంగాణలో హత్యలు, చిన్నారులపై అత్యాచారాలు, డ్రగ్స్ విక్రయాలు, మత కలహాలు పెరిగిపోయాయని, శాంతిభద్రతలను కాపాడడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని జల్‌పల్లి మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ షర్ఫుద్దీన్ హమేద్ ఆరోపించారు. ఆదివారం ఎర్రకుంటలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎక్కడా మత కలహాలు జరుగలేదని, హత్యలు చేసిన వారికి కూడా కఠిన శిక్షలు వేయడంతో శాంతిభద్రత అదుపులో ఉండేవన్నారు, వెంటనే ప్రభుత్వం స్పందించి మత సామరస్యాన్ని చెడగొట్టే వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# రెండవ రోజూ కొనసాగిన శతావధానం


కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

**రవీంద్రభారతి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):** సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, ప్రజా పదం, అవధాన విద్యా వికాస పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో వర్సిటీలోని ఆడిటోరియంలో జరుగుతున్న సంపూర్ణ శతావధానం రెండవ రోజూ ఘనంగా జరిగింది. డా.వేంకటరమణ పట్వర్ధన్‌చే నిర్వహిస్తున్న శతావధానం ప్రేక్షకుల్ని షైమరిపించింది. ఈ కార్యక్రమానికి డా.సంగనభట్ల నర్సయ్య, ప్రముఖ శతావధాని డా.ఆముదాల మురళి, ప్రముఖ కవి కసిరెడ్డి వెంకటరెడ్డి, తెలుగు వర్సిటీ వీసీ వెల్దండి నిత్యానందరావు తదితరులు హాజరై అవధాని వేంకటరమణ పట్వర్ధన్‌ను సత్కరించి అభినందించారు. రెండవ రోజు సమావేశంలో దత్తపది అంశంపై 25గురు ప్రాశ్నికుల పద్యాలు మిగిలిన మూడు నాదాల పూరించి పద్యపూరణం చేశారు. అనంతరం అతిథులు మాట్లాడుతూ.. అవధాన ప్రక్రియను ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. పట్వర్ధన్ వేంకటరమణ చక్కగా అవధానం చేశారని ప్రశంసించారు. ఈకార్యక్రమంలో నిర్వాహకులు అనంతకృష్ణశర్మ, డా.మారుమాముల దత్తాత్రేయ శర్మ, అవుసుల భానుప్రకాష్, కేవీఎన్ తదితరులు పాల్గొన్నారు.



## కొలన్ సుధాకర్‌రెడ్డికి పితృ వియోగం


కొలన్ మోహన్‌రెడ్డి(ఫైల్)

**రాజేంద్రనగర్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):** హైదర్‌గూడ శివానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొలన్ సుధాకర్‌రెడ్డి తండ్రి కొలన్ మోహన్‌రెడ్డి(86)కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం కన్నుమూశారు. మోహన్‌రెడ్డి మరణవార్త తెలిసిన బంధువులు, వివిధ పార్టీల నాయకులు శివానగర్‌లోని ఆయన నివాసానికి చేరుకొని భౌతిక కాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు హైదర్‌గూడ శ్మశానవాటికలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

## మద్యం మత్తులో కింద పడి వ్యక్తి మృతి

**బర్కత్‌పుర, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):** మద్యం మత్తులో గుర్తుతెలియని(40) వ్యక్తి కిందపడడంతో తలకు గాయాలై మృతి చెందాడు. కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్సై డి.సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం... కాచిగూడ స్టేషన్ రోడ్‌లోని మహారాష్ట్ర బ్యాంక్‌కు ఎదురుగా ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి కిందపడిపోయాడు. మద్యం మత్తులో ఉండడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమర్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్సై తెలిపారు.

## హనుమాన్ యాత్రకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు



ప్రత్యేక పూజలు చేస్తున్న సురేశ్ ముదిరాజ్

**అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి):** భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన వీర హనుమాన్ విజయయాత్ర ప్రశాంతంగా ముగిసేందుకు కృషి చేసిన నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఆంజనేయ భక్తులకు బీఆర్‌ఎస్ గోసామహల్ డివిజన్ నాయకుడు సురేశ్ ముదిరాజ్ ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఆదివారం గోడేకీ కబర్ వద్ద ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆయన స్వామివారికి పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం సురేశ్ ముదిరాజ్ మాట్లాడుతూ.. హనుమాన్ జయంతి సందర్భంగా 21 సంవత్సరాలుగా వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ సంయుక్తాధ్వర్యంలో వీర హనుమాన్ విజయయాత్ర విజయవంతంగా నిర్వహిస్తున్నామని, ఈ యాత్ర విజయవంతం కావడానికి పోలీస్‌శాఖ, భక్తులు ఎంతో సహకరించారని ఆయన కొనియాడారు.

## మహిళల అభివృద్ధికి కృషి చేయాలి


మాట్లాడుతున్న సామాజిక ప్రజాస్వామ్య జేఏసీ చైర్మన్ కోల జనార్దన్

**బర్కత్‌పుర, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు విద్యా, ఉద్యోగం స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించారని, గవర్నర్, రాష్ట్రపతి ఆమోదం కోసం దేశవ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని పెద్దఎత్తున పోరాటం చేయాలని సామాజిక ప్రజాస్వామ్య జేఏసీ చైర్మన్ కోల జనార్దన్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా విధించాలని ఆయన కోరారు. ఆదివారం కాచిగూడలోని జేఏసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక, ప్రజాస్వామ్య మహిళా సమాఖ్యా చైర్మన్‌గా గోగుల మండ స్వరూపాను నియమించి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి పి.సుధాకర్ ముదిరాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.నందగోపాల్, మీనగ గోపీ, ఉదయ్ నేత పాల్గొన్నారు.



# అగ్నితో జాగ్రత్త

● నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు
● నివారణపై అవగాహన కార్యక్రమాలు

సైదాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఎండా కాలం వచ్చిందంటే తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతుంటాయి. ఏమరపాటుగా ఉంటే పెనుప్రమాదం తప్పదు. ఇళ్లు, కార్యాలయాలు, పరిశ్రమల్లో అగ్గి రాజుకుంటే కళ్లు మూసి తెరిచేలోపు క్షణాల్లో కళ్లెదుటే ఆస్తులు బుగ్గిపాలువుతాయి. అప్రమత్తంగా వ్యవహరిస్తే ఆస్తులు, ప్రాణాలు అగ్నికి ఆహుతి కాకుండా కాపాడుకోవచ్చు. అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతియేటా అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. మలక్‌పేటలో సోమవారం ప్రారంభమవుతున్నాయి. ఈనెల 20 వరకు అగ్నిప్రమాదాలపై ప్రజలను చైతన్యం చేయనున్నారు.

### ఈ రోజే ఎందుకంటే..

ప్రతి ఏడాది ఏప్రిల్ 14న జాతీయ అగ్నిమాపక దినోత్సవం సందర్భంగా వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. 1944 ఏప్రిల్ 14న ముంబాయిలో విక్టోరియా డాక్ యార్డులో అగ్నిప్రమాదం సంభవించి 66 మంది అగ్నిమాపక సిబ్బంది, సుమారు 800 మంది ప్రజలు చనిపోయారు. వారి స్మారకార్థం జాతీయ అగ్నిమాపక దినోత్సవాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుంది.

| అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు | |
|---|---|
| అగ్నిమాపక శాఖ కంట్రోల్ రూం | 101 |
| మలక్‌పేట ఫైర్‌స్టేషన్ | 8712699414 |
| మలక్‌పేట అగ్నిమాపక కేంద్రం అధికారి | 8712699415 |
| ఎల్‌బీనగర్ అగ్నిమాపక కేంద్రం అధికారి | 8712685791 |
| హయత్‌నగర్ ఫైర్‌స్టేషన్ | 040-24203108 |
| హయత్‌నగర్ అగ్నిమాపక కేంద్రం అధికారి | 8712699407 |

### కార్యక్రమాలు

● వారోత్సవాలలో భాగంగా ఏప్రిల్ 14న అగ్నిమాపక కేంద్రాల్లో జెండా అవిష్కరణ, విధి నిర్వహణలో అసువులు బాసిన అగ్నిమాపక దళ సిబ్బందికి నివాళులర్పించి సంతాప కార్యక్రమం నిర్వహిస్తారు. స్టేషన్‌లో ఉండే అగ్నిమాపక నియంత్రణ పరికరాలు, వాహనాలను ప్రజలు సందర్శించేందుకు వీలుగా ప్రదర్శన ఏర్పాటు చేస్తారు.

● 15న బస్టాండ్లు, రెల్వేస్టేషన్లు, పార్కులు, మార్కెట్లలో అగ్నిప్రమాదాలు సంభవించే తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంటలు ఆర్పే విధానం గురించి వివరిస్తారు.

● 16న, ఆస్పత్రుల్లో అగ్నిమాపక పరికరాల తనిఖీలు, ఫైర్ డ్రిల్, ఫస్ట్ ఎయిడ్ ఫైర్ ఫైటింగ్ గురించి అవగాహన కల్పిస్తారు.

● 17న గృహాలు, అపార్ట్‌మెంట్లలో జరిగే ప్రమాదాలపై వివరిస్తారు. గ్యాస్ సిలిండర్ల భద్రత, విద్యుత్ ఉపకరణాల వల్ల జరిగే ప్రమాదాల గురించి తెలుసుకోవడం, ఆయా వస్తువుల మరమ్మతుకు వస్తే గురించే విధానం చెబుతారు.

● 18, 19 తేదీల్లో ఫ్యాక్టరీలు, పెట్రోల్ బంకులు, గోదాములు, వ్యాపార సముదాయాలు, విద్యాసంస్థలు, ఫంక్షన్‌హాళ్లలో అగ్నిమాపక పరికరాల బిగింపు, తనిఖీలతో పాటు అక్కడ సంభవించే ప్రమాదాలు, విద్యుత్, పెట్రోల్, డీజిల్, కిరోసిన్, గ్యాస్ లీకేజీల వల్ల అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అప్రమత్తత గురించి మాక్ డ్రిల్, కార్బన్ డైయాక్సైడ్, డ్రై కెమికల్ పౌడర్‌లను ఉపయోగించి మంటలను ఆర్పే విధానం గురించి వివరిస్తారు.

● 20న అగ్నిమాపక అధికారులు ఫైర్‌సేఫ్టీలో ఉండే భద్రతాపరమైన సలహాలు అందించే వారితో సదస్సులు నిర్వహిస్తారు.


ఫైర్ సిబ్బంది మాక్ డ్రిల్(ఫైల్)

### అగ్నిప్రమాదం జరిగితే 101కు ఫోన్ చేయాలి



అగ్నిప్రమాదం జరిగితే తక్షణమే 101కు ఫోన్ చేయాలి. అగ్నిమాపక దినోత్సవం సందర్భంగా వారోత్సవాల్లో భాగంగా అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఎలా తప్పించుకోవాలో జాగ్రత్తలు తెలియజేస్తూ వారం పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. మంటలను ఆర్పే విధానం వివరిస్తాం. అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

- సౌరెడ్డి ఆంజిరెడ్డి, మలక్‌పేట అగ్నిమాపక కేంద్రం ఇన్‌చార్జి

## ఉర్దూ భాష పరిరక్షణకు ప్రభుత్వం కృషి

● మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఉర్దూ భాష, సాహిత్యం, సంస్కృతిని కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. న్యూ మల్లేపల్లిలోని అన్వర్-ఉల్-ఉలూమ్ కళాశాలలో ఆ సంస్థ ఎడ్యుకేషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన 8వ నవాబ్ ఆలం ఖాన్ స్మారక ముషాయిరాలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉర్దూ మీడియంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. తాను జన్మించింది హైదరాబాద్ పాత బస్తీలోనేనని, తన తల్లిదండ్రులు ఉర్దూ మీడియంలో విద్య అభ్యసించడమే కాకుండా ఇంట్లో మాట్లాడేది ఉర్దూ భాషలోనేనని గుర్తుకు తెచ్చుకున్నారు. ఉర్దూ భాషను ప్రోత్సాహించడానికి ప్రతి ఏడాది ముషాయిరా నిర్వహిస్తున్న అన్వర్ ఉల్ ఉలూమ్ ఎడ్యుకేషనల్ సంస్థ కృషిని అభినందించారు. 18వేల మందికి విద్యను అందిస్తున్న అన్వర్ ఉల్ ఉలూమ్ సంస్థకు ప్రభుత్వ పరంగా ఎటువంటి సహాయం అందించడానికైనా సిద్ధమని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు.


5కే రన్‌ను ప్రారంభిస్తున్న టీసీఎస్ ప్రెసిడెంట్ వి. రాజన్న, యశోద ఆస్పత్రి వైద్యులు

## టీసీఎస్, యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో 5కే రన్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వ్యాయామం, పరుగు, నడక ద్వారా ఉత్సాహంగా ఉండటంతోపాటు రోగాల బారినపడకుండా ఉండవచ్చని టీసీఎస్ ప్రెసిడెంట్ వి. రాజన్న అన్నారు. వరల్డ్ హెల్త్‌డే సందర్భంగా యశోద ఆస్పత్రి, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) సంయుక్తాధ్వర్యంలో హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రి నుంచి ప్రారంభమైన 5కే రన్‌ను యశోద ఆస్పత్రి వైద్యుడు జి. అభినవ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. రన్‌లో పాల్గొన్న టీసీఎస్ ఉద్యోగులకు యశోద ఫిజియోథెరపిస్టుల ఆధ్వర్యంలో వామప్ సెషన్ నిర్వహించారు. టీసీఎస్ ఉద్యోగులు, యశోద ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


మహనీయులకు నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

## మహనీయుల జీవితాలపై అధ్యయనం చేయాలి

● వర్సిటీలకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచన

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిరావుఫూలే, జగ్జీవన్‌రామ్, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జీవితం, వారు నడిచిన మార్గం పై విశ్వవిద్యాలయాలు అధ్యయనం చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. నాలుగు రోజులుగా ఉస్మానియా యూనివర్సిటీలో జరుగుతున్న మహనీయులు జయంత్యుత్సవాలు ఆదివారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు మహనీయుల జీవితాలు, వారు చూపిన మార్గాలపై లోతైన చర్చ సహా వివిధ కార్యక్రమాలు నిర్వహించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ ఎం. కుమార్ చొరవను ప్రశంసించారు. మహనీయుల స్ఫూర్తితో ఎస్సీ వర్గీకరణ, 42 శాతం రిజర్వేషన్ల బిల్లును రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని గుర్తుచేశారు. కొన్ని అడ్డంకుల వల్ల జాబ్ క్యాలెండర్ ఆలస్యమైందని, త్వరలో నోటిఫికేషన్లు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి సంఘ ఎన్నికలు జరగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల అభ్యున్నతి, ఉద్యోగ కల్పన, నైపుణ్యాల అభివృద్ధితోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ సందర్భంగా వివిధ కళాశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మహాత్మ జ్యోతిరావు ఫూలే జీవితంపై ఓయూలోని ఫూలే పరిశోధనా కేంద్రం తీసుకొచ్చిన పలు పరిశోధనా పత్రాలతో కూడిన తొమ్మిది పుస్తకాలను మంత్రి పొన్నం ప్రభాకర్, వీసీ కుమార్ మొలుగరం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఓయూ రిజిస్ట్రార్ నరేష్ రెడ్డి, ఎస్‌ఓడీ జితేందర్ నాయక్, యూజీసీ డీన్ ప్రొఫెసర్ లావణ్య, అన్ని విభాగాల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా విశాల్ దివస్, నగర కీర్తన

● పూల రథంలో గురు గ్రంథం ఊరేగింపు ● అలరించిన యువతీయువకుల ప్రదర్శనలు

అమీర్‌పేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అమీర్‌పేట గురుద్వారా ఆధ్వర్యంలో కొనసాగుతున్న వైశాఖీ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన విశాల్ దివస్, నగర కీర్తన కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పూల రథంలో పవిత్ర గురుగ్రంథాన్ని ఊరేగిస్తూ, దారిపొడవునా గ్రంథ పఠనం చేస్తూ గుర్బాణీ కీర్తనలు ఆలపిస్తూ కొనసాగిన నగర కీర్తన ర్యాలీ చూపరులను కట్టిపడేసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు నగరంలోని పలు గురుద్వారాలకు చెందిన సిక్కులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం గురుగోబింద్‌సింగ్ సేడియంలో విశాల్ దివస్ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అమృత్‌సర్ నుంచి వచ్చిన సిక్కు మత గురువులు(రాగి జత్తాస్) తేజిందర్‌సింగ్ కన్నవాలే, సతిందర్ పాల్ సింగ్, జ్ఞానీ ప్రీత్‌పాల్ సింగ్ పాటియాతో పాటు నగరానికి చెందిన వీర్ సింగ్‌ల బృందం గుర్బాణీ కీర్తనలు ఆలపిస్తూ గురు గ్రంథ పఠనం చేశారు. అనంతరం ఆధ్యాత్మిక సంగీత విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గురుగ్రంథాన్ని సిక్కులు దర్శించుకుని పూజలు చేశారు. విశాల్ దివస్‌లో ప్రధాన ఘట్టమైన నగర కీర్తన కార్యక్రమంలో యువతీయువకులు చేసిన ప్రదర్శనలు అలరించాయి. ఊరేగింపులో కత్తి యుద్ధం, గుర్రపు స్వారీ వంటి ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలను ప్రదర్శించారు. గురు గ్రంథాన్ని, సిక్కు సంప్రదాయ ఆయుధాలను ప్రదర్శిస్తూ ఊరేగింపు నిర్వహించారు. అమీర్‌పేట గురుద్వారా నుంచి ఆదివారం సాయంత్రం ప్రారంభమైన ర్యాలీ లాల్‌బంగ్లా, గ్రీన్‌ల్యాండ్స్, పంజాగుట్ట మీదుగా తిరిగి గురుద్వారా చేరింది. ఊరేగింపు సందర్భంగా దారిపొడవున బాణసంచాను కాల్చారు. ఈ వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఆర్‌నగర్, పంజాగుట్ట పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుద్వారా అధ్యక్ష, కార్యదర్శులు దర్శన్‌సింగ్, సురేందర్‌సింగ్, ఉపాధ్యక్షులు లాహోర్‌సింగ్, కుశ్వంత్‌సింగ్, చైర్మన్ అజిత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.


విశాల్ దివస్‌లో సిక్కులు

### ధర్మం కోసం త్యాగం చేసింది సిక్కు సమాజం : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అమీర్‌పేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ధర్మం కోసం త్యాగం చేసినది సిక్కు సమాజమని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. అమీర్‌పేటలో జరుగుతున్న వైశాఖీ ఉత్సవాలను తిలకించేందుకు వచ్చిన ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమీర్‌పేట గురుద్వారా ప్రాముఖ్యతను తెలుసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ ఇక్కడకు వచ్చి తన భక్తిని చాటుకున్న విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు బూర్గుల శ్యామ్‌సుందర్‌గౌడ్, కార్పొరేటర్ సరళ పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి


నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

## హైదరాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యవర్గం

బర్కత్‌పుర, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం లాల్‌బహదూర్ స్టేడియంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్. సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌ఆర్ సంజీవ్‌కుమార్, కోశాధికారిగా కె. నరసింహ, ఉపాధ్యక్షులుగా కె. సుధాకర్, డి. వెంకటేష్, జి. శ్రీనివాస్‌రెడ్డి, వంశీ, రఫిక్, సంయుక్త కార్యదర్శులుగా శివకుమార్, రత్నాకర్, శ్యామ్‌రావు, గమహ, కార్యవర్గ సభ్యులుగా గణేష్, రణధీర్, అఖిల, రమ్య (రైల్వే), రమ్య (ఎస్‌టీ కాలేజ్), భగత్, రాజ్‌కుమార్, మౌనిక ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం. దేవేందర్‌రెడ్డి, పరిశీలకులు బి. లక్ష్మణ్, జి. ఉమేష్ తెలిపారు.


మాట్లాడుతున్న బీసీ జన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్‌కుమార్ యాదవ్

## బీసీ మండల్ సిఫార్సులను అమలు చేయాలి

బర్కత్‌పుర, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బీసీ మండల్ సూచించిన 40 సిఫార్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే అమలు చేయాలని బీసీ జన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్‌కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ జనచైతన్య వేదిక మండల్ ఆశయ సాధన సమితి సంయుక్తాధ్వర్యంలో బీపీ మండల్ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీపీ మండల్ బీసీ రిజర్వేషన్ల పితామహుడని, ఆయన చేసిన సిఫార్సులను పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. ఆగస్టు 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా బీపీ మండల్ రథ యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీపీ మండల్ జయంతి, వర్ధంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహించాలని కోరారు. త్వరలో చేపట్టబోయే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో బీసీలకు 9 పదవులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బహుజన ముక్తి పార్టీ జాతీయ అధ్యక్షుడు దాసూరాం నాయక్, బీసీ జనచైతన్య అధ్యక్షుడు బక్కన్న యాదవ్, ప్రధాన కార్యదర్శి పెంట రమేష్, ప్రచార కార్యదర్శి అనిల్ తదితరులు పాల్గొన్నారు.


ట్రోఫీతో సీవీ ఆనంద్ జట్టు

## ఇంటర్ క్లబ్ క్రికెట్ టోర్నమెంట్ విజేత సికింద్రాబాద్ క్లబ్

హైదరాబాద్: సికింద్రాబాద్ క్లబ్ జట్టు దశాబ్దం అనంతరం ఇంటర్ క్లబ్ క్రికెట్ టోర్నమెంట్‌ను గెల్చుకుంది. ఫతేమైదాన్ క్లబ్‌తో ఆదివారం జరిగిన ఫైనల్లో సికింద్రాబాద్ జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఫతేమైదాన్ నిర్ణీత 20ఓవర్లలో 8 వికెట్లకు 160 పరుగులు సాధించింది. రాహుల్ బుద్ధి 76(నాటౌట్) రాణించాడు. అక్షత్ మూడు వికెట్లు సాధించాడు. ఛేదనలో సికింద్రాబాద్ క్లబ్ కేవలం 14.5 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి విజయం అందుకుంది. చరణ్ 84, సంజీవ్‌రెడ్డి 57 పరుగులు చేయగా, సీవీ ఆనంద్ ఏడు పరుగులతో నాటౌట్‌గా నిలిచారు.

## తెలంగాణ సంస్కృతికి కుస్తీ పోటీలు ప్రతిబింబం

● ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

బర్కత్‌పురా, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు కుస్తీ పోటీలు ప్రతిబింబంగా నిలిచాయని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆధునిక క్రీడలు ఎన్ని పుట్టుకొచ్చినా కుస్తీ పోటీలకు మాత్రం ఆదరణ తగ్గలేదని అన్నారు. ఎల్బీ స్టేడియంలో ఆదివారం రాత్రి తెలంగాణ కేసరి కుస్తీ పోటీల ముగింపు కార్యక్రమంలో ఆమె పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుస్తీ అనేది ఒక యుద్ధ కళ, పోరాట క్రీడ అని అన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


కుస్తీ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

### ● నగధగలు


కొత్తపేటలో సినీనటి వైష్ణవి చైతన్య సందడి చేశారు. విశిష్ట జువెలర్స్ ప్రారంభానికి విచ్చేసిన ఆమె ఇలా ఫొటోకు పోజులిచ్చారు

## మమ్మల్ని కాపాడండి మహాప్రభో

### కాలుష్యాన్ని అరికట్టాలని పలు కాలనీల ప్రజల నిరసన

నిజాంపేట్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఖాజీపల్లి, బొంతపల్లి, పాశమైలారం తదితర పారిశ్రామికవాడల్లో రసాయనిక పరిశ్రమల నుంచి విడుదలవుతున్న వాయు కాలుష్యాన్ని అరికట్టాలని ఆదివారం బొల్లారం చౌరస్తాలో బాచుపల్లికి చెందిన పలు కాలనీల ప్రజలు, అసోసియేషన్ సభ్యులు నిరసన వ్యక్తం చేసి ర్యాలీ నిర్వహించారు. పలుమార్లు ఫిర్యాదు చేయగా సమస్యను పరిష్కరిస్తామని పీసీబీ అధికారులు హామీ ఇచ్చి పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్య పరిశ్రమల జాబితా విడుదల చేస్తామని, వాటిని తరలిస్తామని హామీ ఇచ్చినా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కాలుష్యం నుంచి రక్షించాలని డిమాండ్ చేశారు. పీసీబీ నిర్లక్ష్య వైఖరి నశించాలి, పీసీబీ డౌన్ డౌన్, స్వచ్ఛమైన గాలి అందించాలి, పీసీబీ నిర్లక్ష్య వైఖరితోనే మాకు ఈ సమస్య ఏర్పడిందని అధికారుల తీరుపట్ల ఆగ్రహం వ్యక్తం చేస్తూ ర్యాలీలో నినాదాలు చేశారు. కాలుష్య పరిశ్రమలపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళన కార్యక్రమంలో హరితవనం కాలనీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు, బీజేపీ మల్కాజ్‌గిరి కౌన్సిల్ సభ్యుడు వెంకట సుబ్బారావు, కేఆర్‌సీఆర్, శ్రీహోమ్స్, రేణుక ఎల్లమ్మ, నందనవనం తదితర కాలనీల ప్రజలు, అసోసియేషన్ సభ్యులు కుటుంబ సభ్యులతోసహా ఆందోళనలో పాల్గొన్నారు.




మట్టల ఆదివారం సందర్భంగా సికింద్రాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు


# ‘విను తెలంగాణ’ ఆవిష్కరణ

● కేసీఆర్ పాలనలో అనేక విషయాలను పుస్తకంలో ప్రస్తావించిన రచయిత

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల కేసీఆర్ అప్రజాస్వామిక పాలనపై విసుగెత్తిన ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపిస్తే, ఇప్పుడు ఈ ప్రభుత్వం కూడా అదే విధానాలను అనుసరిస్తోందని ప్రముఖ సామాజిక వేత్త ఆచార్య హరగోపాల్ వ్యాఖ్యానించారు. కంచ గచ్చిబౌలి భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం తీరు చూస్తుంటే బాధ కలుగుతోందని అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి కనీస సమాచారం ఇవ్వకుండా నాలుగు వందల ఎకరాలను ఓ కార్పొరేట్ సంస్థకు ధారాదత్తం చేయాలని చూసిన ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు అసలు దోషి అని విమర్శించారు. రేవంత్ సర్కారు ఎందుకిలా ప్రవర్తిస్తున్నదో అర్థం కావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలు, అనుభవాల మధ్య అంతరాన్ని “విను తెలంగాణ” పుస్తకం కళ్లకు కడుతున్నదని పేర్కొన్నారు. ప్రజా ఉద్యమం ఏదైనా సరే, ప్రత్యామ్నాయ దృక్పథం లేకపోతే దాని స్ఫూర్తి ఎక్కువ కాలం నిలవదని, తెలంగాణ ఉద్యమం విషయంలోనూ అదే జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య తెలంగాణ సాధన దిశగా రాష్ట్ర పునర్నిర్మాణం జరగాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు.

సభాధ్యక్షత వహించిన ప్రముఖ సినీ దర్శకుడు బి. నరసింగరావు మాట్లాడుతూ..సమైఖ్య పాలనలో ముఖ్యమంత్రులు ప్రజలను గౌరవించారు. ఎన్టీఆర్ సీఎంగా ఉన్న కాలంలో ఆరు నెలలకు ఒకసారైనా తనను పిలిపించి రాజకీయాలకు అతీతంగా కళా రంగం గురించి సంభాషించేవారని గుర్తు చేసుకున్నారు. తెలంగాణలో గద్దర్‌కు దొరకనట్టే తనకూ పదేళ్ల పాలనలో సీఎం అపాయింట్‌మెంట్ లభించలేదని తెలిపారు. కేసీఆర్ పదేళ్ల పెత్తందారీ పోకడలతో పాలన సాగించాడు, పైకి మాత్రం ప్రగతి కరమైన పరిపాలనగా ప్రచారం చేసుకున్నాడంటూ బి. నరసింగరావు విమర్శించారు. ఇదివరకటి కంటే రేవంత్ రెడ్డి పాలన మెరుగ్గా ఉందని, దీన్ని కాపాడుకోవాలని హితవుపలికారు. కేసీఆర్ పదేళ్ల పాలనలోని అనేక విషయాలను కందుకూరి రమేష్ ఈ పుస్తకంలో ధైర్యంగా రాశారని ప్రశంసించారు. రాజకీయ నాయకులు తమ హోదాలకు అతీతంగా ప్రజలను కలవాలని నరసింగరావు సూచించారు.

ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం మాట్లాడుతూ.. వర్తమాన తెలంగాణను అర్థం చేసుకోడానికి ఈ పుస్తకం తోడ్పడుతుంది అని తెలిపారు. భవిష్యత్తు తెలంగాణ మీద ప్రజల్లో ఉన్నంత స్పష్టత నాయకత్వానికి లేదని, దీన్ని ప్రశ్నించాలని అభిప్రాయపడ్డారు. పుస్తక రచయిత కందుకూరి రమేష్ మాట్లాడుతూ. పుస్తక రచన సమయంలో తాను ఎదుర్కొన్న సమస్యలను, సవాళ్లు, బెదిరింపులను వివరించారు. వీక్షణం ఎడిటర్ ఎన్. వేణుగోపాల్, సీనియర్ జర్నలిస్టు రేమిల్ల అవధాని తదితరులు పాల్గొన్నారు.


“విను తెలంగాణ” పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య హరగోపాల్, చిత్రంలో బి. నరసింగరావు, ఎమ్మెల్సీ కోదండరాం, ఎన్. వేణుగోపాల్, రేమిల్ల అవధాని

# వెండి పట్టీలతో ప్రయోజనాలెన్నో...!

పాదాలకు వెండి పట్టీలు పెట్టుకోవడం అనేది ఒక సంప్రదాయంగా వస్తోంది. ఆడపిల్లలు, యువతులు, మధ్యవయసు మహిళలు తమ పాదాల అలంకరణలో వీటికి ప్రత్యేక స్థానం ఇస్తూ ఉంటారు. కేవలం అందానికి మాత్రమే కాదు ఆరోగ్యానికి కూడా ఈ వెండి పట్టీలు దోహదం చేస్తాయి. ఆ వివరాలు తెలుసుకుందాం...



- పాదాలకు వెండి పట్టీలు పెట్టుకోవడం వల్ల శరీరంలో రక్తప్రసరణ సాఫీగా జరుగుతుంది. పాదాల నొప్పి, వాపులు తగ్గుతాయి. ఎముకలు బలపడతాయి. మోకాళ్ల నొప్పి, నడుం నొప్పి నుంచి కూడా ఉపశమనం కలుగుతుంది.
- వెండిలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు అధికంగా ఉంటాయి. అందుకే వెండి పట్టీలు పెట్టుకుంటే పాదాలకు ఫంగల్ ఇన్ఫెక్షన్లు రావు.
- వెండి శీతల లోహం. నిత్యం వెండి పట్టీలు పెట్టుకుని ఉండడం వల్ల మహిళల్లో శరీర ఉష్ణోగ్రత నియంత్రణలో ఉంటుంది. శరీరానికి చలువదనం చేకూరుతుంది. వేసవిలో పాదాలు వేడెక్కడం, అరికాళ్లలో చెమటలు పట్టడం లాంటి సమస్యలు తగ్గుతాయి.
- వెండి... శరీరంలోని విద్యుత్ చలన శక్తిని సమన్వయం చేస్తుంది. అందుకే మహిళలు తమ పాదాలకు వెండి గొలుసులు, పట్టీలు పెట్టుకోవడం వల్ల నాడీ వ్యవస్థ చురుకుగా పనిచేస్తుంది. దీనివల్ల శరీరంలోని హార్మోన్లు సమతౌల్యంలో పనిచేస్తాయి. రుతు సమస్యలు, మానసిక ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి.
- రంగురంగుల రాళ్లు, మువ్వలతో విభిన్న ఆకృతుల్లో రూపొందించిన పట్టీలు పెట్టుకోవడం వల్ల మహిళలకు మానసిక ఆనందం కలుగుతుంది.
- అధిక బరువున్న పట్టీలు కాకుండా తేలికగా ఉన్నవాటిని ధరిస్తే నడవడానికి సౌకర్యవంతంగా ఉంటుంది. నాణ్యమైన వెండితో రూపొందించిన పట్టీలు ఎంచుకోవడం మంచిది.





# అందం అంటే అంతకుమించి

**మిస్ వరల్డ్ సంస్థ సీఈఓ 85 ఏళ్ల జూలియా మోర్లీని చూస్తే 60 ఏళ్లు అనిపిస్తుంది. ఈ ప్రపంచానికి ఏదో చేయాలనే తపన అనుక్షణం కనిపిస్తూ ఉంటుంది. "అందం అనేది బాహ్యశరీరంలో మాత్రమే ఉండదు.. వ్యక్తిత్వంలో కూడా ఉంటుంది.. ఈ రెండూ కలిసినదే అసలైన అందం" అంటారు జూలియా. కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్ (సీబీఈ) సహా అనేక అంతర్జాతీయ అవార్డులు పొందిన జూలియాకు తెలుగు ప్రజలంటే ప్రత్యేక అభిమానం ఉంది. వచ్చే నెల ప్రపంచ సుందరి పోటీలు హైదరాబాద్‌లో జరుగుతున్న నేపథ్యంలో ఆమె 'నవ్య'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.**

**ఈ సారి ప్రపంచ సుందరి పోటీలు తెలంగాణలో నిర్వహిస్తున్నారు. ఈ రాష్ట్రాన్ని ఎంపిక చేసుకోవటానికి కారణమేమిటి?**

ప్రపంచ సుందరి పోటీలను ప్రతి ఏడాది వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహిస్తూ ఉంటాం. ఈ సారి తెలంగాణను ఎంపిక చేశాం. దీనికి కొన్ని కారణాలు ఉన్నాయి. నేను ఇక్కడ ఎవరికీ చెప్పని ఒక విషయం చెబుతాను. నాకు తెలుగు ప్రజలంటే ప్రత్యేక అభిమానం. ఎందుకంటే సుమారు రెండు దశాబ్దాల క్రితం నేను, ఎరిక్ (జూలియా భర్త) భారత్‌కు వచ్చి అనేక ప్రాంతాలు తిరిగాం. ఆ సమయంలో మేము మహిళలకు శానిటరీ నేప్‌కిన్స్ ఇచ్చే ఒక కార్యక్రమాన్ని నిర్వహించేవాళ్లం. ఆ సమయంలో హైదరాబాద్‌కు కూడా వచ్చాం. ఆ కార్యక్రమ నిర్వహణలో మాకు పోలీసులు చాలా సాయం చేశారు. అందుకే హైదరాబాద్ అనగానే పోలీసుల ఔదార్యం గుర్తుకు వస్తుంది. ఇది చాలా కాలం క్రితం జరిగి సంఘటన. కానీ నిన్న జరిగినట్లు అనిపిస్తోంది. ఈ సారి కూడా తెలంగాణ ప్రజలు ఎంతో ప్రేమ చూపిస్తున్నారు. వారందరికి నా ధన్యవాదాలు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. నా ఉద్దేశంలో హైదరాబాద్ ప్రపంచంలో ఎక్కువ మందికి తెలియని ఒక రహస్యం. ప్రపంచంలోని పెద్ద పెద్ద కంపెనీల ఆఫీసులు ఇక్కడ ఉన్నాయి. ఇదొక అందమైన నగరం. కానీ దీని గురించి ఎక్కువ మందికి తెలియదు. ప్రపంచ సుందరి పోటీలు ఈ నగరానికి కొత్త గుర్తింపు తీసుకువస్తుందని ఆశిస్తున్నా. ఈ పోటీల తర్వాత ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు ఇక్కడకు మరింతగా రావాలని కోరుకుంటున్నా.

**ప్రపంచ సుందరి పోటీలు దేనికి చిహ్నంగా భావించాలి?**

ఒక అందమైన అమ్మాయిని ప్రపంచ సుందరిగా ప్రకటించటం మా ఉద్దేశం కాదు. నా దృష్టిలో అందం అంటే శరీర సౌందర్యం కాదు. అందమైన మొహం.. పెదాలు.. అవయవ సౌష్టవం ఉంటే ప్రపంచ సుందరిలు కారు. వారికి అందమైన వ్యక్తిత్వం ఉండాలి. ఇతరులకు సాయం చేసే గుణం ఉండాలి. అందుకే ఈ పోటీలను నేను 'బ్యూటీ విత్ పర్పస్' అని పిలుస్తాను. ఇక్కడికి వచ్చే అందగత్తెలందరూ వారి వారి దేశాల్లో చేయదలుచుకున్న ప్రాజెక్టులను తీసుకువస్తారు. వారు ఏ ప్రాజెక్టులు చేయాలనే విషయాన్ని మేము వారికి చెప్పం. వారి ఊహాశక్తి.. కొన్ని అంశాలపై వారికి ఉన్న నిబద్ధతల ఆధారంగా వాటిని వారు ఎంపిక చేసుకుంటారు. ఇలా ప్రతి ఏడాది సుమారు 130 ప్రాజెక్టులు వస్తాయి. వీటిలో కొన్నింటిని ఎంపిక చేసి వాటికి అవసరమైన వనరులు సమకూరుస్తాం. అందుకే ప్రపంచ సుందరి పోటీలంటే భౌతికపరమైన అందం మాత్రమే కాదని చెప్పగలుగుతున్నాను.

**ఈ సారి ప్రపంచ సుందరి పోటీలలో ఫార్మాట్ మార్చినట్లున్నారు కదా..**

ఫార్మాట్‌లో మార్పులు జరుపుతూనే ఉంటాం. ఉదాహరణకు ఒకప్పుడు స్విమ్‌సూట్ రౌండ్ ఉండేది. అది ఇప్పుడు లేదు. బీచ్‌లో ఉన్నప్పుడు స్విమ్ సూట్ వేసుకుంటాం. ప్రతి రోజు దాన్ని వేసుకొని తిరగం కదా! అంతే కాదు ...వ్యక్తిగతంగా కూడా నాకు స్విమ్‌సూట్ వేసుకొని ఇతరుల ముందుకు నడుచుకుంటూ రావటం ఇష్టం ఉండదు. కానీ కొన్ని పరిస్థితులకు తగ్గట్టుగా ఆ రౌండ్ ఉండేది. ఇక్కడ ఇంకొక విషయం చెప్పాలి. మేము 1953లో ప్రపంచ సుందరి పోటీలను ప్రారంభించినప్పుడు పరిస్థితులు వేరుగా ఉండేవి. ప్రపంచమంతా రెండో ప్రపంచయుద్ధ ఒత్తిడి నుంచి తేరుకుంటోంది. ఈ సమయంలో ప్రజలందరిలోను ఒక విధమైన నిరాశ, ఆందోళన ఉండేవి. ఆ సమయంలో వారిలో సంతోషం నింపటానికి ఏదైనా చేస్తే బావుండనని పించింది. ప్రపంచసుందరి పోటీలు అలా పుట్టాయి. దీనిని ప్రపంచ ప్రజలందరూ ఆదరించారు. పరిస్థితులకు అనుగుణంగా మేము ఎప్పటికప్పుడు మార్పులు తెస్తూనే ఉంటాం.

**ప్రపంచ సుందరి పోటీల ద్వారా వచ్చిన సంపాదనను ఏం చేస్తారు? ఎలా ఖర్చు పెడతారు?**

మాకు ఈ పోటీల నుంచి వచ్చే డబ్బులో ఒక్క రూపాయి కూడా అవసరం లేదు. డబు సంపాదించటం పట్ల నాకు ఎటువంటి ఆసక్తి లేదు. వచ్చిన డబ్బు మొత్తం మేము నిర్వహించే ప్రాజెక్టులపైనే ఖర్చు పెడతాం. ఈ ప్రాజెక్టులు విజయవంతమయినప్పుడు కలిగే ఆనందానికి వెల లేదు. ఉదాహరణకు మేము ఇండోనేషియాలో ఒక ప్రాంతంలో ఒక వంతెన నిర్మించాం. దాని వల్ల కొన్ని వందల మందికి లబ్ధి చేకూరుతోంది. అక్కడున్న పిల్లలు స్కూలుకు వెళ్లగలుగుతున్నారు. ఆ పిల్లలను కలిసినప్పుడు వారు చూపించిన ప్రేమ అమూల్యమైనది. అంతేకాకుండా- ప్రపంచవ్యాప్తంగా ఉన్న కొన్ని వేల మంది వలంటీర్లు తమ పరిధిలో సమాజంలో మార్పు తేవటానికి చేస్తున్న ప్రయత్నాలను డబ్బులతో వెలకట్టలేం.

**మీరు ఇన్నేళ్లుగా పోటీలను నిర్వహిస్తున్నారు కదా.. మరచిపోలేని సంఘటనలు ఏవైనా ఉన్నాయా?**


చాలా ఉన్నాయి. కానీ ఒక సంఘటన మాత్రం ఎప్పుడూ మర్చిపోలేను. మేము నైజీరియాలో పోటీలను నిర్వహించాలనుకున్నాం. అక్కడి ప్రభుత్వం కూడా చాలా సాయం చేసింది. పోటీల సమయంలోనే అమీనా అనే అమ్మాయిని రాళ్లతో కొట్టి చంపారని ఒక అంతర్జాతీయ పత్రికలో వార్త వచ్చింది. దీనితో ప్రపంచవ్యాప్తంగా పెద్ద సంచలనం చెలరేగింది. వాస్తవానికి ఆ సంఘటన జరగలేదు. కొందరు పాశ్చాత్య జర్నలిస్టులు కావాలని రాసిన వార్త. ఆ విషయం మాకు తెలుసు. కానీ ప్రపంచానికి తెలియదు కదా! ప్రపంచమంతా అలజడి ప్రారంభమయింది. దీనితో రాత్రికి రాత్రి పోటీలను రద్దు చేసుకున్నాం. ఒక విమానాన్ని అద్దెకు తీసుకొని పోటీదారులందరితో ఇంగ్లాండ్ వచ్చేశాం. రాత్రికి రాత్రి వందల మందిని ఒక దేశం నుంచి మరొక దేశానికి తీసుకురావాలంటే ఎంత ఒత్తిడి ఉంటుందో ఆలోచించండి! ఇది ఎప్పటికీ మరచిపోలేని అనుభవం.

**ఈ పోటీలలో బీద.. ధనిక దేశాల నుంచి వచ్చిన యువతులు ఉంటారు. వారిలో కొందరికి విపరీతంగా ఖర్చు పెట్టే స్తోమత లేకపోవచ్చు. అలాంటప్పుడు అందరికీ సమాన అవకాశాలు కల్పించేలా ఎలాంటి చర్యలు తీసుకుంటారు..**

ప్రతి దేశంలోను మిస్‌వరల్డ్ తొలి రౌండ్ పోటీలను నిర్వహించటానికి కొందరు లైసెన్స్ హోల్డర్స్ ఉంటారు. వారు వారి దేశాలలో నెగ్గిన వారికి స్పాన్సరర్స్‌ను తీసుకువస్తారు. ఒకప్పుడు దుస్తుల మీద ఎక్కువ ఖర్చు పెట్టేవారు కాదు. ఇప్పుడు ఆ ఖర్చు విపరీతంగా ఉంటోంది. అందుకే నేను జ్యూరీ సభ్యులకు "మీరు ఎవ్వరి ఒత్తిడికి లొంగవద్దు. ఇతరులు ఏం చేస్తున్నారే విషయాన్ని చూడద్దు. మీరు స్వయంగా నిర్ణయాలు తీసుకోండి.." అని చెబుతూ ఉంటా. "ఒక అమ్మాయి అద్భుతమైన డ్రస్సు వేసుకుంటే ప్రపంచ సుందరి అయిపోతుందా? ఇంకో అమ్మాయి ఇతరుల కన్నా బాగా మాట్లాడగలిగితే ప్రపంచ సుందరి అయిపోతుందా?" అని అడిగితే "కాదు" అని కచ్చితంగా చెప్పగలను.

- అందం అనేది చాలా చిత్రమైన పదం. ఒక అమాయకమైన పాప మొహంలో కనిపించే అందం కొందరు మాత్రమే చూడగలుగుతారు. చాలా సార్లు అందం అనే పదాన్ని తప్పుగా వాడుతూ ఉంటారు. నా ఉద్దేశంలో ప్రేమ, నిబద్ధత, ఇతరులకు సేవ చేయాలనే కోరిక, మంచి వ్యక్తిత్వం, చురుకుదనం- ఇవన్నీ కలగసినప్పుడే నిజమైన అందం కనిపిస్తుంది.
- మొత్తం ప్రపంచమంతా ఒకరితో మరొకరు ఎటువంటి అమరికలు లేకుండా స్వేచ్ఛగా అభిప్రాయాలు పంచుకోగలిగిన రోజు రావాలనేది నా కోరిక. అన్ని చోట్ల భిన్నాభిప్రాయాలు ఉంటాయి. రకరకాల ప్రతికూల భావాలు కూడా ఉంటాయి. వాటన్నింటినీ అధిగమించగలిగినప్పుడు అందమైన ప్రపంచాన్ని సృష్టించుకోగలుగుతాం.
- ఈ సారి పోటీల తర్వాత తెలంగాణకు ఏదో విషయంలో మేలు చేయాలనేది మా ఉద్దేశం. ముఖ్యంగా పిల్లలకు, మహిళలకు సంబంధించిన ప్రాజెక్టులను ఎంపిక చేసుకుంటాం.

• సివిఎల్ఎన్. ప్రసాద్






## కోట్ల రూపాయలు వదులుకున్నా



సమంత

మహిళా సాధికారతపై తరచూ ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందిస్తూ మహిళలను చైతన్య పరుస్తున్నారు నటి సమంత. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మానసిక ఆరోగ్యం, వ్యాపార సంస్థలకు బ్రాండ్ అంబాసిడర్‌గా పనిచేయడం గురించి మాట్లాడారు. కోట్ల రూపాయల డబ్బు వస్తున్నప్పటికీ వాటిని పక్కన బెట్టడం వెనుక బలమైన కారణం ఉందన్నారు. '20 ఏళ్లకే ఇండస్ట్రీలోకి వచ్చాను. అప్పట్లో ఎన్ని సినిమాలు చేశాం. ఎన్ని బ్రాండ్లకు ప్రచారకర్తగా ఉన్నాం అనేదానిపైనే సక్సెస్‌ని నిర్ణయించేవారు. నిజానికి ఆ సమయంలో ఎన్నో బహుళజాతి కంపెనీల ఉత్పత్తులకు ప్రచారకర్తగా వ్యవహరించా. అది నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది. కానీ ఇప్పుడు నేను ఎన్నో విషయాలు నేర్చుకున్నా. ఎంతో బాధ్యతగా వ్యవహరించాలని తెలుసుకున్నా. ఒకప్పుడు పెద్దగా ఆలోచించకుండా కొన్ని బ్రాండ్లకు ప్రమోషన్స్ చేశా. అందుకు ఇప్పుడు సారీ చెబుతున్నా. కోట్ల రూపాయలు చెల్లించేందుకు సిద్ధపడినా ఏడాది కాలంలో 15 బ్రాండ్లు వదులుకున్నా. ఇప్పటికీ చాలా అవకాశాలు వస్తున్నాయి. కానీ నేను అంగీకరించడం లేదు. నాకు తెలిసిన వైద్యులను సంప్రదించి సదరు బ్రాండ్లతో ఎలాంటి హానీ లేదనిపిస్తేనే ప్రమోట్ చేస్తున్నా' అని సమంత తెలిపారు.

## వినోదం పంచే పాంచ్‌మినార్



రాజ్‌తరుణ్ హీరోగా రామ్ కడుముల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పాంచ్ మినార్'. మాధవి, ఎంఎస్ఎం రెడ్డి నిర్మిస్తున్నారు. చిత్రబృందం ఆదివారం టీజర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. దర్శకుడు మారుతి టీజర్‌ను ఆవిష్కరించి సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. రాజ్‌తరుణ్ మాట్లాడుతూ 'దర్శకుడు గొప్ప విజన్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చెప్పాడు. రామ్ కడుముల మాట్లాడుతూ 'పాంచ్‌మినార్ అంటే ఏమిటో తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఆద్యంతం హాయిగా నవ్వుకునే సినిమా ఇది' అని తెలిపారు. 'ఇందులో నా పాత్ర విభిన్నంగా ఉంటుంది, ప్రేక్షకులను అలరిస్తుంది' అని కథానాయిక రాశీ సింగ్ చెప్పారు.

## మంచి కథను అందించాలనే..

సుమయ రెడ్డి

'నాకు చిన్నప్పటి నుంచి సినిమాలు అంటే ఆసక్తి. ఇంట్లో ఎక్కువగా బాలకృష్ణ గారి సినిమాలే చూసేవాళ్లం. చదువు పూర్తయ్యాక కొన్నాళ్లు మోడలింగ్ చేశా. సినిమాల్లో నటించాలనేది నా చిరకాల కోరిక. అందుకని చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టాను' అని అన్నారు సుమయ రెడ్డి. ఆమె నిర్మిస్తూ కథానాయికగా నటించిన చిత్రం 'డియర్ ఉమ'. సాయి రాజేశ్ మహదేవ్ దర్శకత్వం వహించారు. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సుమయ రెడ్డి 'చిత్రజ్యోతి'తో మాట్లాడుతూ 'ఓ మంచి కథను ప్రేక్షకులకు అందించాలనే ఉద్దేశంతో 'డియర్ ఉమ' కథ రాశాను. దర్శకుడు సాయి రాజేశ్ మహదేవ్ గారితో నాకు ఎన్నో ఏళ్ల పరిచయం ఉంది. అర్థవంతమైన కథ అందరికీ పనికొస్తుంది అన్నారు. నన్ను నమ్మి డబ్బులు పెట్టి సినిమా తీసేందుకు ఏ నిర్మాత ముందుకు వస్తారు అనే సంశయంలో పడిపోయా. అప్పుడు మా అమ్మ సపోర్ట్‌తో నేనే నిర్మాతగా సినిమా తీయాలని నిర్ణయించుకున్నా. నేడు కార్పొరేట్ ఆస్పత్రుల్లో చోటు చేసుకుంటున్న సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించాం. సొసైటీకి మెసేజ్ ఇవ్వడమే కాదు పరిష్కారాన్నీ చూపించే ప్రయత్నం చేశాం. అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు ఈ సినిమాలో మంచి లవ్ ట్రాక్ కూడా ఉంది. హీరో, హీరోయిన్లు ఒకరి లక్ష్య సాధనకు మరొకరు ఎలా సాయపడ్డారనే అంశాన్ని అద్భుతంగా తెరకెక్కించాం. వీరిద్దరూ కలసి వైద్య వ్యవస్థ ప్రక్షాళనకు ఎలా పోరాడారన్నది ప్రధాన ఇతివృత్తం. ఒక తెలుగమ్మాయిగా నా సినిమాలో తెలుగు హీరోనే పెట్టాలనుకున్నాను. కొంతమందిని సంప్రదించాను కానీ డేట్స్ కుదరలేదు. అందుకని హీరోగా పృథ్వీ అంబర్‌ను ఎంచుకున్నాం' అని అన్నారు.





## పెద్ద విజయం అందుకోబోతున్నాం

'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రానికి తెలుగు రాష్ట్రాల్లో చక్కని ఆదరణ దక్కుతోంది. అన్ని చోట్లా సినిమాకు అద్భుతమైన స్పందన వస్తోంది. ఇది ఇక్కడితో ఆగదు. సినిమా చాలా పెద్ద విజయం సాధించబోతోంది' అని నిర్మాత నవీన్ యెర్నేని అన్నారు. అజిత్ కుమార్ హీరోగా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ఆదివారం సక్సెస్‌మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా అధిక్ రవిచంద్రన్ మాట్లాడుతూ 'మైత్రీ సంస్థ తమిళంలో చేసిన తొలి చిత్రమిది. నవీన్ గారి వల్లే సినిమా ఇంత పెద్దహిట్ అయింది. అజిత్ గారి మద్దతు మరువలేనిది' అని చెప్పారు. అజిత్‌ఫ్యాన్స్ ఈ సినిమాను ఎంజాయ్ చేస్తున్నారని సునీల్ చెప్పారు. ఈ సినిమాలో నా పాత్రకు ప్రేక్షకుల ప్రశంసలు దక్కడం ఆనందాన్నిచ్చింది అని ప్రియా ప్రకాశ్ వారియర్ తెలిపారు.

## భావోద్వేగానికి గురైన మంచు లక్ష్మి



ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన బోధన అందించే లక్ష్యంతో నటి మంచు లక్ష్మి 'టీచ్ ఫర్ ఛేంజ్' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ప్రతీ ఏడాదీ హైదరాబాద్‌లో సెలబ్రిటీ ఫ్యాషన్ షోను నిర్వహిస్తున్నారు. తాజాగా, నోవాటెల్ హైటెక్స్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి మంచు మనోజ్, తన సతీమణి మౌనికతో విచ్చేసి మంచు లక్ష్మిని ఆశ్చర్యపరిచారు. చాలా రోజుల తర్వాత తన తమ్ముడిని చూసిన ఆనందంలో ఆమె, భావోద్వేగంతో మనోజ్‌ను హత్తుకున్నారు. కంటనీరు పెట్టుకున్న మంచు లక్ష్మిని మౌనిక ఓదార్చారు.



ఈ దేశ అభివృద్ధిలో మహిళా సాధికారత అత్యంత ప్రధానమైన అంశం.
వారు సాధించిన ప్రగతి ఆధారంగానే సమాజ అభివృద్ధిని కొలవగలం.
- అంబేడ్కర్





# ఉక్రెయిన్‌ను బెర్లిన్‌లా విభజిద్దాం



» యుద్ధాన్ని ముగించడానికి అమెరికా రాయబారి కీత్ కెల్లాగ్ సూచన
» వివాదాస్పదం కావడంతో వక్రీకరించారంటూ వివరణ

వాషింగ్టన్, ఏప్రిల్ 13: దాదాపు మూడేళ్లకు పైగా కొనసాగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేందుకు యత్నిస్తోన్న అమెరికా కొత్త ఫార్ములా తీసుకొచ్చింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత బెర్లిన్‌ను విభజించినట్లే ఉక్రెయిన్‌ను కూడా నియంత్రణ మండలాలుగా విభజించాలని అమెరికా ప్రత్యేక రాయబారి జనరల్ కీత్ కెల్లాగ్ సూచించారు. బ్రిటీష్, ఫ్రెంచ్ బలగాలు పశ్చిమ ఉక్రెయిన్‌లో భరోసా దళంగా ఉంటాయని, ఇప్పటికే ఆక్రమించిన తూర్పు ప్రాంతాలపై రష్యన్ బలగాలు నియంత్రణ కొనసాగిస్తాయన్నారు. నిస్సైనిక మండలాల్లో రెండు దేశాల బలగాలు ప్రవేశించే అవకాశం లేదు కాబట్టి ఘర్షణలకు తావుండదన్నారు. ఇది వివాదం కావడంతో కెల్లాగ్ వివరణ ఇచ్చుకున్నారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని చెప్పారు. ఉక్రెయిన్‌ను విభజించడం తన యోచన కాదన్నారు. ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని కాపాడే చర్యల్లో భాగంగా సైనిక పునరుద్ధరణ గురించి మాట్లాడానన్నారు. కాగా, ఉక్రెయిన్‌లోని సుమీ నగరంపై రష్యా ఆదివారం జరిపిన క్షిపణి దాడుల్లో 32 మంది మృతిచెందారు. పలువురు గాయపడ్డారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో అమెరికా ప్రతినిధి విట్కాఫ్ సమావేశమైన రెండు రోజుల వ్యవధిలోనే ఈ దాడి జరిగింది. అమెరికా, యూరప్ దేశాలు రష్యా చర్యను గట్టిగా విమర్శించాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కోరారు.

# విడాకుల కేసుల్లో మధ్యవర్తిత్వమే మేలు



» విఫలమైతేనే విచారణ వరకు వెళ్లాలి
» జస్టిస్ బి.వి.నాగరత్న సూచన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల విడాకుల కేసుల్లో తొలుత మధ్యవర్తిత్వం జరపాలని, అది విఫలమయితేనే విచారణ వరకు వెళ్లాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.వి. నాగరత్న సూచించారు. శనివారం బెంగళూరులో 'భారత సమాజానికి కుటుంబమే పునాది' అన్న అంశంపై జరిగిన చర్చలో ఆమె ప్రసంగిస్తూ కుటుంబ న్యాయస్థానంలో కేసు విచారణకు రాక ముందే తప్పనిసరిగా మధ్యవర్తిత్వం జరగాలన్నారు. కోర్టులో తొలుత వాదనలు జరిగితే దంపతుల మధ్య దూరం మరింత పెరిగే ప్రమాదముందని అభిప్రాయపడ్డారు. అందువల్ల ఫ్యామిలీ కోర్టుల్లో శిక్షణ పొందిన నిపుణులు లేదా విశ్రాంత న్యాయమూర్తులు మధ్యవర్తులుగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలు సామాజిక, ఆర్థిక రంగాల్లో పురోగతి సాధించడం దాంపత్య జీవితాల విచ్ఛిన్నానికి కారణమవుతోందన్నది కేవలం అపోహ మాత్రమేనని అభిప్రాయపడ్డారు. అది ఏ మాత్రం సరి కాదని చెప్పారు. గత పదేళ్లలో జరిగిన వివాహాల్లో సుమారు 40 శాతం విడాకులకు దారి తీశాయని ఇటీవలే ఒక సర్వేలో తేలిందని గుర్తు చేశారు. భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకోవాలని, ఒకరిపై మరొకరు గౌరవం కలిగి ఉండాలని చెప్పారు.

## లోకం తీరు




## లా కమిషన్ చైర్‌పర్సన్‌గా జస్టిస్ దినేశ్ మహేశ్వరి!



» ఈ వారంలోనే నోటిఫికేషన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: లా కమిషన్ చైర్‌పర్సన్‌గా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ దినేష్ మహేశ్వరి నియమితులయ్యే అవకాశం ఉందని ఆదివారం విశ్వసనీయవర్గాలు తెలిపాయి. 23వ లా కమిషన్ చైర్‌పర్సన్‌గా ఆయనను నియమిస్తూ ఈ వారంలోనే నోటిఫికేషన్ రావచ్చని పేర్కొన్నాయి. 23వ లా కమిషన్‌ను గత ఏడాది సెప్టెంబరు రెండో తేదీన కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దాని కాలపరిమితి మూడేళ్లని పేర్కొంది. దేశంలో ఉమ్మడి పౌరస్మృతి అమలు చేయవచ్చా, లేదా అన్న విషయాన్ని అధ్యయనం చేసే బాధ్యతను కూడా ఈ కమిషన్‌కు అప్పగించింది. జస్టిస్ దినేష్ మహేశ్వరి తొలుత 2004లో రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2019లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టి 2023 మే 14న పదవీ విరమణ చేశారు.

## హైవేల బలోపేతానికి 10 లక్షల కోట్లు: గడ్కరీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల బలోపేతానికి వచ్చే రెండేళ్లలో రూ.10 లక్షల విలువైన ప్రాజెక్టులు చేపడతామని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈశాన్య రాష్ట్రాలు, సరిహద్దు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. రానున్న రెండు సంవత్సరాల్లో ఈశాన్యంలోని రోడ్లు అమెరికాతో సమానంగా ఉంటాయన్నారు. ఓ వార్తా సంస్థ ఇంటర్వ్యూలో గడ్కరీ మాట్లాడుతూ.. తూర్పు రాష్ట్రాల్లో రూ.3.73 లక్షల కోట్ల అంచనాతో 21,355 కిలోమీటర్ల మేర 784 హైవే ప్రాజెక్టులు చేపట్టనున్నామని తెలిపారు. వాటిల్లో రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ, ఎన్‌హెచ్‌ఏఐ, ఎన్‌హెచ్‌ఐడీసీఎల్ ప్రాజెక్టులు ఉన్నాయని చెప్పారు. ఇప్పటికే అసోం, బిహార్ తదితర రాష్ట్రాల్లో రూ.వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

## నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ నోటీసులు 'ప్రజాస్వామ్యంపై దాడి': సిబల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: నేషనల్ హెరాల్డ్ పత్రిక కేసులో స్థిరాస్తుల స్వాధీనానికి ఈడీ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ ఆదివారం తీవ్రంగా స్పందించారు. కాంగ్రె‌స్‌ను బలహీనపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు ఏజెన్సీలను వినియోగిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ కేసులో ఈడీ నోటీసులు జారీ చేయడాన్ని ఆయన 'ప్రజాస్వామ్యంపై దాడి'గా అభివర్ణించారు. హిందూ-ముస్లిం అజెండాపై బీజేపీ రాజకీయాలు చేయాలనుకుంటోందని, విపక్షాన్ని అంతమొందించాలనుకుంటోందని మీడియా సమావేశంలో ఆయన మండిపడ్డారు. వార్తా పత్రికకు సంబంధించిన భవనాల్లో కాంగ్రెస్ కార్యాలయాలు నడుస్తున్నందున వాటిని స్వాధీన పరచుకుని పార్టీ పని చేయకుండా చేసేందుకు నోటీసులు జారీ చేసినట్టు ఆయన చెప్పారు. అయితే 13 ఏళ్లు ఎందుకు వేచి చూశారని ఆయన నిలదీశారు.

## కర్ణాటకలో ఐదేళ్ల చిన్నారిపై హత్యాచారం.. ఎన్‌కౌంటర్‌లో నిందితుడి హతం

బెంగళూరు, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఇంటిముందు ఆడుకుంటున్న ఐదేళ్ల చిన్నారికి చాక్లెట్ ఆశచూపి అత్యాచారానికి పాల్పడ్డాడో మానవ మృగం. అనంతరం ఎవరికైనా చెబుతుందనే భయంతో గొంతు నులిమి చంపేశాడు. ఆ తర్వాత పోలీసు కాల్పుల్లో హతమయ్యాడు. కర్ణాటక రాష్ట్రం హుబ్బళ్లి నగరంలో ఆదివారం జరిగిందీ ఘటన. కొప్పళకు చెందిన ఓ కుటుంబం ఉపాధి నిమిత్తం హుబ్బళ్లికి వలస వచ్చింది. చిన్నారి తండ్రి పెయింటర్. తల్లి గృహిణి. ఆదివారం ఉదయం తండ్రి పనికి వెళ్లగా, తల్లి ఇంట్లో పనిచేసుకుంటోంది. చిన్నారి ఇంటి బయట ఆడుకుంటుండగా, ఒక యువకుడు చాక్లెట్ ఆశ చూపి ఆమెను సమీపంలోని ఓ పాడుబడిన షెడ్డుకు తీసుకెళ్లాడు. అక్కడ అత్యాచారానికి పాల్పడి కిరాతకంగా హత్య చేశాడు. తల్లిదండ్రులు తమ ఇంటి సమీపంలోని సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించి ఓ యువకుడు బాలికను ఎత్తుకెళ్లినట్టు గుర్తించారు. షెడ్డులో చిన్నారి శవమై కనిపించడంతో ప్రజా, కన్నడ, యువసంఘాలు పెద్ద ఎత్తున నిరసనకు దిగాయి. మరోవైపు, నిందితుడిని బిహార్‌కు చెందిన రితేశ్‌కుమార్‌గా గుర్తించిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకునేందుకు యత్నించారు. అతడు తప్పించుకునే ప్రయత్నంలో ఎదురు దాడికి దిగగా పోలీసులు కాల్పులు జరిపారు. రితేశ్‌కుమార్ ఛాతీలోకి బుల్లెట్ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనలో ఎస్ఐ, ఇద్దరు సిబ్బంది గాయపడ్డారు.

## డీకేపై రూ.2 వేల కోట్ల అవినీతి ఆరోపణలు

» గవర్నర్‌కు బీజేపీ ఎమ్మెల్యే మునిరత్న ఫిర్యాదు

బెంగళూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరాభివృద్ధి శాఖలో రూ.2 వేల కోట్లకుపైగా అవినీతి జరిగిందని రాజరాజేశ్వరీనగర్ బీజేపీ ఎమ్మెల్యే మునిరత్న ఆరోపించారు. బెంగళూరు నగరాభివృద్ధిశాఖ మంత్రిగా ఉన్న ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌పై ఫిబ్రవరిలో లోకాయుక్త, సీబీఐ, ఈడీకి ఆయన ఫిర్యాదు చేశారు. తాజాగా గవర్నర్‌ను కలిసి సమగ్ర వివరాలు అందించారు. రాజకాలువల పనులకు సంబంధించి అవినీతి జరిగినట్టు గవర్నర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బెంగళూరు అభివృద్ధిశాఖ మంత్రి పదవి నుంచి డీకే శివకుమార్‌ను తప్పించాలంటూ మునిరత్న ముందుగా సిద్దరామయ్యకు లేఖ రాసిన విషయం తెలిసిందే.

## 17న బిహార్‌లో మహా కూటమి పార్టీల భేటీ

» అసెంబ్లీ ఎన్నికల వ్యూహంపై చర్చ.. సీఎం అభ్యర్థిగా తేజస్వి?

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 : బిహార్‌లో కాంగ్రెస్, ఆర్జేడీలతో కూడిన ఆరు పార్టీల మహా కూటమి ఈ నెల 17న సమావేశం కానుంది. ఈ ఏడాది అక్టోబరులో జరగనున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ కోరింది. కూటమి పార్టీల మధ్య ఈ విషయమై ఇప్పటి వరకు ఎటువంటి సమావేశం జరగలేదని కాంగ్రెస్ నాయకుడొకరు చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలకు వ్యూహాన్ని రచించేందుకు ఈ సమావేశం ఎంతో ముఖ్యమైనదని ఆయన అన్నారు. సీట్ల పంపకంపైనా ప్రాథమిక చర్చలు జరపనున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాగా ఈ కూటమి ఇప్పటి వరకు సీఎం అభ్యర్థి ఎవరనేది ప్రకటించలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాతే సీఎం అభ్యర్థి ఎవరనేది ప్రకటించనున్నట్లు కాంగ్రెస్ నాయకుడు సచిన్ పైలెట్ ఇటీవల చెప్పారు. అయితే ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్‌నే సీఎం అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ ప్రకటించనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

# గడువు వద్దు!



**బిల్లుల ఆమోదం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు సమయం నిర్దేశించడాన్ని పునః పరిశీలించాలి**

» రివ్యూ పిటిషన్ వేయనున్న కేంద్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి రాష్ట్రపతి, గవర్నర్లకు సుప్రీంకోర్టు గడువు నిర్దేశించడంపై రివ్యూ పిటిషన్ వేసేందుకు కేంద్ర హోంశాఖ సిద్ధమైంది. తీర్పును పునఃపరిశీలించాలని జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ మహదేవన్ ధర్మాసనాన్ని కోరనుంది. కేంద్రం లేవనెత్తిన పలు అంశాలు సుప్రీంకోర్టులో వాదనల సందర్భంగా సరిగా ప్రస్తావనకు రాలేదని, వాటిని పరిగణనలోకి తీసుకుని సుప్రీం తీర్పును పునః పరిశీలించాల్సి ఉంటుందని సీనియర్ అధికారులు తెలిపారు. ఈ మేరకు పిటిషన్‌ను సిద్ధం చేసే ప్రక్రియ మొదలైందని వెల్లడించారు. రాష్ట్రాల చట్టాలకు రాష్ట్రపతి ఆమోదం, ఇతర నిర్ణయాలకు సంబంధించి కేంద్ర హోంశాఖ నోడల్ ఏజెన్సీగా పనిచేస్తుంది. సుప్రీంకోర్టు తీర్పు ఈ అంశానికే సంబంధించినది కావడంతో రివ్యూ పిటిషన్ వేసేందుకు కేంద్ర హోంశాఖ సిద్ధమైంది.

### రద్దయిన బిల్లులకూ ప్రాణం పోసేలా..!

అసెంబ్లీ ఆమోదించి పంపిన బిల్లులను గవర్నర్ ఆర్ఎన్ రవి ఆమోదించకుండా తొక్కిపెడుతున్నారంటూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా... గరిష్ఠంగా 3నెలల్లో నిర్ణయం తెలపాలంటూ తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. అందులో గవర్నర్లు పరిశీలన కోసం పంపిన రాష్ట్రాల బిల్లులపై రాష్ట్రపతి కూడా మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలంటూ సుప్రీంకోర్టు పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. అయితే సుప్రీంలో వాదనల సందర్భంగా కేంద్రం లేవనెత్తిన పలు అంశాలు సరిగా ప్రస్తావనకు రాలేదని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రద్దయిన (ల్యాప్స్ అయిన) బిల్లులకు తిరిగి ప్రాణం పోసేలా ఉందని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రకారం ఏదైనా బిల్లును గవర్నర్ తిప్పిపంపినా, రాష్ట్రపతి నిర్ణయం తీసుకోకుండా ఆపేసినా.. ఆ బిల్లు రద్దయినట్టేనని తెలిపారు. సదరు బిల్లును యథాతథంగా గానీ, మార్పులు చేసిగానీ తిరిగి శాసనసభలో ఆమోదించాల్సిందేనని స్పష్టం చేశారు. కానీ తమిళనాడు గవర్నర్ ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా ఆపేసిన బిల్లులు ఆమోదం పొందినట్టుగానే భావించాలంటూ తీర్పు ఇచ్చిన ధర్మాసనం.. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదని వివరించారు. సాంకేతికంగా రద్దయిన బిల్లులకు తిరిగి ప్రాణం పోసేలా ఆ తీర్పు ఉందని వివరించారు. రాష్ట్రపతికి అందిన బిల్లులపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలంటూ కేంద్ర హోంశాఖ 2016లో ఇచ్చిన ఆఫీస్ మెమొరాండం ఆధారంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని, కానీ ఇలా గడువు నిర్దేశించడాన్ని పునః పరిశీలించాలని పేర్కొన్నారు.

### మరో వివాదంలో తమిళనాడు గవర్నర్

తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి మరో వివాదంలో చిక్కుకున్నారు. మదురై జిల్లా త్యాగరాజన్ ఇంజనీరింగ్ కాలేజీలో కంబ రామాయణంపై జరిగిన చర్చలో ఆయన పాల్గొని, జైశ్రీరామ్ అంటూ నినాదం చేసి, విద్యార్థుల చేత కూడా ఆ నినాదాలు చేయించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండే గవర్నర్ ఒక మతానికి చెందిన నినాదాలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

## పీఎంఎల్ఏ పరిధిలోకి ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలు!

డ్రీమ్11, గేమ్స్24X7, వింజో వంటి ఆన్‌లైన్ రియల్-మనీ గేమింగ్ కంపెనీలను మనీలాండరింగ్ నిరోధక చట్టాల (పీఎంఎల్ఏ) పరిధిలోకి తీసుకొచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కసరత్తు తుదిదశకు చేరుకుంది. ఈ కంపెనీలకు తప్పనిసరిగా కేవైసీ వంటి వాటిని వర్తింపచేయడంతో పాటు అనుమానాస్పద లావాదేవీలను ట్రాక్ చేసి, నిఘా ఉంచేలా కేంద్రం దృష్టిసారిస్తోంది. ఆన్‌లైన్ గేమింగ్ కంపెనీలను 'ఆర్థిక నివేదికలను లిఖితపూర్వకంగా నివేదించాల్సిన సంస్థలు'గా కేంద్రం పేర్కొంది.

## ఉపాధి పథకంపై స్వతంత్ర సర్వే!

» పథకాన్ని పునర్వ్యవస్థీకరించాలి
» పనిదినాలను 150కి పెంచాలి
» పార్లమెంటరీ కమిటీ సిఫారసులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తీరును అంచనా వేసేందుకు స్వతంత్ర దర్యాప్తు సంస్థతో దేశవ్యాప్తంగా సమగ్ర సర్వే చేయించాలని పార్లమెంటరీ కమిటీ సూచించింది. మారుతున్న కాలానికి అనుగుణంగా అమలులో ఎదురవుతున్న సవాళ్లను దృష్టిలో ఉంచుకొని పథకాన్ని పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది. కాంగ్రెస్ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక నేతృత్వంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌పై ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కమిటీ ఈ మేరకు ఒక నివేదికను గతవారం పార్లమెంటు బడ్జెట్ సమావేశాలలో ప్రవేశపెట్టింది. ప్రస్తుతం ఉన్న 100 పనిదినాలను 150కి పెంచాల్సిన అవసరం ఉందని కూడా కమిటీ సిఫారసు చేసింది. రోజుకు కనీసం రూ.400 ఆర్జించేలా వేతనాలను పెంచాలని కూడా సూచించింది. పథకానికి నిధుల కేటాయింపుల్లో స్తబ్దతపై కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. పథకం సక్రమంగా అమలవడానికి సామాజిక తనిఖీలు పెంచాలని కూడా నొక్కి చెప్పింది. పథకంలో ఆర్థిక అవకతవకలు, ఉపాధి కూలీల సంతృప్తి, వేతనాల చెల్లింపుల్లో జాప్యం, భాగస్వామ్యమవుతున్న తీరుపై సర్వేలో దృష్టి కేంద్రీకరించాలని కమిటీ పేర్కొంది. ఆధార్ వివరాలు సరిపోలకపోవడం లేదా చిన్నపాటి అక్షర దోషాల కారణంగా 2021-22లో సుమారు 50.31 లక్షల జాబ్‌కార్డులు తొలగించారని కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. తద్వారా అర్హులైన కూలీలకు ఉపాధి పనులు దక్కడంలేదని తెలిపింది. పథకం నుంచి కూలీలను అన్యాయంగా తొలగించకుండా వ్యవస్థను తీసుకురావాలని కూడా కమిటీ సూచించింది..

# భారత్ అమ్ముల పొదిలో 'లేజర్' అస్త్రం!

(మొదటి పేజీ తరువాయి)

అత్యంత శక్తిమంతమైనవని, ఎలాంటి లక్షిత డ్రోన్స్‌నైనా ధ్వంసం చేస్తాయని డీఆర్‌డీవో తెలిపింది. ఈ అధునాతన వ్యవస్థ భారత సైనిక దళాలకు 'గేమ్ చేంజర్'గా మారనుందని పేర్కొంది. ప్రస్తుతం ఉక్రెయిన్-రష్యా మధ్య జరుగుతున్న యుద్ధంలో డ్రోన్లను ఎక్కువగా వినియోగిస్తున్న నేపథ్యంలో డీఆర్‌డీవో కూడా ఆ దిశగా అడుగులు వేసి విజయం సాధించింది. "కర్నూలులో నిర్వహించిన వెహికల్ మౌంటెడ్ లేజర్ ఎనర్జీ డైరెక్టెడ్ వెపన్(డీఈడబ్ల్యూ) ల్యాండ్ వెర్షన్ ప్రయోగం సక్సెస్ అయింది. ఫిక్స్‌డ్ వింగ్ యూఏవీ, డ్రోన్ల సమూహాన్ని డీఈడబ్ల్యూ ఎంకే-2(ఏ) ధ్వంసం చేసింది. అదేవిధంగా నిఘా సెన్సార్ వ్యవస్థను పనిచేయకుండా చేసింది. ఈ ప్రయోగం సక్సెస్ కావడంతో ప్రపంచ వ్యాప్తంగా అత్యంత శక్తిమంతమైన లేజర్ డీఈడబ్ల్యూ వ్యవస్థలు ఉన్న అతి కొద్ది దేశాల సరసన భారత్ కూడా చేరినట్టయింది" అని డీఆర్‌డీవో తన 'ఎక్స్' ఖాతాలో వివరించింది. ప్రయోగానికి సంబంధించిన వీడియోను కూడా పంచుకుంది. "ఇప్పటి వరకు ఇలాంటి వ్యవస్థను ప్రదర్శించిన దేశాల్లో రష్యా, అమెరికా, చైనా ఉన్నాయి. ఇజ్రాయెల్ కూడా ఇదే తరహా ప్రయత్నాలు చేస్తోంది. దీనిని బట్టి మనం 4 లేదా ఐదో స్థానంలో ఉన్నాం" అని డీఆర్‌డీవో చైర్మన్ సమీర్ తెలిపారు. ఇది మనకు 'స్టార్ వార్స్' సామర్థ్యాన్ని అందిస్తుందన్నారు. ఈ ప్రయోగంలో డీఆర్‌డీవోకు చెందిన పలు ల్యాబ్‌ల సహకారం ఉందన్నారు. "తాజా ప్రయోగం స్టార్ వార్స్ సాంకేతికతలో ఒకటి మాత్రమే" అన్నారు.



లేజర్ పుంజంతో ధ్వంసమైన డ్రోన్

### మెరుపు వేగం!

దేశీయంగా రూపొందించిన ఎంకే-2(ఏ) డీఈడబ్ల్యూ లేజర్ అస్త్రం.. సుదూర లక్ష్యాలను కూడా మెరుపు వేగంతో సమర్థవంతంగా ఛేదించగలదని డీఆర్‌డీవో తెలిపింది. ఆదేవిధంగా డ్రోన్ల సమూహాలను, శత్రు నిఘా సెన్సార్లకు కూడా అడ్డుకట్ట వేయనుందని పేర్కొంది. ఇది మెరుపు వేగం, ఖచ్చితత్వంతో కేవలం సెకన్ల వ్యవధిలోనే లక్ష్యాలను చేరుకునే సామర్థ్యం ఉంది. ఈ అస్త్రం రూపకల్పనలో డీఆర్‌డీవోకు చెందిన సెంటర్ ఫర్ హైఎనర్జీ సిస్టమ్స్ అండ్ సైన్సెస్(చెస్) హైదరాబాద్ కూడా భాగస్వామి. కాగా, కర్నూలులో నేషనల్ ఓపెన్ ఎయిర్ రేంజ్ నుంచి తాజాగా చేపట్టిన లేజర్ డీఈడబ్ల్యూ ప్రయోగం రెండోది. 2019, సెప్టెంబరు 11న తొలిసారి తక్కువ బరువున్న క్షిపణిని విజయవంతంగా ప్రయోగించారు.

### ఏంటి ప్రయోజనం?

- యుద్ధ సమయాల్లో వినియోగించే అత్యాధునిక ఆయుధాలపై ఆధారపడాల్సిన అవసరం తగ్గిస్తుంది. మందుగుండు సామగ్రి వినియోగం తగ్గుతుంది.
- విప్లవాత్మక మార్పులతో కూడిన వ్యవస్థను అందుబాటులోకి తెస్తుంది.
- యుద్ధం కారణంగా తలెత్తే ఇతర నష్టాలను నివారించవచ్చు.
- తక్కువ ఖర్చుతో క్షిపణి రక్షణ వ్యవస్థను భర్తీ చేస్తుంది. క్షిపణులు, డ్రోన్ల ముప్పును ఖచ్చితత్వంతో అడ్డుకునే సామర్థ్యం.

### ఎలా పనిచేస్తుంది?

లేజర్ అస్త్రం ఎంకే-2(ఏ) డీఈడబ్ల్యూ.. రాడార్ లేదా అంతర్నిర్మితమైన ఎలక్ట్రో ఆప్టిక్ (ఈవో) వ్యవస్థ ద్వారా లక్ష్యాలను గుర్తిస్తుంది. ఆ వెంటనే కాంతి వేగంతో దూసుకుపోయి.. 30 కిలో వాట్స్ సామర్థ్యంతో కూడిన లేజర్ పుంజాలను ప్రయోగించడం ద్వారా లక్ష్యాలను ధ్వంసం చేస్తుంది. శత్రు డ్రోన్ల స్ట్రక్చర్‌ను నాశనం చేయడంతో పాటు వార్‌హెడ్‌ను విధ్వంసం చేస్తుంది. మానవ రహిత వైమానిక వ్యవస్థలు విస్తరిస్తున్న నేపథ్యంలో ఆయా దేశాలు డ్రోన్ ఆధారిత యుద్ధాలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో లేజర్ అస్త్రం ప్రాధాన్యం సంతరించుకుంది.



ముర్షిదాబాద్‌లో భద్రతా బలగాలు

## బెంగాల్‌లోకి బంగ్లా ఉగ్రవాదం

» 'వక్ఫ్' అల్లర్ల వెనక జేఎమ్‌బీ ఉగ్రసంస్థ.. 7 జిల్లాల్లోకి విస్తరణ
» కేంద్ర నిఘా వర్గాల ఆందోళన.. పారిపోతున్న హిందువులు

కోల్‌కతా, ఏప్రిల్ 13: కొత్త వక్ఫ్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ పశ్చిమబెంగాల్‌లో హింస వెనుక బంగ్లాదేశ్‌కు చెందిన ఓ ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థ ప్రమేయం ఉన్నట్టు కేంద్ర అత్యున్నత నిఘా వర్గాలు చెబుతున్నాయి. గతంలో బెంగాల్‌లో దాడులు చేసిన చరిత్ర జమాతుల్ ముజాహిద్దీన్ బంగ్లాదేశ్‌కు(జేఎమ్‌బీ) ఉంది. ప్రస్తుతం ఆ సంస్థ తిరిగి బెంగాల్‌పై పట్టు బిగిస్తున్నదని, ఏడు సరిహద్దు జిల్లాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నదని ఈ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ముఖ్యంగా ఆ జిల్లాల్లోని మదర్సాల నుంచి యువకులను భారీగా జేఎమ్‌బీ నియమించుకుంటోందని చెబుతున్నాయి. ముర్షిదాబాద్, 24 పరగణాల జిల్లాల్లో మొదలైన అల్లర్ల వెనుక ఉన్నది ఈ సంస్థయేనని అంటున్నాయి. దీనివల్ల బెంగాల్ తీవ్రమైన శాంతిభద్రతల సమస్యను ఎదుర్కొంటోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇస్లామిక్ ఎజెండా కింద తాజాగా వక్ఫ్ ఆందోళనలను రగుల్చుతున్నదనే భయాందోళనలను నిఘా సంస్థలు వ్యక్తం చేస్తున్నాయి. కాగా, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అల్లర్లు జరుగుతున్న ప్రాంతాల్లో ఆదివారం బీఎస్ఎఫ్‌కు చెందిన 8కంపెనీల జవాన్లు, వెయ్యిమంది పోలీసులను మోహరించారు. ఇప్పటివరకు 150 మందిని అరెస్టు చేశారు. డీజీ స్థాయి నుంచి అదనపు ఎస్పీ స్థాయి వరకు.. కీలక పోలీసు అధికారులు పరిస్థితులను స్వయంగా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఇదిలాఉండగా, అల్లర్ల తర్వాత దాదాపు 400 మంది హిందువులు ముర్షిదాబాద్, ధూలియన్ తదితర ప్రాంతాలను వదిలిపెట్టి భగీరథి నదిని దాటి పొరుగు జిల్లా మాల్దాకు పారిపోయినట్టు బెంగాల్ బీజేపీ చీఫ్ సువేందు అధికారి తెలిపారు. సీఎం మమతా బెనర్జీ బుజ్జగింపు రాజకీయాల కోసం కావాలనే బెంగాల్‌లో ఇస్లామిక్ ఉగ్రవాదం విస్తరించడానికి అవకాశం కల్పిస్తున్నారని ఆయన ఆరోపించారు. అల్లర్లు జరుగుతున్న ప్రాంతాలను సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం కింద కల్లోలిత ఏరియాలుగా ప్రకటించాలంటూ కేంద్రానికి బీజేపీ ఎంపీ జ్యోతిర్మయి సింగ్ లేఖ రాశారు.

# దక్షిణ కొరియా పిలుస్తోంది!



» టెక్ నిపుణులకు 'టాప్ టైర్ వీసా'తో కొరియా స్వాగతం
» ఉన్నత చదువు, అనుభవం ఉంటే గొప్ప అవకాశాలు
» మూడేళ్ల తర్వాత శాశ్వత నివాసానికీ అవకాశం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: ఇటీవలి కాలంలో పర్యాటకులను అమితంగా ఆకర్షిస్తున్న దేశాల్లో దక్షిణ కొరియా కూడా ఒకటి. ఆ దేశ సాంస్కృతిక వారసత్వం, ప్రకృతి అందాలు, రుచికరమైన వంటకాలు, ఉర్రూతలూగించే కొరియన్ మ్యూజిక్.. ఇలాటింవెన్నో పర్యాటకులను అమితంగా ఆకర్షిస్తున్నాయి. దీంతో చాలామంది భారతీయులు సెలవుల్లో ఎంజాయ్ చేయడానికి దక్షిణ కొరియాలో వాలిపోతున్నారు. పర్యాటకంగా ప్రపంచ దేశాలను ఆకర్షిస్తున్న దక్షిణ కొరియా తాజాగా తమ దేశంలో స్థిరపడాలనుకునే వారికి కూడా మంచి అవకాశాలు కల్పిస్తోంది. 'మీ వద్ద అద్భుతమైన నైపుణ్యం ఉంటే.. మా దేశానికి రండి.. ఇక్కడే పనిచేసుకుంటూ కోట్లు సంపాదించుకోండి.. కావాలనుకుంటే ఇక్కడే స్థిరపడండి..' అంటూ సాదర స్వాగతం పలుకుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ 2వ తేదీన 'టాప్ టైర్' వీసా వ్యవస్థను ప్రారంభించిన కొరియా.. భారతీయులతో సహా వివిధ దేశాలకు చెందిన నిపుణులకు తమ దేశంలోని హైటెక్ కంపెనీల్లో పనిచేసుకునేందుకు, ఇక్కడే ఎక్కువకాలం నివాసం ఉండేందుకు మార్గం సుగమం చేసింది. నూతన ఆవిష్కరణలకు తోడ్పడే సీనియర్ ఇంజనీర్లకు, వారి కుటుంబాలకు దీర్ఘకాలిక రెసిడెన్స్ పర్మిట్‌కు అవకాశం కల్పించే ఎఫ్-2 వీసాను అందిస్తోంది. "ప్రపంచ టాప్-100 విశ్వవిద్యాలయాల్లో ఏదో ఒకదానిలో మాస్టర్స్ లేదా పీహెచ్‌డీ చేసినవారు. టాప్ గ్లోబల్ కంపెనీల్లో కనీసం ఎనిమిదేళ్లు పనిచేసిన అనుభవం ఉన్నవారు" ఈ ఎఫ్-2 వీసాలకు అర్హులు. దరఖాస్తుదారులు కనీసం రూ.88.6 లక్షల వార్షిక వేతనాన్ని అందుకుంటూ ఉండాలి. రూ.1.2 కోట్ల వార్షిక వేతనం అందుకునేవారికి విద్య, పని అనుభవం వంటి అర్హతల్లో సడలింపు ఉంటుంది. ఈ ఏడాది మార్చిలో రూపొందించిన ప్రణాళికలో గ్లోబల్ టెక్ సంస్థల నుంచి కనీసం 1000 మంది సీనియర్ ఇంజనీర్లను తీసుకోవాలని నిర్ణయించినట్టు దక్షిణ కొరియా అధికారులు తెలిపారు.

## కులగణన నివేదిక అమలుపై కంగారు లేదు

» హడావుడి నిర్ణయాలు ఉండవు: డీకే శివకుమార్

బెంగళూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో కులగణన నివేదికను శుక్రవారం కేబినెట్ స్వీకరించిదని, అమలు విషయంలో కంగారు లేదని ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. బెంగళూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నివేదికపై రాజకీయ విమర్శలు ఉన్నాయని, అమలు విషయంలో హడావుడి నిర్ణయాలు ఉండబోవన్నారు. వాస్తవ పరిస్థితుల ఆధారంగా అన్ని కులాలకు న్యాయం చేయదలిచామన్నారు. మంత్రులకు నివేదిక ప్రతులు చేరాయని, సమగ్రంగా అధ్యయనం చేసి ఈ నెల 17న చర్చించేందుకు ప్రత్యేక కేబినెట్ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఇదే విషయమై సీఎం సిద్దరామయ్య శనివారం బెళగావిలో మీడియాతో మాట్లాడుతూ.. నివేదిక స్వీకరించామని, 17న జరిగే కేబినెట్ తర్వాత స్పష్టమైన నిర్ణయాన్ని ప్రకటిస్తామన్నారు. ప్రస్తుతం బీసీలకు 32శాతం రిజర్వేషన్ ఉందని, నివేదిక సిఫారసు ప్రకారం 52 శాతానికి పెరగనుందని తెలుస్తోంది. ప్రస్తుతం ఎస్సీలకు 17శాతం, ఎస్టీలకు 7శాతంతో కలిపి రిజర్వేషన్లు 75శాతానికి చేర్చాలని సిఫారసులు ఉన్నాయి. కాగా.. కులగణన నివేదికను రాష్ట్రంలో బలమైన సామాజికవర్గమైన వీరశైవలింగాయతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. నివేదిక ప్రకారం రాష్ట్రంలో ముస్లింలు 75.25 లక్షల మంది ఉన్నారు. దీంతో ప్రస్తుతం 4 శాతంగా ఉన్న ముస్లిం రిజర్వేషన్ 8 శాతానికి పెరిగే అవకాశం ఉంది.



కులం పునాదుల మీద మీరు దేన్నీ సాధించలేరు..
ఒక జాతిని గానీ, ఒక నీతిని గానీ నిర్మించలేరు
- అంబేద్కర్







ధర్నాలో పాల్గొన్న మున్నూరు కాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన రాష్ట్ర కన్వీనర్ ఉగ్గే శ్రీనివాస్ పటేల్, మున్నూరు కాపులు

## మున్నూరు కాపుల మహాధర్నా

- ప్రభుత్వం హామీలను నెరవేర్చాలని డిమాండ్
- ఆత్మీయ సమావేశంలోనూ నిరసన

కవాడిగూడ, ఖైరతాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మున్నూరు కాపులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మున్నూరు కాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో మున్నూరు కాపులు మహాధర్నా నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో మున్నూరు కాపు రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా రైతులు తీసుకువచ్చిన వరిధాన్యం, మొక్కజొన్న కర్రలు ఇతర వ్యవసాయ పనిముట్లకు మున్నూరు కాపు ఆత్మగౌరవ మహాధర్నా సేన రాష్ట్ర కన్వీనర్ ఉగ్గే శ్రీనివాస్ పటేల్ పూజలు చేసి ధర్నాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్నూరు కాపులకు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 5 వేల కోట్ల నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంత్రివర్గ విస్తరణలో అవకాశం కల్పించాలని కోరారు. ఈ మహాధర్నాకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాజరై మద్దతు ప్రకటించారు. రాష్ట్రంలో జరిగిన కుల సర్వేలో మున్నూరు కాపులను తక్కువ చేసి చూపించడంపై ఆ కులసంఘం భగ్గుమంది. ఆదివారం పీవీ నర్సింహారావు మార్గంలోని జలవిహార్‌లో తెలంగాణ మున్నూరు కాపు సంఘం, మున్నూరు కాపు గర్జన కార్యాచరణ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో మున్నూరు కాపుల దశ, దిశ ఆత్మీయ సమ్మేళనం పేరిట జరిగిన సమావేశంలో వక్తలు ప్రభుత్వం తీరును విమర్శించారు. రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్, వద్దిరాజు రామచంద్ర, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సమావేశంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్ఎస్ నాయకులు పొన్నాల లక్ష్మయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, జోగు రామన్న, బాజిరెడ్డి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## 15 రోజుల తేడాతో నవ దంపతుల ఆత్మహత్య!

- ఆర్నెల్ల క్రితం పెళ్లి.. మంచిర్యాల జిల్లాలో ఘటన



విష్ణువర్ధన్, సృజన (ఫైల్)

కోటపల్లి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కులాలు వేరుకావడంతో పెద్దలను కాదని వివాహం చేసుకున్న ఆ యువ జంట పెళ్లి ప్రయాణం ఆర్నెల్లలోనే విషాదాంతమైంది. వరుడు ఆత్మహత్య చేసుకోగా, 15 రోజుల్లోనే వధువూ బలవన్మరణానికి పాల్పడింది. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం దేవులవాడ గ్రామంలో ఈ విషాదం జరిగింది. గాదె సృజన (20) లక్షెట్టిపేటలోని ఓ కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతోంది. అదే కళాశాలలో సీనియర్ అయిన విష్ణువర్ధన్‌తో సృజనకు స్నేహం ఏర్పడి, ప్రేమకు దారి తీసింది. కులాలు వేరు కావడంతో పెళ్లికి ఇరుకుటుంబాల వారు అభ్యంతరం చెప్పారనే ఉద్దేశంతో స్నేహితుల సహకారంతో ఆర్నెల్లక్రితం పెళ్లి చేసుకున్నారు. లక్షెట్టిపేటలోనే వేరు కాపురం పెట్టారు. అన్యోన్యంగా జీవనం సాగిస్తున్న దశలో ఏం జరిగిందో ఏమో కానీ విష్ణువర్ధన్ మార్చి 24న గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సృజన కుటుంబీకులు అక్కడకు వెళ్లి అంతిమ సంస్కారాలయ్యాక సృజనను దేవులవాడలోని ఇంటికి తీసుకెళ్లారు. ప్రేమ పెళ్లి చేసుకోవడం, అంతలోనే భర్త ఆత్మహత్యకు పాల్పడటంతో సృజన మానసికంగా కుంగిపోయింది. శనివారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది.

## గుంతలో పడిన బంతిని తీసే ప్రయత్నంలో.. లిఫ్టు ఇనుప దిమ్మలు పడి ఆర్‌ఎంపీ మృతి

గాజులరామారం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆదివారం సెలవు దినం కావడంతో కాసేపు సరదాగా పిల్లలతో కలిసి ఆడుకుందామని అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌కు వచ్చిన ఓ తండ్రి లిఫ్టు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. లిఫ్ట్ గుంతలో పడిన బంతిని తీయడానికి ప్రయత్నిస్తుండగా ఇనుప దిమ్మలు (కౌంటర్‌వెయిట్) మీద పడి మరణించాడు. ఈ విషాద ఘటన ఆదివారం సూరారంలో జరిగింది. కర్నాటకలోని బీజాపూర్‌కు చెందిన అక్బర్ పటేల్ (39), బిస్మిల్లా బేగం దంపతులు బతుకుతెరువు కోసం నగరానికి వలస వచ్చారు. వారికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు. అక్బర్ పటేల్ సోనియా గాంధీ నగర్‌లో ఆర్‌ఎంపీగా పనిచేస్తున్నారు. ఇటీవల కార్తికేయ వెంచర్‌లోని శ్రీసాయి మణికంఠ అపార్ట్‌మెంట్‌లో మొదటి అంతస్తులో ఓ ఫ్లాట్ కొనుక్కుని అందులోకి మారారు. ఆదివారం సాయంత్రం అపార్ట్‌మెంట్ పార్కింగ్ స్థలంలో పిల్లలు క్రికెట్ ఆడుకుంటుండగా అక్బర్ పటేల్ కూడా ఆడుకుందామని వెళ్లారు. ఇంతలో బంతి లిఫ్ట్ గుంతలో పడింది. బంతిని తీద్దామని అక్బర్ పటేల్ లిఫ్ట్ గుంతకు వెనుక వైపు నుంచి ఉన్న ఖాళీలో నుంచి లోపలికి ఒంగి చూశారు. అదే సమయంలో పై అంతస్తు నుంచి ఎవరో లిఫ్టు బటన్ ఒత్తారు. లిఫ్ట్ పైకి వెళ్లడంతో ఇనుప దిమ్మలు కిందకువచ్చి వచ్చి అతని తలపై పడడంతో మృతిచెందారు. లిఫ్ట్‌గుంత వెనక ఖాళీ వదలడం, ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు, స్థానికులు పేర్కొన్నారు. బిల్డర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## షాద్‌నగర్‌లో గుర్తు తెలియని వ్యక్తి హత్య



షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ బైపాస్ రోడ్డు సమీపంలో ఓ గుర్తు తెలియని యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అతని గొంతు కోసి, కడుపులో పొడిచి హత్య చేశారు. హత్యకు గురైన యువకుడి వయసు 25-30 సంవత్సరాల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. అతడి కుడి చేతిపై జై బాలయ్య అనే టాటూ ఉందని, మెడలో ఉన్న లాకెట్‌లో ఓ వైపు వేంకటేశ్వర స్వామి, మరోవైపు అమ్మవారి బొమ్మ ఉందని చెప్పారు. మృతుడి వివరాలు తెలిసిన వారు షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ నంబర్ 9440795741కు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు. మృత దేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

## వేములవాడలో యువకుడి దారుణ హత్య

వేములవాడ టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఓ యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన సంచలనంగా మారింది. వేములవాడ రూరల్ మం డలం పోచెట్టిపల్లికి చెందిన చెట్టిపల్లి పర్శరాము లు (37) కోనాయపల్లి శివారులో కుటుంబంతో కలిసి ఉంటూ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో వేములవాడలోని ఓ ఫంక్షన్ హాల్ లో పర్శరాములును ఆదివారం దారుణంగా హత్య చేశారు. పర్శరాములతో సంబంధం ఉన్న ముగ్గురు వ్యక్తులు రక్తపు మరకలున్న రెండు గొడ్డళ్లు, ఒక కత్తితో మా జోలికి వస్తే ఇట్లుంటది అంటూ హెచ్చరించినట్లున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాగా పర్శరాములకు గంజాయి విక్రేతలతో పరిచయాలున్నాయని, అతను కూడా గంజాయి గుట్టుగా విక్రయిస్తాడన్న చర్చ జరుగుతోంది. ఈ క్రమంలోనే వారి మధ్య గొడవలు జరుగుతున్నాయని, ఇవే హత్యకు దారితీసినట్లు తెలుస్తోంది.

## బాలుడిని మింగిన నీళ్ల బకెట్ !

నందిగామ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నీళ్లతో నిండుగా కనిపిస్తున్న బకెట్ వద్దకు వెళ్లిన చిన్నారి నీళ్లతో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు అందులో పడి చనిపోయాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా నందిగామ మండలపరిధిలోని చేగూర్‌లో శనివారం రాత్రి జరిగింది. వెంకటాచారి కుమారుడు అద్వైత్ (15నెలలు) ఇంటిముందు ఆడుకుంటూ నీటి బకెట్‌లో పడిపోయాడు. కొద్దిసేపటికి బకెట్‌లో పడి ఉన్న బాలుడిని గమనించిన వెంకటాచారి ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

# వనజీవికి కన్నీటి వీడ్కోలు

- స్వగ్రామంలో రామయ్య అంత్యక్రియలు పూర్తి
- అంతిమయాత్రకు తరలివచ్చిన అభిమానులు
- నివాళులర్పించిన మంత్రి పొంగులేటి
- పాడె మోసిన రూరల్ తహసీల్దార్, కమిషనర్





రామయ్యకు నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి.. రామయ్య పాడె మోస్తున్న అధికారులు

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ ప్రేమికుడు, పద్మశ్రీ గ్రహీత వనజీవి రామయ్యకు కుటుంబసభ్యులు, అభిమానుల సమక్షంలో ఆదివారం తుది వీడ్కోలు పలికారు. శనివారం తెల్లవారుజామున గుండెపోటుతో వనజీవి రామయ్య మృతిచెందిన విషయం తెలిసిందే. ఆయన అంత్యక్రియలను ఆదివారం రామయ్య స్వగ్రామం రెడ్డిపల్లిలో నిర్వహించారు. ఖమ్మం రూరల్ తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్, ఏదులాపురం మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి అంతిమయాత్రలో పాల్గొని రామయ్య పాడె మోశారు. ఖమ్మం జిల్లా ఫారెస్టుశాఖ డీఎఫ్‌వో సిద్దార్థ విక్రమ్‌సింగ్, ఎఫ్‌డీవో మంజుల, ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాస్‌రెడ్డి అధికారులు, సిబ్బంది సుమారు 50మంది రామయ్య అంతిమయాత్రలో పాల్గొన్నారు. అంతకు ముందు రామయ్య భౌతికకాయాన్ని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ రఘురాంరెడ్డి, ఖమ్మం సీపీ సునీల్‌దత్ సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొం గులేటి మాట్లాడుతూ వనజీవి రామయ్య మృతి చాలా బాధాకరమన్నారు. మొక్కలు పెంచడం వల్ల ప్రకృతికి, సమాజానికి కలిగే ప్రయోజనాలను రామ య్య ప్రజలకు వివరిస్తూ అనేక ప్రాంతాల్లో మొక్క లు నాటారని కొనియాడారు. కాగా, వనజీవి రామయ్య ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని, ఇందులో భాగంగా నేటి నుంచి ప్రతిరోజూ తాను కూడా ఒక మొక్క నాటి సం రక్షిస్తానని ఏపీలోని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు అన్నారు. ఆదివారం ఆయన మొక్క నాటి రామయ్యకు నివాళులర్పించారు.

# బతుకులు బుగ్గిపాలు

**బాణసంచా కేంద్రంలో భారీ పేలుడు .. 8 మంది మృతి.. మరో 8 మందికి తీవ్రగాయాలు**

- ఏపీలోని అనకాపల్లి జిల్లా కైలాసపట్నంలో దుర్ఘటన
- మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల ప్రభుత్వ పరిహారం
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం
- సీఎం చంద్రబాబు ఆదేశం



పేలుడు ధాటికి ఆనవాళ్లు లేకుండా పోయిన బాణసంచా తయారీ కేంద్రం

కోటవురట్ల/నర్సీపట్నం/అనకాపల్లి/అమరావతి, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాలోని ఓ బాణసంచా తయారీ కేంద్రంలో భారీ విస్ఫోటనం సంభవించింది. ఈ ఘటనలో 8 మంది కార్మికులు మృతిచెందగా, మరో 8మంది తీవ్రంగా గాయపడ్డారు. కోటవురట్ల మండలం కైలాసపట్నం గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం ఈ దుర్ఘటన జరిగింది. కైలాసపట్నానికి చెందిన మదపాల జానకీరామ్ గ్రామ శివారులో శ్రీవిజయలక్ష్మీ ఫైర్‌వర్క్స్ పేరుతో సుమారు 15 ఏళ్ల నుంచి బాణసంచా తయారీకేంద్రాన్ని నడుపుతున్నారు. ఆదివారం ఈ కేంద్రంలో యజమానితో పాటు మొత్తం 16మంది పనులు చేస్తున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో కొంతమంది కార్మికులు షాట్ బాక్స్‌లో మందుగుండు కూరుతుండగా ఒత్తిడి అధికమై నిప్పురవ్వలు రేగాయి. రెప్పపాటులో అక్కడ ఉన్న ముడిపదార్థాలు, తయారైన బాణసంచాకు మంటలు అంటుకుని భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. పెద్దఎత్తున మంటలు లేచాయి. పేలుడు ధాటికి భూమి కంపించింది. నర్సీపట్నం అగ్నిమాపక సిబ్బంది రెండు శకటాలతో వచ్చి మంటలను అదుపుచేశారు. అప్పటికే పలువురు మృతిచెందారు. క్షతగాత్రుల రోదనలు మిన్నంటాయి. ఈ ప్రమాదంలో అప్పికొండ తాతబ్బాయి(50), పురం పాప(40) గుంపిన వేణు(40), సేనాపతి బాబురావు(56), దాడి రామలక్ష్మి(38) సంగరాతి గోవింద(45), మెడిసి హేమంత్ (25), దేవర నిర్మల(38) మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన బాణసంచా కేంద్రం యజమాని మదపాల జానకీరామ్, సియాద్రి గోవింద, సంగరాతి శ్రీను, గుంపిన సూరిబాబు, జల్లూరు నాగరాజు, వేళంగి సంతోషి, వేళంగి షరోణి, వేళంగి రాజును తొలుత కోటవురట్ల సీహెచ్‌సీకి తరలించారు. కలెక్టర్ విజయకృష్ణన్ ఆస్పత్రికి వచ్చి క్షతగాత్రులను పరామర్శించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వేళంగి రాజు, గుంపిన సూరిబాబు, సంగరాతి శ్రీనును నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి, మిగిలిన ఐదుగురిని విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించారు. వీరిలో జల్లూరు నాగరాజుకు 90శాతం మేర శరీరం కాలిపోవడంతో పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. జానకీరామ్ శరీరం కూడా 50శాతం మేర కాలిపోయిందని చెబుతున్నారు. బాణసంచా తయారీకేంద్రంలో జరిగిన ప్రమాదంపై పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తామని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారిని ఎంపీ సీఎం రమేశ్‌తో కలిసి పరామర్శించారు. క్షతగాత్రుల పరిస్థితిపై వైద్యులను ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు రూ.15లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారని తెలిపారు. విచారణ అనంతరం పేలుడుకు గల కారణాలు తెలుస్తాయని చెప్పారు. ఈ ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన ప్రమాదంలో 8మంది కార్మికులు ప్రాణాలు కోల్పోవడంపై సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు. హోంమంత్రి అనిత, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హాలకు ఫోన్‌చేసి మాట్లాడారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాణసంచా తయారీ కేంద్రంలో ఎనిమిది మంది దుర్మరణం చెందారని తెలిసి దిగ్ర్భాంతి గురైనట్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ప్రమాదంపై ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ ఆరాతీశారు. ఎనిమిది మంది కార్మికులు మృతి చెందడంపై దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు.

## ప్రభుత్వ సలహాదారు కేకే మనవడిపై కేసు నమోదు

- మద్యం మత్తులో కారు నడిపి.. ఆటోను ఢీకొట్టినందుకు చర్య

బంజారాహిల్స్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో తూగుతూ కారు నడిపి ఆపై ఆటోను ఢీకొట్టిన ఘటనలో ప్రభుత్వ సలహాదారు కేకే మనవడిపై పోలీసు కేసు నమోదైంది. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో నివాసం ఉంటున్న కేకే కుమారుడు విప్లవ్ కుమార్ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ పట్టణ మౌలిక సదుపాయాల ఆర్థిక సంస్థ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేశారు. ఆయన కుమారుడు వశిష్ట ధ్రువ్ (21) ఆదివారం తన స్నేహితుడితో కలిసి కారులో కేబీఆర్ పార్కు మీదుగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వైపు బయలుదేరాడు. జూబ్లీహిల్స్ చెక్ పోస్టు వద్ద సిగ్నల్ పడడంతో ముందు వెళ్తున్న ట్రాలీ ఆటో ఆగింది. వెనక వస్తున్న విప్లవ్ కారు ఒక్కసారిగా ట్రాలీ వెనక భాగంలో ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందుభాగం, ఆటో ట్రాలీ వెనక భాగం ధ్వంసమయ్యాయి. పోలీసులు వశిష్ట ధ్రువ్‌కు బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించగా 150 బీఏసీ పాయింట్లు వచ్చింది. దాంతో పోలీసులు ప్రమాదానికి కారణమైన కారును సీజ్ చేశారు. కారు నడిపిస్తున్న వశిష్ట ధ్రువ్ మీద సుమోటో కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సలేశ్వరం జాతరలో తొక్కిసలాట

- పలువురు భక్తులకు స్వల్ప గాయాలు

అచ్చంపేట, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల అభయారణ్యంలోని సలేశ్వరం లింగమయ్య జాతరలో ఆదివారం తొక్కిసలాట జరిగింది. చివరిరోజుతో పాటు వారాంతం కావడంతో వేలాది మంది భక్తులు లింగమయ్య దర్శనానికి తరలివచ్చారు. దీంతో లోయలో, చెప్పుల కురవ ప్రాంతానికి దిగువన, ఇరుకు దారి చివరల్లో భక్తులు ఒకరినొకరు నెట్టుకోవడంతో స్వల్పంగా తోపులాట జరిగింది. కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. పదేళ్ల చిన్నారి ఊపిరాడక అస్వస్థతకు గురైంది. అదే సమయంలో పై నుంచి రాయి పడటంతో ఓ భక్తుడి తలకు గాయమైంది. అటవీ, పోలీసు శాఖల మధ్య సమన్వయ లోపం వల్లే భక్తుల రాకపోకలపై పర్యవేక్షణ కరువై, ఈ పరిస్థితి నెలకొందని పలువురు ఆరోపించారు.

## హెచ్‌ఐవీ కేసులు దక్షిణాదిలోనే ఎక్కువ

**56 శాతం (10.22 లక్షలు) రోగులు ఐదు రాష్ట్రాల్లోనే**


- తెలంగాణలో 1.31 లక్షల మంది రోగులు
- ఐదో స్థానంలో రాష్ట్రం.. రెండోస్థానంలో ఏపీ
- తెలుగు రాష్ట్రాల్లోని రోగుల్లో మహిళలే ఎక్కువ
- దేశంలో మొత్తం కేసులు 18.36 లక్షలు

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 18,36,983 మంది హెచ్‌ఐవీతో బాధపడుతున్నారు. హెచ్‌ఐవీ బాధితుల్లో ఎక్కువమంది-- 10,22,809(56%) మంది దక్షిణాది రాష్ట్రాల్లోనే ఉన్నారు. హెచ్‌ఐవీ బాధితుల్లో తెలుగు రాష్ట్రాల్లో 3.53 లక్షల మంది ఉన్నారు. కేసుల పరంగా తెలంగాణ ఐదో స్థానంలో.. ఏపీ రెండో స్థానంలో ఉన్నాయి. ఈ మేరకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోని హెచ్‌ఐవీ బాధితులు, చికిత్స పొందుతున్న రోగుల గణాంకాలను కేంద్ర గణాంకాలు, ప్రణాళిక మంత్రిత్వ శాఖ విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల్లో హెచ్‌ఐవీ బాధితుల్లో మహిళలే ఎక్కువగా ఉన్నారు. తెలంగాణలో 1.31 లక్షల మంది బాధితుల్లో.. 60,640 మంది పురుషులు, 69,940 మంది మహిళలు, 780 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ఏపీలో 2.22 లక్షల మంది బాధితులుండగా.. వీరిలో పురుషుల వాటా 98,432 కాగా.. 1,23,103 మంది మహిళలు, 810 మంది ట్రాన్స్‌జెండర్స్ ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా హెచ్‌ఐవీ బాధితులంతా చికిత్స పొందుతున్నట్లు కేంద్రం వెల్లడించింది. హెచ్‌ఐవీ కేసుల్లో మహారాష్ట్రలో టాప్‌లో ఉంది. అక్కడ 3,18,492 మంది బాధితులుండగా.. 2.01 లక్షల కేసులతో కర్ణాటక మూడో స్థానంలో ఉంది. తమిళనాడులో 1.37 లక్షల మంది, యూపీలో 1.23 లక్షల మంది హెచ్‌ఐవీ బాధితులున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న హెచ్‌ఐవీ బాధితుల్లో.. పురుషులు 9.06 లక్షల మంది, మహిళలు 8.4 లక్షల మంది ఉన్నారు. టీనేజర్లలో 46,925 మంది బాలురు, 36,452 మంది బాలికలు హెచ్‌ఐవీకి చికిత్స తీసుకుంటున్నారు. టీనేజర్లలో.. తెలంగాణలో 4,278 బాలబాలికలు, ఏపీలో 7,890 మంది బాలబాలికలు ఉన్నారు.

# యువ వికాసానికి సర్వర్ బిజీ

**దరఖాస్తుల సమర్పణలో ఇబ్బందులు .. మూడు రోజులుగా సర్వర్ బిజీబిజీ**

- పథకం దరఖాస్తుకు నేటితో ముగియనున్న గడువు
- ఇప్పటికే 16 లక్షల దరఖాస్తులు
- మరో వారం గడువుకు డిమాండ్




హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు సర్వర్ బిజీ సమస్యతో ఇబ్బందిపడుతున్నారు. మూడు రోజులుగా సర్వర్ బిజీ అవడంతో ఆన్‌లైన్, మీసేవా కేంద్రాల వద్ద ఎక్కువ మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. అర్ధరాత్రి వేళల్లోనూ సర్వర్ వేగం పుంజుకోవట్లేదు. యువ వికాసం దరఖాస్తుకు గడువు సోమవారంతో ముగియనుంది. ఈ నేపథ్యంలో దరఖాస్తు చేసుకునే వాళ్ల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఒక్కసారిగా దరఖాస్తులు పోటెత్తడంతో నెట్‌వర్క్ సమస్యకు దారితీసింది. మార్చి 17 నుంచి యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభంకాగా ఆదివారం రాత్రి వరకు ఆన్‌లైన్‌లో 14 లక్షల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. ఆఫ్‌లైన్‌లో వచ్చిన మరో 2 లక్షలకుపైగా దరఖాస్తులను నెట్‌వర్క్ ఇబ్బందుల వల్ల ఆన్‌లైన్ చేయలేకపోయారు. వరుస సెలవులు, నెట్‌వర్క్ ఇబ్బందుల దృష్ట్యా మరో వారం రోజులు గడువు పెంచాలని డిమాండ్ చేస్తూ వివిధ ప్రజా, యువజన సంఘాల నాయకులు సీఎంకు లేఖలు రాశారు.

శుక్ర, శని, ఆదివారాల్లో సర్వర్ బిజీగా ఉండటంతో చాలా మంది ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోలేకపోయారు. ఒక్క దరఖాస్తుకు గంటకుపైగా సమయం తీసుకుంటోందని తెలిసింది. రద్దీ ఎక్కువగా ఉండటంతో కొన్ని మీసేవా కేంద్రాలను రాత్రి వేళల్లోనూ తెరిచే ఉంచుతున్నారు. అర్ధరాత్రి కూడా సర్వర్ బిజీ అనే వస్తోంది. ఈ పథకం ప్రారంభంలో ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తుకు అవకాశమిచ్చారు. నెట్‌వర్క్ ఇబ్బందులు, సెలవులు వంటి కారణాలతో గడువు ఈ నెల 14వరకు పెంచుతూ.. ఆఫ్‌లైన్‌లోనూ దరఖాస్తుకు అనుమతిచ్చారు. దీంతో చాలా మంది మండలం, మునిసిపాలిటీ, కార్పొరేషన్ కార్యాలయాల్లో ఆఫ్‌లైన్‌లో సమర్పించారు. నెట్‌వర్క్ సరిగా పనిచేయకపోవడంతో ఆఫ్‌లైన్‌లో స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేయడంలోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా స్వీకరించిన దరఖాస్తుల్లో ఇంకా సుమారు 2లక్షలకు పైగా ఆన్‌లైన్‌లో నమోదుకాలేదని తెలిసింది. రేషన్‌కార్డు లేనివాళ్లకు ఆదాయం సర్టిఫికెట్, తెలంగాణ ఏర్పడ్డాక తీసుకున్న కులం సర్టిఫికెట్ దరఖాస్తు సమయంలో తప్పనిసరి చేయడంతో వాటిని పొందడంలోనూ జాప్యమే జరుగుతుంది. అక్కడ కూడా నెట్‌వర్క్ సమస్య, సరిపడా సిబ్బంది లేకపోవడం, సెలవుల కారణంగా చాలా మంది ధ్రువపత్రాలు పొందలేకపోయారు. ఈ నేపథ్యం లో దరఖాస్తుల స్వీకరణ గడువు పెంచాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. అయితే గడువు పెంపు విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, సోమవారంతో గడువు ముగుస్తుందని ఎస్సీ సంక్షేమశాఖ అధికారి ఒకరు చెప్పారు.

### గడువు పొడిగించండి: ఎన్‌ఎస్‌యూఐ

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు గడువు మరో పది రోజులు పొడిగించాలని సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌లకు ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు యడవల్లి వెంకటస్వామి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన లేఖలు రాశారు.

### పోటెత్తుతున్న దరఖాస్తులు..

రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకానికి మార్చి 16న నోటిఫికేషన్ జారీ చేసి 17 నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించింది. తొలుత దరఖాస్తుకు ఏప్రిల్ 5 చివరి తేదీగా నిర్ణయించి తర్వాత గడువును ఈ నెల 14వరకు పెంచింది. రూ.50వేల లోపు యూనిట్ ఏర్పాటు చేసుకునేవాళ్లకు నూరు శాతం, మిగిలిన యూనిట్లకు 70 నుంచి 90శాతం రాయితీని ఇవ్వనున్నట్టు ప్రభుత్వం ప్రచారం చేయడంతో యువత, రైతులు, వివిధ వర్గాలకు చెందిన వాళ్లు దరఖాస్తు చేసుకోవడానికి పోటీపడుతున్నారు.

## ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయండి

**సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి**

కవాడిగూడ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి విడనాడాలని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కరివేద మహిపాల్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత పదేళ్లుగా ప్రాథమిక పాఠశాలలు నిర్లక్ష్యానికి గురి కావడంతో ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులతో వాటిని నిర్వహించాల్సిన దుస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల పట్ల నిర్లక్ష్యం విడనాడాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఇందులో కరివేద మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పదివేల ప్రాథమిక పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయ పోస్టులను మంజూరు చేసి, అర్హత గల ఎస్జీటీ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. 317 జీవో ద్వారా స్థానికతను కోల్పోయిన ఉపాధ్యాయులకు వెంటనే స్థానికత కేటాయించాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు, పీఆర్సీని వెంటనే ప్రకటించాలని కోరారు. అనంతరం ధర్నాకు మద్దతు తెలియజేసిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాల్సి ఉందన్నారు. ఈ ధర్నాలో సంఘం ప్రధాన కార్యదర్శి అరికల వెంకటేశంతోపాటు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



నా జాతి ప్రజలకు కత్తి చేతికి ఇవ్వలేదు.. ఓటు హక్కును ఆయుధంగా ఇచ్చాను.. పోరాడి రాజులవుతారో.. ఓటును అమ్ముకుని బానిసలవుతారో నిర్ణయం వారి చేతుల్లోనే ఉంది. - అంబేడ్కర్





# ప్రాణం తీసిన ట్రాఫిక్ పోలీసుల అత్యుత్సాహం

## తనిఖీలను తప్పించుకోబోయి బస్సు కింద పడి కార్పెంటర్ మృతి

- పోలీసుల దురుసుతనంపై స్థానికులు, వాహనదారుల నిరసన.. లాఠీచార్జి

బాలానగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): చలాన్ల వసూలుకు ట్రాఫిక్ పోలీసులు ప్రదర్శించిన అత్యుత్సాహం ఓ వాహనదారుడి ప్రాణం తీసింది. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని బాలానగర్ పీఎస్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఏపీలోని కోనసీమ-అంబేడ్కర్ జిల్లా గేదెల లంకవరం వాసి ముమ్మిడివరపు జోషిబాను(32).. హైదరాబాద్‌కు వలస వచ్చి గాజుల రామారం-రుడామేస్త్రీ నగర్‌లో కార్పెంటర్‌గా జీవిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పంజాగుట్టలో పని పూర్తిచేసుకు వచ్చేందుకు ఆదివారం మధ్యాహ్నం తన బైక్‌పై బయలుదేరిన జోషిబాను.. ఐడీపీఎల్ టౌన్‌షిప్ గేట్ వద్ద ట్రాఫిక్ పోలీసుల తనిఖీలను గమనించాడు. ట్రాఫిక్ కానిస్టేబుల్ సూచన మేరకు బైక్ ఆపినట్లే ఆపి.. కుడి వైపునకు తిరిగి తప్పించుకోబోయాడు. ఆ క్రమంలో వెనుక వస్తున్న బైక్‌కు తగలడంతో రోడ్డు మధ్యలో పడిపోయాడు. అప్పుడే వెనుక నుంచి వేగంగా వస్తున్న మెదక్ డిపో ఆర్టీసీ బస్సు వెనుక టైర్ కింద పడి.. తల పగిలిపోవడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.



జోషి భాను (ఫైల్)

### ట్రాఫిక్ పోలీసుల తీరు వల్లే

రోడ్డు ప్రమాదంలో కార్పెంటర్ మృతికి ట్రాఫిక్ పోలీసుల వైఖరే కారణం అని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రమాద సమయంలో ట్రాఫిక్ కానిస్టేబుల్ గోపాల్ మద్యం మత్తులో ఉన్నాడన్నారు. జోషిబాను బైక్ ఆపాలని బెదిరిస్తున్న కానిస్టేబుల్‌ను తప్పించుకోబోయి ప్రాణాలు కోల్పోయాడని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. జోషిబాను మృతి చెందగానే డ్యూటీలో ఉన్న ఇద్దరు హోంగార్డులు పరారైతే, కానిస్టేబుల్ అదృశ్యమయ్యాడని తెలిపారు. ట్రాఫిక్ పోలీసుల తీరును నిరసిస్తూ స్థానికులు, వాహనదారులు వాగ్వాదానికి దిగారు. వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీలకు పని చెప్పారు.

### కానిస్టేబుల్‌పై కేసు నమోదు

మృతుడు జోషిబాను సోదరుడు నాగఫణీంద్ర ఫిర్యాదు మేరకు బాలానగర్ పోలీసులు.. ప్రమాద కారకుడైన ట్రాఫిక్ కానిస్టేబుల్ గోపాల్‌పై బీఎస్ఎస్‌లోని 304ఏ సెక్షన్ కింద కేసు నమోదుచేశారు. అతడ్ని అరెస్ట్ చేయడంతోపాటు విధి నిర్వహణ సమయంలో మద్యం సేవించాడా? అన్న విషయం నిర్ధారణకు గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయిస్తున్నట్లు సమాచారం. ట్రాఫిక్ కానిస్టేబుల్ అత్యుత్సాహంపై నిరసనతోపాటు వారి వల్లే బాధితుడు ప్రాణాలు కోల్పోయాడనే ప్రచారం నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్, అదనపు డీసీపీ సత్యనారాయణ, ఏసీపీ హనుమంతరావు నేతృత్వంలో సీసీటీవీ ఫుటేజీ వివరాలు, జోషిబాను మృతికి కారణమైన బస్సు వివరాల సేకరణలో పడ్డారు. ట్రాఫిక్ పోలీసుల తనిఖీకి భయపడి ప్రాణాలు కోల్పోయిన బాధితుడి వాహనంపై చలాన్లు పెండింగ్‌లో లేకపోవడం గమనార్హం.

# ట్రాఫిక్ నియంత్రణ నై..!

- దారికాచి చలానాల వసూళ్లకు సై..!!
- గల్లీలో పార్క్ చేసిన.. వాహనాలకూ అడ్డంగా చలానాలు





హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): "ట్రాఫిక్ పోలీసులు ఉన్నది కూడళ్లలో వాహనాల రద్దీని నియంత్రించడానికే..! అంతేకానీ, కూడళ్ల పక్కన గుంపుగా ఉండి.. చలానాలు వసూలు చేయడానికి కాదు.." ఉమ్మడి రాష్ట్రంలో.. హైదరాబాద్ ట్రాఫిక్ అదనపు సీపీగా పనిచేస్తున్న సమయంలో ఐపీఎస్(విశ్రాంత) అధికారి ఎన్.వి.సురేంద్ర బాబు అన్నమాట ఇది.

అన్నట్లుగానే.. ట్రాఫిక్ విభాగానికి చీఫ్‌గా పనిచేసినంత కాలం ఆయన వాహనాల నియంత్రణపైనే దృష్టిసారిస్తూ.. గంటకు 14 కిలోమీటర్లుగా ఉన్న వేగాన్ని మరింత పెంచేందుకు జరిగిన ప్రయత్నాలను ఉరుకులు పెట్టించారు. ఇపుడు గ్రేటర్ హైదరాబాద్‌లో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. రద్దీ వేళల్లో ట్రాఫిక్ జామ్‌లతో.. నత్తను తలపించే వేగంతో వాహనదారులు బేజారవుతుంటే.. ట్రాఫిక్‌ను నియంత్రించాల్సిన పోలీసులు చలానాలపై దృష్టి పెడుతున్నారు. తాజాగా బాలానగర్‌లో చలానాలు విధిస్తున్న ట్రాఫిక్ పోలీసులను తప్పించుకునే ప్రయత్నంలో ఓ వాహనదారుడు దుర్మరణంపాలవ్వడం తీవ్ర ఆందోళనకు దారితీసింది. వందల మంది వాహనదారులు ఒక్కటై.. పోలీసుల తీరుపై మండిపడుతూ.. ఆందోళన చేపట్టారు.

### టార్గెట్.. టార్గెట్.. టార్గెట్.!

ట్రాఫిక్ పోలీసులు ఇప్పుడు తమ విభాగం కూడా రాష్ట్ర ఖజానాకు ఆదాయాన్ని సమకూర్చే రెవెన్యూ వనరుగా భావిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏటా పెరుగుతున్న ఈ-చలానాలు, చలానాల వసూళ్లే ఇందుకు నిదర్శనం..! హోంగార్డు మొదలు.. ఉన్నతాధికారుల వరకు టార్గెట్ చుట్టూనే తిరుగుతున్నారనే విమర్శలున్నాయి. ప్రతి హోంగార్డుకు రోజుకు 30 ఈ-చలానాల టార్గెట్ ఉంటుందని విశ్వసనీయవర్గాలు చెబుతున్నాయి. అందుకే.. ఉదయాన్నే తమకు కేటాయించిన కూడళ్లలో నిలబడి.. గంట-గంటన్నర వ్యవధిలో టార్గెట్‌ను పూర్తిచేసి, వెళ్లిపోతుంటారని వివరిస్తున్నాయి. కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్లు, ఎస్సైలు, ఇన్‌స్పెక్టర్లు.. ఇలా క్యాటగిరీల వారీగా టార్గెట్లపై దృష్టి పెడుతున్నారని తెలుస్తోంది. కూడళ్ల వద్ద నలుగురైదుగురు పోలీసులు నిలబడాల్సిన అవసరంలేకుండా.. వాటిని మూసివేస్తూ.. సుదూర ప్రాంతాల్లో యూటర్న్‌లు పెడుతూ.. ట్రాఫిక్ నియంత్రణ నుంచి తప్పించుకుంటున్నారు. రద్దీ వేళల్లో తనిఖీల పేరుతో మరింత ట్రాఫిక్‌జామ్‌కు కారణమవుతున్నారు. డాక్యుమెంట్ల తనిఖీ, పెండింగ్ చలానాలున్నాయా? అని పరిశీలిస్తూ.. చలానాలు కట్టాల్సిందేనని హుకుం జారీచేస్తున్నారు. చౌరస్తాల్లోనూ ఆటోమేటిక్ సిగ్నల్ నియంత్రణ విధానాన్ని వినియోగిస్తూ.. సీసీకెమెరాలతో ఈ-చలానాలపై దృష్టిసారిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారాంతాల్లో అర్ధరాత్రిళ్లు డ్రంకెన్ డ్రైవ్ పేరుతో ట్రాఫిక్‌జామ్‌లకు కారణమవుతున్నారని వాహనదారులు మండిపడుతున్నారు. ఇక గల్లీలో ఇళ్ల పక్కన పార్క్ చేసిన వాహనాలకూ చలానాలు విధిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### ప్రాణాల మీదకు..

2002 సంవత్సరంలో ఖైరతాబాద్ వద్ద ద్విచక్ర వాహనంపై వస్తున్న వ్యక్తి ఆపకుండా వెళ్తున్నాడని ఓ పోలీసు లాఠీ విసిరితే.. అది తగిలిన వాహనదారుడు చనిపోయారు. అప్పట్లో ట్రాఫిక్ పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఆ తర్వాతి కాలంలో.. పాతనగరంలో ఆటోరిక్షాలు ట్రాఫిక్ పోలీసుల చలానాల తీరును నిరసిస్తూ రాస్తారోకో చేస్తే.. ఏకంగా ఓ ఎమ్మెల్యే వారికి మద్దతిస్తూ రోడ్డుపై బైఠాయించారు. గత చేదు అనుభవాలు ఉన్నా.. ట్రాఫిక్ పోలీసుల్లో మార్పు రావడం లేదని వాహనదారులు మండిపడుతున్నారు. గుంపులుగా ట్రాఫిక్ అడ్డంగా నిలబడి తనిఖీలు చేస్తుండడంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. వాహనదారుల పట్ల కనీస మర్యాద కూడా పాటించకుండా వ్యవహరిస్తుంటారనే ఆరోపణలున్నాయి. అత్యవసర పనులున్న వారు ట్రాఫిక్ పోలీసులను తప్పించుకోవడానికి ప్రయత్నించే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి.. చలానాలపై కాకుండా, ట్రాఫిక్ నియంత్రణపై దృష్టిసారించాలని వాహనదారులు కోరుతున్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ వర్సిటీ నుంచి

- ఐదు ఉత్తమ మొక్కజొన్న హైబ్రిడ్ రకాలు విడుదల



ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

రాజేంద్రనగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఐదు ఉత్తమ మొక్క జొన్న హైబ్రిడ్ రకాలను విడుదల చేసిందని వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ఆదివారం తెలిపారు. ఇటీవల భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) ఆధ్వర్యంలో తమిళనాడులోని కోయంబత్తూరులో నిర్వహించిన అఖిల భారత మొక్క జొన్న పరిశోధన సమన్వయ సమావేశంలో.. దక్కన్ హైబ్రిడ్ మక్కా 144, డీహెచ్ఎం 182, డీహెచ్ఎం 193, డీహెచ్ఎం 206, డీహెచ్ఎం 218 రకాలను విడుదల చేసినట్లు ఆయన చెప్పారు. అందులో డీహెచ్ఎం 144 (తెలంగాణ మక్కా-6) రకంలో అధిక పిండి పదార్థాలు ఉండటం వల్ల ఇథనాల్ ఉత్పత్తికి బాగా అనుకూలంగా ఉంటుందని తెలిపారు. అదే విధంగా డీహెచ్ఎం 206 (తెలంగాణ మక్కా-3) మెట్ట సాగుకు అనుకూలమైందని, ఎండు తెగులును సమర్థవంతంగా తట్టుకుంటుందని తెలియజేశారు. ప్రస్తుతం రైతాంగానికి అందుబాటులో ఉన్న వివిధ మొక్క జొన్న వంగడాలతో పోలిస్తే డీహెచ్ఎం అన్ని విధాలుగా మేలైందిగా పరిశోధనలో తేలినట్లు చెప్పారు. ఈ రకాలను రాబోయే కాలంలో రైతాంగం ఉపయోగించుకోవాలని కోరారు. తమ విశ్వవిద్యాలయం నుంచి మొత్తంగా 24 మొక్క జొన్న హైబ్రిడ్ రకాలు విడుదలయ్యాయని, వాటిలో 16 రకాలను ఇటీవల కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ అధికారిక ప్రకటిత రకాలుగా గుర్తించిందని ప్రొఫెసర్ జానయ్య తెలిపారు.



జ్యోతి వెలిగిస్తున్న సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, డైరెక్టర్ రాఘవేందర్‌రావు



ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణతో రాఘవేందర్‌రావు, బోయపాటి శ్రీను, రాజేంద్రప్రసాద్

# రాయదుర్గంలో త్రినాయ్, సీరం లక్స్ ఆస్పత్రుల ప్రారంభం

- జ్యోతి వెలిగించిన మాజీ సీజేఐ ఎన్వీ రమణ, దర్శకుడు రాఘవేందర్‌రావు
- స్పీకర్ ప్రసాద్, ఆంధ్రజ్యోతి ఎండీ ఆర్కే ఇతర ప్రముఖుల హాజరు

రాయదుర్గం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆర్థోపెడిక్ వైద్య రంగంలో నిష్ణాతులైన డాక్టర్ల సేవలతో అత్యంత నాణ్యమైన ఆధునిక చికిత్స అందించడమే లక్ష్యంగా డాక్టర్ దినేశ్ సుంకర హైదరాబాద్‌లోని రాయదుర్గంలో త్రినాయ్ ఆస్పత్రిని ఆదివారం ప్రారంభించారు. అలాగే ఇదే భవనంలో డాక్టర్ పీ. లక్ష్మీ మౌనిక, డాక్టర్ సుస్మిత రెడ్డి ఆధ్వర్యంలో హెయిర్, స్కిన్, సౌందర్య చికిత్స అందించేందుకు ప్రపంచ స్థాయి సాంకేతికతతో, ఆధునిక యంత్ర పరికరాలతో సీరం లక్స్ ఆస్పత్రిని ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ, సినీ దర్శకుడు రాఘవేందర్ రావు పాల్గొని జ్యోతి వెలిగించారు. ఈ సందర్భంగా ఎన్వీ రమణ మాట్లాడారు. ఈ ఆస్పత్రులు ప్రజలకు ఆరోగ్యాన్ని అందిస్తూ ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన పరికరాలతో ప్రజలకు సేవలు అందించేందుకు ముందుకొచ్చిన డాక్టర్లను ఆయన అభినందించారు. ఆస్పత్రుల ప్రారంభ కార్యక్రమంలో శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ, సీఎం రేవంత్‌రెడ్డి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి సుజనా చౌదరి, సినీ నటుడు రాజేంద్రప్రసాద్, దర్శకుడు బోయపాటి శ్రీను పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# ఎంబీబీ'ఎస్' ఎప్పుడు?

## ఫిబ్రవరిలో వైద్యవిద్య చివరి సంవత్సరం పరీక్షల పూర్తి.. ఫలితాల జాడే లేదు

- ఉత్తీర్ణత సాధిస్తే ఏడాది ఇంటర్న్‌షిప్
- అది పూర్తి చేస్తేనే నీట్ పీజీకి అర్హత
- తీవ్ర ఆందోళనలో వైద్య విద్యార్థులు

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎంబీబీఎస్ చివరి సంవత్సరం పరీక్ష రాసిన విద్యార్థులు తుది ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే నెల రోజులు ఆలస్యమైంది. ఇప్పటివరకు చివరి విద్యాసంవత్సరం జవాబు పత్రాల ముల్యాంకనం పూర్తి కాలేదు. మరో 15-20% పత్రాలు మూల్యాంకనం చేయాల్సి ఉన్నట్లు విశ్వవిద్యాలయ వర్గాలు వెల్లడించాయి. దీంతో ఫలితాల కోసం వైద్య విద్యార్థులు మరికొన్ని రోజుల పాటు నిరీక్షించక తప్పని పరిస్థితి నెలకొంది. ఎంబీబీఎస్ తుది సంవత్సరం పరీక్షలు ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగాయి. మార్చి 3వ తేదీ వరకు ప్రాక్టికల్స్ జరిగాయి. వాటి ఫలితాలను అప్పుడే ప్రకటించారు. థియరీ పరీక్ష పత్రాల ముల్యాంకనం మాత్రం ఆలస్యమవుతోంది. మూల్యాంకనం చేసేందుకు సరిపడా అధ్యాపకులు వైద్య కళాశాలల్లో లేకపోవడంతోనే జాప్యం జరుగుతున్నట్లు వైద్యవర్గాలు చెబుతున్నాయి. విశ్వసనీయ సమాచారం మేరకు ఫైనలియర్‌కు చెందిన మొత్తం 66,046 స్క్రిప్టులు మూల్యాంకనం చేయాల్సివుండగా ఈనెల 10 వరకు 58,126 స్క్రిప్టులనే మూల్యాంకనం చేశారు. మరో 7,920 స్క్రిప్టులు మిగిలి ఉన్నాయి. ఫైనలియర్ ఫలితాలు వెల్లడికాగానే ఉత్తీర్ణులైనవారు విధిగా ఏడాదిపాటు ఆస్పత్రుల్లో హౌస్‌సర్జన్లుగా పనిచేయాలి. అప్పుడే వారు నీట్ పీజీకి అర్హులవుతారు. వైద్య విద్య పూర్తయిన విద్యార్థులు సంబంధిత కళాశాల ఆస్పత్రుల్లో ఇంటర్నీస్‌గా ఏడాది పాటు పనిచేయాలి. వాస్తవానికి ఇప్పటికే ఫైనలియర్ ఉత్తీర్ణులైన విద్యార్థులంతా ఇంటర్నీస్‌గా చేరాలి. ఫలితాల వెల్లడిలో జరుగుతున్న ఆలస్యానికి ఆరోగ్య విశ్వవిద్యాలయం తీరే కారణం అని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరింత ఆలస్యమైతే తాము తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది జూన్ 15న నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ఉంది. నీట్ పీజీ ప్రవేశ పరీక్ష నిర్వహించే నాటికి ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ఉండాలి. చివరి సంవత్సరం పరీక్ష రాసిన తాము హౌస్‌సర్జన్స్‌గా పన్నెండు నెలలు పూర్తిచేసేలోపే వచ్చే ఏడాది నీట్ పరీక్ష జరిగితే పరిస్థితి ఏమిటి? అని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ఆర్థోపెడిక్ పత్రాలు జనరల్ సర్జన్ అధ్యాపకులతో మూల్యాంకనం

ప్రతి కళాశాలలో ఆర్థోపెడిక్ విభాగం ఉంటుంది. ఆర్థో విభాగం పరీక్షకు సంబంధించి జవాబు పత్రాలను ఆ అధ్యాపకులతోనే మూల్యాంకనం చేయించాలి. అయితే ఈ ఏడాది విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు విచిత్రంగా జనరల్ సర్జరీ విభాగానికి చెందిన అధ్యాపకులతో ముల్యాంకనం చేయిస్తున్నారు. దీనిపై కూడా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థో అధ్యాపకులు ఉన్నప్పుడు జనరల్ సర్జన్ అధ్యాపకులతో ఎలా మూల్యాంకనం చేయిస్తారని వారు ప్రశ్నిస్తున్నారు.

## కౌడిపల్లి వసతి గృహంలో ఫుడ్ పాయిజన్

- 30 మంది విద్యార్థినులకు అస్వస్థత

కౌడిపల్లి, ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి) 13: మెదక్ జిల్లా కౌడిపల్లి సమీకృత సంక్షేమ బాలికల వసతి గృహంలో ఆదివారం ఉదయం అల్పాహారం తిన్న విద్యార్థులు అస్వస్థతకు లోనయ్యారు. దాదాపు 30 మంది విద్యార్థులు వాంతులు, కడుపు నొప్పి, కళ్లు తిరగడం లాంటి లక్షణాలతో ఆస్పత్రిలో చేరారు. పదో తరగతి పరీక్షలు అయిపోయిన నేపథ్యంలో ప్రస్తుతం హాస్టల్లో 97 మంది విద్యార్థినులు ఉంటున్నారు. వీరికి ఆదివారం అల్పాహారంగా ఇడ్లీని అందించారు. ఇడ్లీలు తిన్న తర్వాత దాదాపు 30 మంది విద్యార్థినులకు వాంతులు, కడుపు నొప్పి మొదలయ్యాయి. వెంటనే వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ప్రస్తుతం విద్యార్థినులు ఆరోగ్యంగా ఉన్నారు. మరోవైపు, విద్యార్థులు ఇడ్లీల్లో వెంట్రుకలు, పురుగులు వస్తున్నాయని తెలిపారు. హాస్టల్లో ఆహారం సరిగ్గా లేకపోవడంతో చాలా మందిమి బయట నుంచి తీసుకువచ్చిన భోజనం చేస్తున్నామని చెప్పారు. ఆహారం బాగాలేదని ఫిర్యాదు చేస్తే 500 గుంజీలు తీయిస్తున్నారని విలపించారు. రోజూ సకాలంలో భోజనం అందించకపోవడంతో పాఠశాలకు ఆలస్యంగా వెళ్లాల్సి వస్తోందన్నారు. ఇదే విషయంపై హాస్టల్ వార్డెన్ నర్సమ్మను వివరణ కోరగా ఆమె నోరు మెదపలేదు.

## మావోయిస్టులతో శాంతి చర్చలు జరపండి

- ప్రధాని, హోంమంత్రికి పీస్ డైలాగ్ కమిటీ వినతి

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం, మావోయిస్టు పార్టీ మధ్య కాల్పుల విరమణ కోసం శాంతి చర్చలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాకు పీస్ డైలాగ్ కమిటీ విజ్ఞప్తి చేసింది. పౌరసమాజం నుంచి ఈ కమిటీలో ప్రాతినిధ్యం వహిస్తున్న పలువురు సభ్యులు ఆదివారం సమావేశమయ్యారు. శాంతిచర్చలు, కాల్పుల విరమణ కోసం ఈ కమిటీని ఏర్పాటు చేశామని, ఇరుపక్షాల మధ్య శాంతి చర్చలను సులభతరం చేయడం, కాల్పుల విరమణను ప్రోత్సహించడం కమిటీ ముఖ్య ఉద్దేశమని వారు తెలిపారు. శాంతియుత, సంక్షేమ రాజ్య స్థాపన కోసం ప్రధాని, హోంమంత్రి జోక్యం చేసుకోవాలని వారు ఒక ప్రకటనలో కోరారు. పీస్ డైలాగ్ కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్, వైస్ చైర్మన్లు జంపన్న, ప్రొఫెసర్ హరగోపాల్, కన్వీనర్ దుర్గాప్రసాద్, కో-కన్వీనర్లు జయ వింధ్యాల, డాక్టర్ తిరుపతయ్య, బాలకిషన్‌రావు, కందుల ప్రతాప్‌రెడ్డి లేఖపై సంతకాలు చేశారు. ఇలాంటి లేఖలనే వారు వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకు, మంత్రులకు పంపారు.

## ఎస్సీ వర్గీకరణతో బంగారు భవిష్యత్తు: మందకృష్ణ

ముదిగొండ, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతో భావి తరాలకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. వర్గీకరణ కోసం 30ఏళ్లుగా చేసిన పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పు వల్ల ఫలితం దక్కిందని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వల్లభిలో ఆదివారం ఆయన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే అణగారిన వర్గాల వారు చదువుకోవడానికి అవకాశం లభించిందన్నారు. ఎంత కష్టం వచ్చినా తల్లిదండ్రులు తమ పిల్లలపై శ్రద్ధ పెట్టాలని, వారికి మంచి భవిష్యత్తు ఇవ్వాలని మందకృష్ణ సూచించారు.

## ఉద్యోగులను తప్పుదోవ పట్టించే యత్నం

- ఆర్టీసీ యాజమాన్యంపై జేఏసీ ప్రతినిధుల ఆరోపణ

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అబద్ధాలు, అర్ధసత్యాలతో ఆర్టీసీ యాజమాన్యం ఉద్యోగులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తోందని టీజీఎస్ఆర్టీసీ జేఏసీ ప్రతినిధులు ఆరోపించారు. సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న డిమాండ్ల సాధన కోసం సమ్మెకు సిద్ధమవుతున్న కార్మికులను మభ్యపెట్టి యజమాన్యం పక్కదారి పట్టించేందుకే సత్య దూరమైన ప్రకటనలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ యాజమాన్యానికి కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల చిత్త శుద్ధి ఉంటే సమ్మె నోటీసులో పేర్కొన్న సమస్యలపై చర్చలకు ఎందుకు పిలవడంలేదని ఆదివారం ఓ ప్రకటనలో వారు ప్రశ్నించారు. 40వేలకు పైగా కార్మికులున్న ఆర్టీసీలో కార్మిక యూనియన్లను గుర్తించకపోవడం కార్మిక చట్టాలకు విరుద్ధమన్నారు. ప్రభుత్వాలు అంగీకరించినా, హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించకపోవడం వెనకున్న వారెవరో కార్మికులకు తెలుసునని పేర్కొన్నారు.

## జైభీమ్ పాదయాత్రను ప్రారంభించిన గవర్నర్

హైదరాబాద్,ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చేందుకు యువత ముందుకు రావాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపునిచ్చారు. జైభీమ్ పాదయాత్రను ఆయన రాజ్‌భవన్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. రాజ్‌భవన్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు పాదయాత్ర సాగింది. ఎన్‌సీసీ క్యాడెట్లు, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక కార్యదర్శి దానకిషోర్, కల్నల్ సమీర్ శర్మ, వేణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి తీరుతో అధికారులు జైలుకు: హరీశ్



గజ్వేల్/హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీయూ భూముల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్న తీరుతో అధికారులు జైలుకు వెళ్లే అవకాశముందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో బీఆర్ఎస్ రజతోత్సవ సన్నాహక సమావేశాన్ని ఆదివారం నిర్వహించగా, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్ఎస్ గజ్వేల్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డితో కలసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రేషన్ దుకాణాల్లో సన్నబియ్యంతో మరో డ్రామాకు తెర లేపారని, ప్రస్తుతం ఇస్తున్న సన్నబియ్యంలో 40% నూకలే ఉంటున్నాయని, నాణ్యమైన సన్నబియ్యాన్ని ప్రజలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా, ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్నవారిలో ఇద్దరి మృతదేహాలను వెలికితీసి చేతులు దులుపుకొన్నారని, సహాయక చర్యల పేరిట ఇంకెన్నిరోజులు కాలయాపన చేస్తారని ఎక్స్ వేదికగా హరీశ్ రావు ప్రశ్నించారు. కాగా, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అంబేడ్కర్‌ను అవమానిస్తోందని బీఆర్ఎస్ నేతలు ఎర్రోళ్ల శ్రీనివాస్, మేడే రాజీవ్‌సాగర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సర్కార్ అవలంబిస్తున్న తీరును ఖండిస్తున్నామన్నారు.

## కేసీఆర్‌పై కోపంతో అంబేడ్కర్‌ను అవమానిస్తున్నారు: కవిత

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్‌పై కోపంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అంబేడ్కర్‌ను అవమానిస్తోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ముఖ్యమంత్రి, మంత్రులు అంబేడ్కర్ స్మృతివనాన్ని సందర్శించి నివాళులర్పించాలని సూచించారు. గత ఏడాది అంబేడ్కర్ జయంతికి ముఖ్యమంత్రి, మంత్రులెవరూ 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించలేదన్నారు.

## టీజీపీఎస్సీకి క్షమాపణలు చెప్పను: రాకేశ్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ తనకు పరువు నష్టం నోటీసులు పంపడంపై బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి స్పందించారు. క్షమాపణలు చెప్పనని ఆయన అన్నారు. పరువునష్టం కేసులో టీజీపీఎస్సీ నోటీసులు పంపడం దేశంలో ఇదే మొదటిసారి అని చెప్పారు. వ్యవస్థలోని లోపాలను ప్రశ్నిస్తే పరువునష్టం నోటీసు పంపడం విడ్డూరమన్నారు. గ్రూప్-1 పరీక్షల వ్యవహారంపై జ్యుడీషియల్ విచారణ జరిపిస్తే తాను అన్ని ఆధారాలు అందిస్తానని ఆయన తెలిపారు.

## బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ విజేతగా వరుణ్

- జాతీయ పోటీలకు ఎంపిక

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-18 బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో సిద్దిపేట జిల్లా గౌరవెల్లి గ్రామానికి చెందిన దండుగుల వరుణ్ విజేతగా నిలిచారు. హైదరాబాద్‌లోని లాలాగూడ మునిసిపల్ గ్రౌండ్‌లో జరిగిన ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. హకీంపేట తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలకు చెందిన ఆరుగురు క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనగా ముగ్గురు విజయం సాధించారు. వీరిలో ఇద్దరు వెండి పతకాలు సాధించారు. ఈనెల 20న ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో వరుణ్ పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించిన వరుణ్‌ను మాజీమంత్రి హరీశ్‌రావు అభినందించారు.

## డ్యూటీలో గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

తిరుమలగిరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూనే ఓ హెడ్ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి చెందారు. తుంగతుర్తి మండలం గన్యానాయక్ తండాకు చెందిన రమేశ్‌రాథోడ్ (49) ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో కుర్చీలో కూర్చుని విధులు నిర్వహిస్తూనే ఓ పక్కకు ఒరిగారు. డ్యూటీలో ఉన్న సిబ్బంది వెంటనే ఆయన్ను బల్లపై పడుకోబెట్టి సీపీఆర్ చేశారు. అనంతరం ఆస్పత్రికి తరలించగా, అప్పటికే రమేశ్ రాథోడ్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

## భక్తజనసంద్రంగా కొండగట్టు



జగిత్యాల జిల్లా కొండగట్టు అంజనేయస్వామి సన్నిధి భక్త జన సంద్రంగా మారింది. శుక్రవారం ప్రారంభమైన హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. దాదాపు లక్షమంది వరకు దీక్షాపరులు కొండపైకి తరలిరావడంతో అంజన్న పరిసరాలు కిక్కిరిశాయి. రామనామంతో కొండగట్టు గిరులు పులకించిపోగా, ఆలయ పరిసరాలు కాషాయమయంగా మారాయి. ఘాట్‌రోడ్డు, మెట్ల మార్గం, దిగువ కొండగట్టు, దొంగలమర్రి ప్రాంతాలు భక్తులతో రద్దీగా మారాయి. దీక్ష విరమణ మండపంలో మాల విరమణ చేసిన భక్తులు అంజన్నను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

- మల్యాల, ఆంధ్రజ్యోతి



మీ బానిసత్వాన్ని మీరే పోగొట్టుకోవాలి.. అందుకు దేవుని మీద కానీ, మహానుభావుల మీద కానీ ఆధారపడవద్దు - అంబేడ్కర్





# పండుగలా అంబేడ్కర్ జయంతి

- నేడు నిర్వహించేందుకు సర్కారు ఏర్పాట్లు
- ట్యాంక్‌బండ్‌పై నివాళులర్పించనున్న సీఎం, మంత్రులు
- భావితరాలకు స్ఫూర్తి అంబేడ్కర్: రేవంత్

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని పండుగలా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. ఆదివారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలను చేపట్టాలని అధికారులను ఆదేశించింది. అంబేడ్కర్ జీవిత విశేషాలను తెలిపేలా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని సూచించింది. ఇటు ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న భారీ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులర్పించన్నారు. వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహతో పాటు పలువురు మంత్రులూ ఇందులో పాల్గొననున్నారు. అంబేడ్కర్ జయంతి నేపథ్యంలోనే భూభారతి పోర్టల్ ఆవిష్కరణతో పాటు ఎస్సీ వర్గీకరణ జీవోను ప్రభుత్వం అధికారికంగా విడుదల చేయనుంది. అణగారిన వర్గాల సంక్షేమం కోసం అంబేడ్కర్ చేసిన కృషిని మరువలేనిదని సీఎం రేవంత్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీర్ఘదృష్టితో దేశ భవిష్యత్తును ఊహించి, దార్శనికతతో రాజ్యాంగాన్ని రూపొందించి భావి తరాలకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. అంబేడ్కర్ ఆశయాలను సాకారం చేయడానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఏర్పాటు కలను సాధ్యం చేసింది అంబేడ్కర్ రాజ్యాంగమేనన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి కట్టుబడి పనిచేస్తోందని.. ఎస్సీ వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల పెంపు వంటి కీలక నిర్ణయాలతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వెల్లడించారు. అణగారిన వర్గాల కోసం జీవిత కాలం పోరాడిన దార్శనికుడు అంబేడ్కర్ అని కేసీఆర్ ఓ ప్రకటనలో కొనియాడారు. ముందుచూపుతో ఆయన రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ ఏర్పాటు సాధ్యమైందని పునరుద్ఘాటించారు. రాష్ట్ర సచివాలయానికి ఆయన పేరునే పెట్టామని వివరించారు.

### ఎల్లుండి నుంచి జపాన్ పర్యటనకు సీఎం..

సీఎం రేవంత్ రెడ్డి ఈనెల 16న జపాన్ పర్యటనకు వెళ్లనున్నారు. ఆయనతో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాష్ట్ర అధికారుల ప్రతినిధి బృందం ఈ పర్యటనలో పాలుపంచుకోనుంది. ఈ నెల 22వ తేదీ వరకు వీరు అక్కడే ఉండి ప్రముఖ కంపెనీలు, పారిశ్రామికవేత్తలతో చర్చలు జరుపుతారని సీఎంవో వెల్లడించింది.

## సన్నబియ్యం పథకం దేశానికే రోల్ మోడల్

- పథకానికి రూ.13వేల కోట్ల ఖర్చు: భట్టి విక్రమార్క

మధిరటౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): సన్నబియ్యం పథకం దేశానికే రోల్‌మోడల్‌గా నిలిచిందని, తెలంగాణ ప్రభుత్వానికి ఇది ఎలా సాధమైందని తెలుసుకునేందుకు ఇతర రాష్ట్రాల వారు రాష్ట్రం వైపు చూస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా మధిరలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేరరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధనిక రాష్ట్రమైన తెలంగాణను గత పాలకులు అప్పుల కుప్పగా మార్చారని, పదేళ్ల పాలనలో సన్నబియ్యం ఇస్తామని మాటలు చెప్పడం, పాటలు పాడడమే తప్ప ఏ పేదవాడికి న్యాయం చేసింది లేదని విమర్శించారు.ఈ పథకం కోసం ప్రభుత్వం రూ.13,525కోట్లు ఖర్చు చేస్తోందని, 90లక్షల కార్డులతో 2.85 కోట్ల మందికి సన్నబియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. మరికొన్ని రోజుల్లో 10 లక్షల కొత్త కార్డులు ఇస్తామని, మొత్తం 3.10కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తామని ఆయన చెప్పారు.

## రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి: పొన్నం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం జూబ్లీహిల్స్‌లోని డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పరిపాలన భవనం వద్ద 'భారత రాజ్యాంగ పీఠికను ఉద్యోగులు, విద్యార్థుల చేత మంత్రి పఠనం చేయించారు. రాజ్యాంగ రక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే, బాబుజగ్జీవన్ రామ్ వంటి మహనీయులను స్మరిస్తూ యూనివర్సిటీలో 'సామాజిక సాధికారత ఉత్సవాలు' నిర్వహించడం అభినందనీయమన్నారు.

## సంజయ్.. కేంద్రం ఇచ్చే నిధులపై చర్చకు సిద్ధమా?

- నిరాధార ఆరోపణలు చేస్తే సహించబోం: మహేశ్ గౌడ్

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నుంచి కేంద్రానికి రూ.వేల కోట్లు పన్నుల కింద వెళ్తే.. కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులు గుండు సున్నా అని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి వచ్చే నిధులపై చర్చకు సిద్ధమా అంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను నిలదీశారు. బీఆర్ఎస్‌తో బీజేపీ అనైతిక పొత్తుతోనే బండి సంజయ్ కాంగ్రెస్ సర్కారుపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆదివారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. కాంగ్రెస్ నేతల సహనాన్ని చేతగానితనంగా తీసుకోవద్దని.. ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. 'సన్నబియ్యాన్ని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇవ్వాలని.. బీసీలకు 42% రిజర్వేషన్ల చట్టబద్ధతకు సహకరించాలని.. దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపట్టాలని ప్రధాని మోదీకి లేఖ రాసే దమ్ముందా?' అని సంజయ్‌ను నిలదీశారు. కేంద్ర మంత్రులు సంజయ్, కిషన్‌రెడ్డి.. తెలంగాణ అభివృద్ధికి సహకరించాల్సింది పోయి అడుగడుగునా అడ్డుపడడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, అంబేడ్కర్ పేరెత్తే అర్హత బీజేపీ నేతలకు లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ విమర్శించారు. ఎన్ని గిమ్మిక్కులు చేసినా దేశ ప్రజలు బీజేపీని నమ్మబోరని వ్యాఖ్యానించారు.

## 'కంచ గచ్చిబౌలి'పై ఏం చేద్దాం?

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్ తిరుగు ప్రయాణమైంది. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో పాటు మరికొందరు న్యాయవాదులతో సీఎస్ ప్రత్యేకంగా సమావేశమైనట్టు తెలిసింది. కంచ గచ్చిబౌలి భూములను సీఎస్ స్వయంగా సందర్శించి, 16వ తేదీలోపు సమగ్ర నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. 'ఈ విషయంలో మా ఆదేశాలు పాటించకపోతే సీఎస్ వ్యక్తిగతంగా బాధ్యులవుతారు. ఆ భూముల్లోని చెరువు సమీపంలో తాత్కాలికంగా నిర్మించే జైలుకు వెళ్లాల్సి ఉంటుంది. అదే కోరుకుంటే ఎవరూ సహాయం చేయలేరని సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించిన నేపథ్యంలో నివేదికలో ఏయే అంశాలు పొందుపరచాలి? క్షేత్రస్థాయిలో అసలేం జరిగింది? నివేదిక తర్వాత సుప్రీంకోర్టు ఎలా స్పందిస్తుంది? తదితర అంశాలపై ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చర్చించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. గత విచారణ సందర్భంగా అమికస్ క్యూరీ లేవనెత్తిన ఐదు ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సుప్రీంకోర్టు ఆదేశించగా... వాటిపై కూడా అధికారుల బృందం సుదీర్ఘంగా చర్చించినట్టు తెలిసింది. 'అటవీ భూమిగా భావిస్తున్న కంచ గచ్చిబౌలిలో చెట్లను తొలగించి అభివృద్ధి కార్యకలాపాలు అంత హడావుడిగా చేపట్టాల్సిన అవసరమేంటి?, దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ మదింపు ధ్రువీకరణ నివేదిక తీసుకుందా?, చెట్ల నరికివేత కోసం అటవీ అధికారుల నుంచి అవసరమైన అనుమతులు పొందారా? స్థానిక చట్టాలను అమలు చేశారా?, మార్చి 15న అటవీ భూమి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో అటవీ, పర్యావరణ వ్యవహారాల్లో నిపుణులు కాని అధికారులను నియమించాల్సిన అవసరమేంటి? వారికి అడవుల గురించి ఉన్న అనుభవమేంటి?, అక్కడ నరికిన చెట్లతో వచ్చిన కలపను ఏం చేస్తోంది?' అనే ప్రశ్నలకు ఎటువంటి సమాధానాలు ఇవ్వాలి? సుప్రీంకోర్టు ఎలా స్పందిస్తుంది? అమికస్ క్యూరీ లేవనెత్తబోయే తదుపరి ప్రశ్నలేంటి అనే అంశాలపై చర్చించినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా... కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారిస్తుండగా, తమ వాదనలనూ వినాలని 'బీ ద ఛేంజ్ వెల్ఫేర్ సొసైటీ' అనే స్వచ్ఛంద సంస్థ ఈ నెల 9న రిట్ పిటిషన్ దాఖలు చేసింది. కేంద్రం, తెలంగాణ ప్రభుత్వం, అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్, అదనపు కార్యదర్శి, హెచ్‌సీయూ రిజిస్ట్రార్, టీజీఐఐసీ డైరెక్టర్ సహా మరికొందరిని ప్రతివాదులుగా చేర్చింది. ఈ పిటిషన్ కూడా ఈ నెల 16వ తేదీనే జస్టిస్ బీఆర్ గవాయి నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణకు రానుంది.

# జూన్ 2 నుంచి రాష్ట్రమంతా

## తొలుత 3 మండలాల్లోనే భూభారతి.. అధ్యయనం తర్వాత పూర్తిస్థాయిలో..

- మేలో గ్రామ పాలనాధికారుల భర్తీ
- 'ధరణి'తో కొల్లగొట్టిన భూములపై త్వరలో ఆడిట్
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో పొంగులేటి



హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): "జూన్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలనేది ప్రభుత్వ సంకల్పం. తొలుత మూడు జిల్లాల పరిధిలోని మూడు మండలాల్లో సోమవారం నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తాం. పోర్టల్ మాత్రం రాష్ట్ర వ్యాప్తంగా అందరికీ అందుబాటులో ఉంటుంది. మూడు మండలాల పరిధిలో అంశాల వారీగా వచ్చే సమస్యలను అధ్యయనం చేశాక.. వాటి పరిష్కారానికి వీలైనంత త్వరగా నిబంధనల్లో మార్పులు చేస్తాం. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులకు గరిష్ఠంగా పది రోజుల వ్యవధిలో పరిష్కారం చూపాలనే లక్ష్యం నిర్ణయించాం" అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సచివాలయంలో ఆదివారం ఆయన మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. భూభారతి చట్టంపై అపోహలు తలెత్తేలా, ప్రజలను గందరగోళానికి గురి చేసేలా ఎవరు వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. "ఆదివారం సాయంత్రం 5 గంటల తరువాత భూభారతి పోర్టల్ అందరికీ అందుబాటులోకి వస్తుంది. అయితే ఒకేసారి ఎక్కువ మంది లాగిన్ అయితే సర్వర్ మొరాయించే ప్రమాదం ఉంది. భూముల వివరాలను తెలుసుకోవాలనుకుంటే ఎప్పుడైనా పోర్టల్‌లో చూసుకోవచ్చు. ఏ ఒక్క రైతు కూడా అభద్రతకు గురికావాల్సిన పని లేదు. ధరణి సమస్యల నుంచి రైతులను, ప్రజలను కాపాడేందుకే కొత్త చట్టం తీసుకొస్తున్నాం. దీని వల్ల లాభమే తప్ప.. ఎవరికి నష్టం జరగదు. 2029 అసెంబ్లీ ఎన్నికలకు భూభారతిని రిఫరెండంగా కాంగ్రెస్ భావిస్తుంది" అని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 6.50లక్షల సాదాబైనామా దరఖాస్తులను తిరస్కరించిందని పొంగులేటి గుర్తు చేశారు. కొత్త చట్టం ప్రకారం అర్హత కలిగిన దరఖాస్తులను పరిష్కరిస్తామని తెలిపారు. గత ప్రభుత్వం పార్ట్-బీలో పెట్టిన 18 లక్షల ఎకరాల్లో సుమారు 6 లక్షల ఎకరాల వరకు అటవీ, దేవాదాయ, వక్ఫ్ భూములు ఉన్నాయని వెల్లడించారు. మిగతా 12లక్షల ఎకరాల్లో వివాదాలు లేని భూములపై వాటి యజమానులకు హక్కులు కల్పిస్తామన్నారు.

### అక్రమాలను ప్రజల ముందు పెడతాం

భూభారతి అమల్లోకి వచ్చాక.. గతంలో జరిగిన భూ అక్రమాలను బయట పెడతామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఫోరెన్సిక్ ఆడిట్ విషయంలో వెనక్కి తగ్గేది లేదని.. అందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తవుతున్నాయన్నారు. అన్ని వివరాలను త్వరలోనే ప్రజల ముందు పెడతామన్నారు. ఇబ్రహీంపట్నంలోని యాచారంలో భూ దందాపైనా నివేదిక సిద్ధమైందన్నారు. తొమ్మిది నెలల్లో భూభారతి కొత్త పోర్టల్ అందుబాటులోకి వస్తుందని, ప్రస్తుతానికి పాత పోర్టల్‌లోనే పలు మార్పులు చేశామన్నారు. భూభారతి అమల్లోకి వచ్చాక రిజిస్ట్రేషన్లు యథావిధిగా కొనసాగుతాయన్నారు. సాంకేతిక ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఎవరు ఫిర్యాదు చేసినా విచారణకు స్వీకరించాలని చట్టంలో పొందుపరిచామన్నారు. గతంలో తొలగించిన వీఆర్వోలు, వీఆర్ఏల నుంచి ఈ నెల 17వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని, రాత పరీక్ష ద్వారా ఎంపికైన అభ్యర్థులకు మే మొదటి వారంలో గ్రామపాలన అధికారులుగా నియామక పత్రాలు అందజేస్తామన్నారు. గ్రామాల్లోని భూ సమస్యలను వారు ప్రభుత్వానికి నివేదిస్తారే తప్ప.. ఎలాంటి నిర్ణయాధికారాలు ఉండవన్నారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా 1000 మంది సర్వేయర్లను నియమించబోతున్నామన్నారు. వీరితోపాటు మరో 6వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను ఎంపిక చేసి శిక్షణ ఇవ్వనున్నామని, కర్ణాటకలో మాదిరిగా వారి సేవలను వినియోగించుకుంటామన్నారు. నాలుగేళ్లకు సంబంధించిన పాత రెవెన్యూ రికార్డులను అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి కార్యాలయంలో మ్యానువల్ రికార్డులు కూడా అందుబాటులో ఉంటాయన్నారు. పాస్ పుస్తకాలు లేని వారికి ఆందోళన అవసరం లేదని.. కొత్త చట్టం ప్రకారం అర్హులందరికీ పాస్ పుస్తకాలు జారీ చేస్తామన్నారు.

### 30శాతం పెరిగిన రిజిస్ట్రేషన్లు

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలో నూతనంగా అమల్లోకి తెచ్చిన స్లాట్ విధానం వల్ల దస్తావేజుల రిజిస్ట్రేషన్లలో వేగం పెరిగిందని పొంగులేటి తెలిపారు. 10 నుంచి 12 నిమిషాల వ్యవధిలో రిజిస్ట్రేషన్లు పూర్తవుతున్నాయన్నారు. రోజువారీగా పరిశీలిస్తే గతంలో కంటే 30శాతం అదనంగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతానికి రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానం అమల్లో ఉందని, త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి తెస్తామన్నారు.

## తెలుగు, ఆంగ్లం, ఉర్దూలో భూ భారతి

(మొదటిపేజీ తరువాయి)




సూచించారు. "భూభారతి విషయంలో అలసత్వం వద్దు. అధికారులు, కలెక్టర్లు నిర్లక్ష్యం వహించినా.. ఏవైనా తప్పులు దొర్లినా ఉపేక్షించేది లేదు" అని సున్నితంగా హెచ్చరించారు. జిల్లాల కలెక్టర్లు ప్రతి మండలంలో భూభారతిపై అవగాహన సదస్సులను నిర్వహించాలన్నారు. భూభారతి లోగోపైనా ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టిసారించారు. గతంలో డిజైన్ అయిన పలు లోగోలను అధికారులు సీఎంకు చూపించారు. వాటన్నింటినీ ఆయన తిరస్కరిస్తూ.. లోగో విషయంలో కీలక సూచన చేశారు. "పంటలకు సంకేతంగా ఆకుపచ్చ రంగు.. సాగునీటికి సంకేతంగా నీలం రంగును వాడాలి. అందులో తెలంగాణ తల్లి విగ్రహం ప్రతిబింబించేలా లోగోను తీర్చిదిద్దాలి" అని అప్పట్లో ఆదేశించారు. ఆ మేరకు చూడముచ్చటైన లోగోను రూపొందించినట్లు తెలిసింది. భూభారతి పోర్టల్‌లో 'తెలంగాణ రైజింగ్' లోగోను కూడా అప్‌లోడ్ చేస్తారని సమాచారం. భూభారతితోపాటు.. హౌసింగ్, వేసవి నేపథ్యంలో తాగునీటిపై సోమవారం మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎం సమావేశం కానున్నారు.

### సందేహాల నివృత్తికి భూ మిత్ర.!

భూ భారతి చట్టం, దరఖాస్తు విధానం లేదా పోర్టల్‌కు సంబంధించి రైతులకు ఏవైనా సందేహాలు వ్యక్తమైతే.. వాటిని నివృత్తి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక సదుపాయాన్ని తీసుకురానుంది. ఏఐ చాట్‌బోట్ సాయంతో పనిచేసే ఈ వ్యవస్థకు 'భూమిత్ర' లేదా 'భూరక్షక్' అనే పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. భూభారతిని పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్న మండలాల్లో ఈ చాట్‌బోట్‌ను అందుబాటులోకి తీసుకువస్తారని సమాచారం. దీని నిర్వహణకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమిస్తారని, టోల్‌ఫ్రీ నంబరును అందుబాటులోకి తీసుకువస్తారని తెలుస్తోంది.

### ఈ 3 మండలాల్లో పైలట్ ప్రాజెక్టు

సోమవారం ఆవిష్కరించే భూ భారతి పోర్టల్‌ను తొలుత మూడు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తారు. నల్లగొండ జిల్లాలోని సాగర్, తిరుమలగిరి, రంగారెడ్డి జిల్లాలోని కీసర మండలాలను పైలెట్ ప్రాజెక్టుకు ఎంపిక చేశారు. పైలెట్ ప్రాజెక్టు సందర్భంగా గుర్తించే సమస్యలను అధ్యయనం చేసి, వాటిని పరిష్కరించిన తర్వాత.. రాష్ట్రవ్యాప్తంగా భూభారతిని అమలు చేయాలని సర్కారు నిర్ణయించింది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం(జూన్ 2) నుంచి పూర్తిస్థాయిలో భూభారతి చట్టం అమల్లోకి తీసుకురావాలని భావిస్తోంది. కాగా.. భూభారతి పోర్టల్ ఆవిష్కరణ ప్రత్యక్ష ప్రసారానికి వ్యవసాయశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 566 రైతువేదికలలో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి వివిధ రైతు వేదికల ద్వారా లక్షల మంది అన్నదాతలు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని వీక్షిస్తారని వ్యవసాయ శాఖ ఓ ప్రకటనలో తెలిపింది.



ఉత్తమ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సీబీఏ అధ్యక్షుడు ఉదయ్ శేఖర్, ప్రధాన కార్యదర్శి అరవింద్ ఘోష్

## బిల్డర్ల సమస్యలను పరిష్కరిస్తాం

- పెట్టుబడులకు కేంద్రంగా హైదరాబాద్
- సైబరాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ వేడుకలో మంత్రి ఉత్తమ్
- గత ఏడాది హైదరాబాద్‌లో ఆస్తుల రిజిస్ట్రేషన్లు పెరిగాయ్: సీబీఏ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్కిల్స్ యూనివర్సిటీ, ఫ్యూచర్ సిటీతో తెలంగాణకు మరిన్ని పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులకు హైదరాబాద్ కేంద్రంగా నిలుస్తోందన్నారు. ఆదివారం హెచ్ఐసీసీలో జరిగిన సైబరాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ (సీబీఏ) వార్షిక వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. అమెజాన్, గూగుల్ వంటి ప్రముఖ కంపెనీలు కొత్త శాఖలు ఏర్పాటు చేయడంతో పాటు హైదరాబాద్‌లోని పాత కార్యాలయాలను విస్తరిస్తున్నాయని చెప్పారు. తమ ప్రభుత్వం భవన నిర్మాణ రంగాన్ని ప్రోత్సహి స్తుందన్నారు. సైబరాబాద్, హైదరాబాద్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందుతున్నాయని తెలిపారు. హైదరాబాద్ అన్ని రంగాల్లో ప్రపంచస్థాయి నగరాలతో పోటీపడుతోందన్నారు. మహానగరంలో పెరుగుతున్న జనాబా అవసరాలకు అనుగుణంగా గోదావరి, కృష్ణా నుంచి మంచినీటి ని సరఫరా చేయడంతో పాటు ట్రాఫిక్ సమస్యను తగ్గించే అంశంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు. బిల్డర్ల సమస్యలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ఏ సమస్యలున్నా లిఖిత పూర్వకంగా తెలియజేస్తే సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. సీబీఏ అధ్యక్షుడు ఉదయ్ శేఖర్ మాట్లాడుతూ.. రీజనల్ రింగ్ రోడ్డుతో పాటు మెట్రో విస్తరణకు ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందన్నారు. సీబీఏ కార్యదర్శి జి.అరవింద్ ఘోష్ మాట్లాడుతూ.. 2023తో పోలిస్తే గత ఏడాది హైదరాబాద్‌లో ఆస్తుల రిజిస్ట్రేషన్లు పెరిగాయన్నారు. గత ఐదేళ్లలో నగరంలో ఆఫీస్ స్పేస్ లావాదేవీలు పెరిగాయని చెప్పారు. కొత్తపేట, నల్లగండ్ల, కొంపల్లి వంటి చోట్ల బలమైన లీజింగ్ లావాదేవీలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రీ లాంచ్‌ను ప్రోత్సహించవద్దన్నారు. ఆ పేర్లతో జరిగే మోసాలపై కొనుగోలుదారులకు సీబీఏ అవగాహన కల్పిస్తుందని చెప్పారు.

# జానారెడ్డిది ధృతరాష్ట్రుడి పాత్ర

(మొదటిపేజీ తరువాయి)



ఆయన మాట్లాడారు. కొందరు నాయకులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని, జానారెడ్డి తన సొంత ఉమ్మడి నల్లగొండ జిల్లాను వదిలి పెట్టి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు మంత్రి పదవులను ఇవ్వాలని అనడం విచిత్రంగా ఉందన్నారు. తాను మంత్రి పదవి కోసం ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడలేదని, పైరవీకారులను పక్కన పెట్టాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఏ మంత్రి గెలిపించారని ప్రశ్నించారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చాలామంది మంత్రులను రాష్ట్రంలోని పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జిగా పెట్టిందని, భువనగిరి పార్లమెంట్‌కు మాత్రం మంత్రి ఇన్‌చార్జిగా రాలేదని, ఒక ఎమ్మెల్యేను పార్టీ ఇన్‌చార్జిగా పెట్టిందని పేర్కొన్నారు. తనకు మంచి పేరు, గెలిపించే శక్తి లేకపోతే ఎందుకు ఇన్‌చార్జిగా పెట్టారని ప్రశ్నించారు. గెలిపించే సత్తా ఉందనే కదా తనకు బాధ్యత అప్పగించారని చెప్పారు.

### చామలను 2.25 లక్షల మెజార్టీతో గెలిపించా

'ఇచ్చిన మాటను నిలబెట్టుకునే బాధ్యత ఎవరిది? మీరు ఇన్‌చార్జిగా పెడితే అభ్యర్థిని గెలిపించినం కదా.. ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, సికింద్రాబాద్, మల్కాజిగిరి, మెదక్, కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ గెలిచిందా? ఈ మంత్రులంతా ఎక్కడికి పోయింద్రు'? అని రాజగోపాల్ రెడ్డి నిలదీశారు. భువనగిరి ఎంపీగా చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని 2.25 లక్షల మెజార్టీతో గెలిపించానని తెలిపారు. ప్రతిపక్షాలతో కొట్లాడే శక్తి, సామర్థ్యం ఉన్న వారికి మంత్రి పదవి ఇవ్వడం సముచితమని, తనకు మంత్రి పదవి ఇస్తానని ఎన్నికలకు ముందు పార్టీ అధిష్ఠానం హామీ ఇచ్చిందని తెలిపారు. అధిష్ఠానం మంత్రి పదవి ఇస్తానంటుంటే కొందరికి చెమటలు పడుతున్నాయన్నారు. తాను మంత్రి పదవి కోసం పైరవీలు చేయడం లేదని, రాజగోపాల్‌రెడ్డి అర్హుడనుకుంటేనే మంత్రి పదవి ఇవ్వాలి కానీ.. ఏదో రిజర్వేషన్ కోటాలో కాదని, మాటిచ్చారని కాదని పేర్కొన్నారు. మంత్రి పదవి వస్తే నల్లగొండతో పాటు రాష్ట్రానికి, కాంగ్రెస్‌కు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువస్తాడు.. మంచి పనులు చేస్తాడనే ఆలోచనతో అధిష్ఠానం నిర్ణయం తీసుకోవాలన్నారు. తాను పదవి కోసం అడుక్కునే పరిస్థితిలో లేనని చెప్పారు. తెలంగాణ తెచ్చిన కాంగ్రెస్ ఎంపీల్లో తాను ఒకడినన్నారు. తన విషయంలో కొందరు నాయకులు దుర్మార్గంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. దారిన పోయే దానయ్యకు పదవిస్తే కొట్లాడతాడా అని ప్రశ్నించారు. కేసీఆర్ అనే వ్యక్తిని గద్దె దింపేవరకు నిద్రపోనని చెప్పిన తాను.. బీజేపీలో ఉన్నా సరే మళ్లీ వెనకడుగు వేసి కాంగ్రెస్‌లోకి వచ్చి గద్దె దింపానా లేదా అని అన్నారు.

### మంత్రి పదవిపై అధిష్ఠానం హామీ : చామల

రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని పార్టీ అధిష్ఠానం హామీ ఇచ్చిందని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించిన రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వడం సముచితమని అన్నారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ రాజగోపాల్‌కు మంత్రి పదవి ఇవ్వాలని ఎంపీ చామల అధిష్ఠానానికి చెప్పాలని కోరారు.

### నా ఓపిక, సహనాన్ని పరీక్షించొద్దు

తన సోదరుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలంగాణ కోసం మంత్రి పదవిని త్యాగం చేయగా, తాను తెలంగాణ కోసం పార్లమెంట్‌లో కొట్లాడానని, తెలంగాణ కోసం కొట్లాడిన అన్నదమ్ములిద్దరికీ మంత్రి పదవులు ఇస్తే తప్పా అని రాజగోపాల్‌రెడ్డి ప్రశ్నించారు. తనను చూసి కొందరు భయపడుతున్నారని, ప్రాణం పోయినా రాజగోపాల్ రెడ్డి తప్పు చేయడని స్పష్టం చేశారు. మునుగోడు నుంచి గతంలో ఎవరికీ మంత్రి పదవి రాలేదని, మంత్రి పదవి ఇస్తే వెనకబడిన ఈ ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఖమ్మం జిల్లాలో 9 మంది ఎమ్మెల్యేలు గెలిస్తే ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చినప్పుడు, నల్లగొండ జిల్లాలో 11 మంది గెలిచినప్పుడు తనకెందుకు మంత్రి పదవి ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. నా ఓపిక, సహనాన్ని పరీక్షించొద్దని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన ఉమ్మడి జిల్లాలోని సాగు, తాగు నీటి ప్రాజెక్టులను నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పూర్తి చేయిస్తున్నారని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సీఎం రేవంత్ రెడ్డి అవిరళ కృషి చేస్తున్నారని ఆయన కొనియాడారు.

# అంబేడ్కర్‌ను కాంగ్రెస్ వేధించింది

- మేం ఆయన కృషిని గౌరవిస్తున్నాం
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి
- అంబేడ్కర్‌ను ఓడించిన చరిత్ర కాంగ్రెస్‌ది
- భీం ఆశయ సాధనకు కృషి: సంజయ్



అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న కిషన్‌రెడ్డి

బంజారాహిల్స్/ కరీంనగర్/హైదరాబాద్/ సుభాష్ నగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను కాంగ్రెస్ చివరి వరకు వేధించిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. అంబేడ్కర్ ఎన్నికల్లో నిలబడితే ఆయనకు వ్యతిరేకంగా నెహ్రూ ప్రచారం నిర్వహించారని అన్నారు. అంబేడ్కర్ జయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం బంజారాహిల్స్‌లోని భీం విగ్రహాన్ని కిషన్‌రెడ్డి కడిగి, అలంకరించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అంబేడ్కర్ కృషి, వారసత్వాన్ని గౌరవిస్తూ పలు కార్యక్రమాలను చేపట్టిందన్నారు. అంబేడ్కర్ జీవితానికి సంబంధించిన 5 ముఖ్యమైన ప్రదేశాలను 'పంచ తీర్థాలు'గా తీర్చిదిద్దిందని తెలిపారు. రాజ్యాంగానికి రూపకల్పన చేసి, సామాజిక న్యాయ సంస్కరణలకు అంబేడ్కర్ అసమానమైన కృషి చేసినా, కాంగ్రెస్ ఆయనకు గుర్తింపు ఇవ్వలేదని విమర్శించారు. కనీసం ఆయన చిత్రపటాన్ని పార్లమెంట్‌లో పెట్టేందుకు చర్యలు తీసుకోలేదన్నారు.

### అంబేడ్కర్‌ను కాంగ్రెస్ అవమానించింది: సంజయ్

అంబేడ్కర్‌ను ఓడించిన, అవమానించిన నీచమైన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. 1951లో హిందూ కోడ్ బిల్లు, సామాజిక న్యాయ సాధికారత అంశాలపై అంబేడ్కర్ అభిప్రాయాలను నెహ్రూ వ్యతిరేకించారని, దీంతో మనస్తాపం చెందిన అంబేడ్కర్ మంత్రి పదవికి రాజీనామా చేశారని పేర్కొన్నారు. 1954 ఉప ఎన్నికలో అంబేడ్కర్‌పై అభ్యర్థిని నిలబెట్టి ఆయనను ఓడించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో సంజయ్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనకు బీజేపీ ప్రభుత్వం, ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని తెలిపారు. కాగా, కాంగ్రెస్ అంబేడ్కర్‌ను అవమానించడం తప్ప గౌరవించలేదని ఎంపీ అర్వింద్ విమర్శించారు. 'చలో గావ్.. చలో బస్తీ' కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్‌లోని పులాంగ్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహాన్ని అర్వింద్ శుభ్రం చేశారు. పవన్ కల్యాణ్ త్యాగం చేసి రాజకీయాల్లోకి వచ్చారని.. కవిత ఏం త్యాగం చేసి వచ్చిందని ప్రశ్నించారు. కాగా, కంచ గచ్చిబౌలిలోని సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాలను టీజీఐఐసీకి బదిలీ చేసింది వాస్తవం కాదా..? అని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి.. మంత్రి శ్రీధర్‌బాబును ప్రశ్నించారు. ఆ భూములను తాకట్టుపెట్టి రుణం తీసుకోవడంపై శ్రీధర్‌బాబు ప్రజలను తప్పుదోవ పట్టించారని అన్నారు. ఆదివారం బీజేపీ కార్యాలయంలో మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా ఉండేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కంచ గచ్చిబౌలి భూములను తెలివిగా టీజీఐఐసీకి బదిలీ చేసి, దాని ద్వారా రుణం తీసుకుందని ఆరోపించారు.



దేశం అభివృద్ధి చెందడమంటే.. అద్దాల మేడలు, రంగుల గోడలు నిర్మించడం కాదు.. పౌరుని నైతిక అభివృద్ధే నిజమైన దేశ అభివృద్ధి - అంబేద్కర్








నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్

## వక్ఫ్ చట్టంపై భారీ నిరసన

» అంబేడ్కర్ విగ్రహం వద్ద ముస్లింల దీక్ష

హైదరాబాద్/బర్కత్‌పుర, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం హైదరాబాద్‌లో ముస్లింలు భారీ ఎత్తున ఆందోళన నిర్వహించారు. మోదీ ప్రభుత్వం తెచ్చిన ఈ చట్టం రాజ్యాంగ వ్యతిరేకమంటూ ట్యాంక్‌బండ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన దీక్ష చేపట్టారు. అలాగే లిబర్టీ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి బషీర్‌బాగ్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. నిరసన దీక్షకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ సంఘీభావం హాజరై సంఘీభావం తెలిపారు. ఎంపీ ఇమ్రాన్ మసూద్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేన్, టీజీఎంఆర్ఈఐఎస్ ఛైర్మన్ ఫహీం ఖురేషి, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబెదుల్లా కొత్వాల్, హజ్ కమిటీ ఛైర్మన్ సయ్యద్ ఖుస్రూ పాషా, ఫుడ్ కార్పొరేషన్ ఛైర్మన్ ఫహీం, షేక్ అక్బర్, ఉస్మాన్ హల్ అజ్రీ తదితరులు పాల్గొన్నారు. వక్ఫ్ సవరణ చట్టంతో ముస్లింలకు తీవ్ర నష్టం జరుగుతుందని, దాన్ని రద్దు చేయాలని మాజీ ఎంపీ వీ హనుమంతరావు డిమాండ్ చేశారు. కాగా, వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 19న సాయంత్రం ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో దారుల్‌సలాంలో భారీ నిరసన సభ నిర్వహించనున్నట్లు మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బోర్డు అధ్యక్షుడు ఖలీద్ సైఫుల్లా రెహ్మానీ అధ్యక్షతన జరిగే సభలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముస్లిం మత నాయకులు, ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. వక్ఫ్ ఆస్తుల రక్షణ పేరుతో చేసిన చట్టం వక్ఫ్ విలువైన ఆస్తులను ఇతరులకు ధారాదత్తం చేసేలా ఉందని విమర్శించారు. టీటీడీలో హిందువులు తప్ప ఇతర మతస్థులు ఉండరాదని తొలగిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు.. ముస్లింలకు సంబంధించిన ధార్మిక సంస్థలో ఇతర మతస్థులను సభ్యులుగా చేర్చే వక్ఫ్ సవరణ చట్టానికి ఎలా మద్దతు పలుకుతారని ఒవైసీ ప్రశ్నించారు. చంద్రబాబు, నితీశ్ తదితరులు ఈ చట్టానికి మద్దతు ప్రకటించి ముస్లింలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు.



తిరుమల ఆలయం ముందు కుటుంబసభ్యులతో జస్టిస్ సుజయ్‌పాల్

## శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు సీజే

తిరుమల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని పలు రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులు ఆదివారం దర్శించుకున్నారు. తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్, ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్(మేనేజ్‌మెంట్) రామకృష్ణ, గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ, పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అభిషేక్‌రెడ్డి, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అరుళ్ మురుగన్ శ్రీవారి దర్శించుకోగా, ఆలయ అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

# ఎస్సీ వర్గీకరణ నేటి నుంచే..



(మొదటిపేజీ తరువాయి)

వర్గీకరణ వరిస్తుంది. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత దేశంలో ఎస్సీ వర్గీకరణను పూర్తి చేసిన తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలవడం గమనార్హం.

### సుప్రీం తీర్పు వచ్చిన రోజే ప్రకటన

ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్రాలే నిర్ణయం తీసుకోవచ్చంటూ సుప్రీంకోర్టు గతేడాది ఆగస్టు 1న తీర్పు ఇచ్చింది. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తామని అదే రోజున ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభలో ప్రకటించారు. సెప్టెంబర్ 12న ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎంపీ మల్లు రవి సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఉప సంఘం సూచన మేరకు 2024 అక్టోబర్ 11న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌తో ఏక సభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. 60 రోజుల్లో కమిషన్ నివేదిక ఇవ్వాలని కోరింది. తర్వాత గడువును ఈ ఏడాది ఫిబ్రవరి 10 వరకు పొడిగించింది. కమిషన్ 2011 జనాభా లెక్కల ఆధారంగా పరిశీలన జరిపి.. ఫిబ్రవరి 3న మంత్రివర్గ ఉప సంఘానికి నివేదిక అందజేసింది. కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా రాష్ట్రంలో ఎస్సీలను 3 గ్రూపులుగా వర్గీకరించి, రిజర్వేషన్‌ను విభజిస్తున్నట్టు ఫిబ్రవరి 4న అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించింది.

### మూడు అంశాల ఆధారంగా వర్గీకరణ..

జస్టిస్ షమీమ్ అక్తర్ కమిషన్ రాష్ట్రంలోని 59 ఎస్సీ కులాలను మూడు గ్రూపులుగా వర్గీకరించి, జనాభా శాతం ఆధారంగా 15 శాతం రిజర్వేషన్‌ను పంచింది. గ్రూప్-1లో సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా, అత్యంత వెనుకబడిన 15 కులాలను చేర్చి 1శాతం, గ్రూప్-2లో మాదిగ, దాని ఉప కులాలను కలిపి 18 కులాలకు 9శాతం, గ్రూప్-3లో మాల, దాని ఉపకులాలను కలిపి 26 కులాలకు 5శాతం రిజర్వేషన్‌ను కేటాయించింది. గ్రూప్-1లో 1,71,625 మంది (3.288శాతం), గ్రూప్-2లో 32,74,377 మంది (62.748శాతం), గ్రూప్-3లో 17,71,1682 మంది (33.963శాతం) జనాభా ఉన్నారని పేర్కొంది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో ఎస్సీ రిజర్వేషన్ల అమలుకు గ్రూపుల వారీగా ప్రాధాన్యత క్రమం అనుసరించాలని కమిషన్ ప్రతిపాదించింది. గ్రూప్-1లోని కులాల వారితో ఖాళీలు భర్తీ కాకపోతే.. గ్రూప్-2లోని వారితో, గ్రూప్-2లో భర్తీకాని ఖాళీలను గ్రూప్-3లోని కులాల వారితో భర్తీ చేయాలని సూచించింది. ఒకవేళ ఈ మూడు గ్రూపుల్లో తగిన అభ్యర్థులు లేకపోతే ఖాళీలను తర్వాతి నోటిఫికేషన్‌కు కొనసాగించాలని (క్యారీ ఫార్వర్డ్) పేర్కొంది. సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో రోస్టర్ పాయింట్లు కీలకంగా ఉంటాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగులకు వారి రిజర్వేషన్ల ప్రకారం రోస్టర్ పాయింట్లు ఉంటాయి. ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో గ్రూపుల వారీగా ఈ రోస్టర్ పాయింట్లను కూడా కమిషన్ విభజించింది. ఎస్సీ గ్రూప్-1కు 7వ రోస్టర్ పాయింట్, గ్రూప్-2లోని వారికి 2, 16, 27, 47, 52, 66, 72, 87, 97 పాయింట్లను, గ్రూప్-3లోని వారికి 22, 41, 62, 77, 91 రోస్టర్ పాయింట్లను ప్రతిపాదించింది. సోమవారం విడుదల చేసే ఉత్తర్వుల్లో ఈ వివరాలను పొందుపర్చనున్నారు.

**వర్గాలు, కులాల సంఖ్య వారీగా ఎస్సీ రిజర్వేషన్ వివరాలు**

| కేటగిరి | గ్రూప్ పేరు | కులాల సంఖ్య | జనాభా % (2011 లెక్కల ప్రకారం) | సిఫారసు చేసిన రిజర్వేషన్% |
|---|---|---|---|---|
| గ్రూప్-1 | అత్యంత వెనుకబడిన, పట్టించుకోని షెడ్యూలు కులాలు | 15 | 3.288 | 1 |
| గ్రూప్-2 | మధ్యస్థంగా లబ్ధిపొందిన షెడ్యూలు కులాలు | 18 | 62.748 | 9 |
| గ్రూప్-3 | మెరుగైన ప్రయోజనం పొందిన షెడ్యూలు కులాలు | 26 | 33.963 | 5 |
| మొత్తం | | 59 | 100 | 15 |

### మూడు దశాబ్దాల పోరాటం

ఎస్సీలను వర్గీకరించి రిజర్వేషన్లను అమలుచేయాలనే డిమాండ్‌తో ఎస్సీల్లోని వెనుకబడిన కులాలు మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నాయి. వారి కలకు ఇన్నేళ్లకు నెరవేరుతోంది. వాస్తవానికి 1997లోనే అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ కోసం జస్టిస్ రామచంద్రరాజు కమిషన్‌ను నియమించింది. ఆ కమిషన్ ప్రతిపాదనల మేరకు ప్రభుత్వం ఎస్సీ కులాలను ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా వర్గీకరిస్తూ 1997 జూన్ 6న ఉత్తర్వులు జారీ చేసింది. కానీ హైకోర్టులో పిటిషన్లు దాఖలవడంతో ఉత్తర్వుల అమలు నిలిచిపోయింది. వర్గీకరణపై 1998లో ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను జారీ చేసినా హైకోర్టులో సవాల్ చేయడంతో ఆగిపోయింది. తర్వాత ఆ కేసు సుప్రీంకోర్టుకు చేరగా.. ఎస్సీ వర్గీకరణను పార్లమెంట్ మాత్రమే చేయగలదంటూ రాష్ట్ర ఆర్డినెన్స్‌ను కొట్టివేసింది. ఇక 2008లో అప్పటి సీఎం వైఎస్సార్ విజ్ఞప్తి మేరకు కేంద్రం ఉషా మెహ్రా కమిషన్ ఏర్పాటు చేసినా.. ఆ సిఫార్సులు అమలుకాలేదు. తాజాగా 2024 ఆగస్టులో రాష్ట్రాలే ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంతో తెలంగాణ ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టింది. కమిషన్ ఏర్పాటు, వర్గీకరణ ఖరారు, అసెంబ్లీలో బిల్లు ఆమోదం, చట్టబద్ధత దాకా చకచకా పూర్తి చేసింది.

## చిత్తశుద్ధి చాటుకున్నాం

» ఎస్సీ వర్గీకరణ చేసి మాట నిలుపుకొన్నాం

» దశాబ్దాల డిమాండ్‌ను నెరవేర్చాం: ఉత్తమ్



హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఇచ్చిన మాట మేరకు రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి చిత్తశుద్ధిని చాటుకున్నామని మంత్రివర్గ ఉప సంఘం ఛైర్మన్, నీటి పారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎస్సీ వర్గీకరణను కచ్చితంగా అమల్లోకి తెస్తామని అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ స్పష్టమైన హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఎస్సీ ఉపకులాల దశాబ్దాల డిమాండ్ అయిన ఎస్సీ వర్గీకరణను తమ ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించారు. ఆదివారం రాష్ట్ర సచివాలయంలో ఎస్సీ వర్గీకరణ అమలుపై వేసిన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ భేటీలో ఉప సంఘం ఛైర్మన్ ఉత్తమ్, వైస్ ఛైర్మన్ దామోదర రాజనర్సింహ, సభ్యులు పొన్నం ప్రభాకర్, సీతక్క, వర్గీకరణ కమిషన్ ఛైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్, అధికారులు శ్రీధర్, తిరుపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు. కమిషన్ వేసి ఎస్సీ ఉప కులాల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై లోతుగా అధ్యయనం చేశామని, 8,600 పైగా వినతులు స్వీకరించామని తెలిపారు. కమిషన్ సిఫార్సులపై మంత్రివర్గ ఉప సంఘం అధ్యయనం చేసి ఆమోద ముద్ర వేసిందని చెప్పారు. తాను 1999 నుంచి ప్రతి శాసనసభ సమావేశాల్లో ఈ అంశంపై చర్చించడాన్ని ప్రత్యక్షంగా చూశానని తెలిపారు. ఇన్నేళ్లకు తమ ప్రభుత్వం డిమాండ్ నెరవేర్చిందని చెప్పారు. 2026లో జరగబోయే జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకుని ఎస్సీలకు ప్రస్తుతమున్న 15 శాతం రిజర్వేషన్లను మరింత పెంచే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేస్తోందని ఉత్తమ్ తెలిపారు.

### వర్గీకరణతో బంగారు భవిష్యత్తు: మందకృష్ణ

ముదిగొండ: ఎస్సీ వర్గీకరణతో భావి తరాలకు బంగారు భవిష్యత్తు లభిస్తుందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. వర్గీకరణ కోసం 30ఏళ్లుగా చేసిన పోరాటానికి సుప్రీంకోర్టు తీర్పు వల్ల ఫలితం దక్కిందని పేర్కొన్నారు.

## హోమియోపతిలో త్వరలో సూపర్ స్పెషాలిటీ కోర్సులు

ఐఐహెచ్‌పీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శివమూర్తి

గుంటూరుమెడికల్, ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): హోమియోపతిలో త్వరలో సూపర్ స్పెషాలిటీ (డీఎం) కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతిక్ ఫిజీషియన్స్ (ఐఐహెచ్‌పీ) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కేఎస్‌ఎస్ శివమూర్తి వెల్లడించారు. ఆదివారం గుంటూరులోని హిందూ ఫార్మసీ కళాశాలలో జరిగిన హోమియోపతి వైద్యుల సంఘం రాష్ట్ర శాఖ 18వ వార్షిక సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. హోమియో వైద్య పితామహుడు డాక్టర్ శామ్యూల్ హానిమన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శివమూర్తి మాట్లాడుతూ హోమియోపతి వైద్యాన్ని బలోపేతం చేసేందుకు డీఎం సూపర్ స్పెషాలిటీ కోర్సులు అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు.

# అమరావతి.. డబుల్!!

## ఏపీ రాజధాని విస్తరణకు మరో 44 వేల ఎకరాల భూసమీకరణ?

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

మూడేళ్లలో అమరావతి రాజధానికి నిర్దిష్ట రూపం తీసుకురావాలని ఏపీ సీఎం చంద్రబాబు కృతనిశ్చయంతో ఉన్నారు. 92 ప్రాజెక్టులకు గుర్తించి.. రూ.65 వేల కోట్ల అంచనా వ్యయంతో పనులకు శ్రీకారం చుట్టారు. ఇంకా కొన్ని కీలక ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉంది. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మించాలన్న ఆలోచన కూడా చేస్తున్నారు. ఇందుకు దాదాపుగా 5 వేల నుంచి 7 వేల ఎకరాలు అవసరం. అమరావతి రైల్వేలైన్, అంతర్జాతీయ స్టేడియం, మెట్రో రైలు.. ఇలా చెప్పుకొంటూ పోతే చాలా ప్రాజెక్టులకు భూములు కావాలి. ఇవి కాకుండా నవ నగరాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యతా ఉంది. నవ నగరాలకు భూములు సిద్ధంగా ఉన్నప్పటికీ.. అమరావతికి వస్తున్న అనేక సంస్థలకు భూకేటాయింపులు చేయాల్సి వస్తోంది. ఇన్నర్ రింగ్ రోడ్డు కోసం పెద్ద ఎత్తున భూములను తీసుకోవలసి ఉంది. పారిశ్రామిక సంస్థలు, ఆతిథ్య రంగ సంస్థలు, విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు.. ఇలా ప్రతి ఒక్కటీ ముందుకు వచ్చి అమరావతిలో భాగస్వామ్యం కావాలనుకుంటున్నాయి. వీటికి కూడా భూములను కల్పించాల్సి వస్తోంది. ఈ కారణంగానే రాజధాని విస్తరణకు మరో 44 వేల ఎకరాలను భూసమీకరణ ద్వారా తీసుకోవాలని సర్కారు భావిస్తున్నట్లు సమాచారం. ఎక్కడెక్కడ భూములు సమీకరించాలో కొన్ని ప్రాంతాలను ప్రతిపాదిస్తూ సీఆర్‌డీఏ ఓ ముసాయిదాను రూపొందించినట్లు తెలిసింది.

### భూ సమీకరణ ప్రతిపాదిత ప్రాంతాలు..

తుళ్లూరు, అమరావతి, తాడికొండ, మంగళగిరి మండలాల పరిధిలోని మొత్తం 11 గ్రామాల్లో 18,080 హెక్టార్ల (సుమారు 44,670 ఎకరాలు) భూములను తీసుకోవాలనేది ఆలోచన. తుళ్లూరు మండలం హరిశ్చంద్రాపురంలో మొత్తం గ్రామంలోని 2,429.05 ఎకరాలు, వడ్డమానులోనూ పూర్తిగా 1,937.31 ఎకరాలు, పెదపరిమిలో పాక్షికంగా 6,513.69 ఎకరాలు సమీకరించాలని సీఆర్‌డీఏ ప్రతిపాదించింది. అమరావతి మండలం వైకుంఠపురంలో 3,360.63 ఎకరాలు, ఎండ్రాయిలో 2,167.11 ఎకరాలు, కర్లపూడిలో 2,947.06 ఎకరాలు, మోతడక గ్రామంలో 2,345.03 ఎకరాలు, నిడుముక్కలలో 2,013.91 ఎకరాలు.. తాడికొండ మండలం తాడికొండలో 12,797.59 ఎకరాలు, కంతేరులో 3,671.98 ఎకరాలు, మంగళగిరి మండలం కాజ గ్రామంలో 4,492.37 ఎకరాలు పాక్షికంగా సమీకరించాలని సీఆర్‌డీఏ అనుకుంటోంది. దీనిపై ప్రభుత్వ వర్గాలు స్పందిస్తూ.. అమరావతిలో అంతర్జాతీయ విమానాశ్రయం, స్పోర్ట్స్ సిటీ, స్మార్ట్ ఇండస్ట్రియల్ సిటీల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అంగీకరించాయి. అయితే వీటికి అవసరమయ్యే భూముల కోసం భూ సమీకరణకు వెళ్లాలా.. భూసేకరణ జరపాలా అన్న దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశాయి. భోగాపురం విమానాశ్రయం మాదిరిగా అమరావతిలో కూడా భూ సేకరణ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపాయి.

## తిరుమలలో పవన్ భార్య తలనీలాల సమర్పణ

» డిక్లరేషన్‌పై డిప్యూటీ సీఎం పవన్ సతీమణి సంతకం

» మార్క్ శంకర్‌తో హైదరాబాద్ చేరుకున్న పవన్



తిరుమలలోని పద్మావతి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పిస్తున్న అన్నా లెజినోవా

తిరుమల/హైదరాబాద్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా తిరుమల శ్రీవారికి తలనీలాలు సమర్పించారు. ఇటీవల వీరి కుమారుడు మార్క్ శంకర్ అగ్నిప్రమాదం నుంచి క్షేమంగా బయటపడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం అన్నా లెజినోవా తిరుమల వచ్చారు. గాయత్రి అతిథి గృహానికి చేరుకున్న ఆమెకు టీటీడీ రిసెప్షన్ అధికారులు స్వాగతం పలికారు. ఇతర మతానికి చెందిన వ్యక్తి కావడంతో నిబంధనల ప్రకారం హిందూ మతాన్ని గౌరవిస్తున్నానని, తనకు పూర్తి విశ్వాసాలు ఉన్నాయని పేర్కొంటూ డిక్లరేషన్‌పై ఆమె సంతకం చేశారు. అనంతరం క్షేత్ర సంప్రదాయాన్ని పాటిస్తూ వరాహస్వామిని దర్శించుకున్నారు. అక్కడినుంచి నేరుగా పద్మావతి కల్యాణకట్టకు వెళ్లి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అన్నా లెజినోవా సోమవారం వేకువజామున సుప్రభాత సేవలో పాల్గొని, శ్రీవారిని దర్శించుకోనున్నారు. కాగా, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తన కుటుంబసభ్యులతో కలసి శనివారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. ఇటీవల సింగపూర్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడిన తనయుడు మార్క్ శంకర్ ఆరోగ్యం ఇప్పుడు నిలకడగా ఉందని పవన్ 'ఎక్స్'వేదికగా తెలిపారు. ప్రమాదం నుంచి తన తనయుడు కోలుకోవాలని ఆకాంక్షించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## హైదరాబాద్‌లో క్వాంటమ్ ఎకోసిస్టమ్ అభివృద్ధి

» నేడు క్వాంటమ్ ఫ్రంటియర్ టెక్ చార్టర్ ప్రకటన

» భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానాలకు కేంద్రంగా మార్చుతాం: మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నీతి ఆయోగ్‌కు చెందిన ఫ్రంటియర్ టెక్ హబ్ (ఎఫ్‌టీహెచ్)తో కలిసి హైదరాబాద్‌లో క్వాంటమ్ సాంకేతికతకు అనుకూలమైన ఎకోసిస్టమ్‌ను వేగంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో ఓ వ్యూహాత్మక కార్యక్రమాన్ని ప్రారంభించబోతోంది. సోమవారం (14న) ప్రపంచ క్వాంటమ్ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం నీతి ఆయోగ్ ఎఫ్‌టీహెచ్‌తో కలిసి క్వాంటమ్ ఫ్రంటియర్ టెక్ చార్టర్‌ను ప్రకటించనుంది. ఈ చార్టర్ ద్వారా రాష్ట్రాన్ని దేశంలో ప్రముఖ క్వాంటమ్ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా పనిచేయనుంది. ప్రధానంగా సైబర్ సెక్యూరిటీ, ఆరోగ్య, ఆర్థిక రంగం, మెటీరియల్ సైన్స్, లాజిస్టిక్ వంటి కీలక రంగాల్లో ఉన్న సవాళ్లకు పరిష్కార మార్గాలను అందించనుంది. కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాదంతా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం ద్వారా రాష్ట్రాన్ని భవిష్యత్తు సాంకేతిక పరిజ్ఞానాలకు కేంద్రంగా మార్చే దిశగా పెద్ద ముందడుగు వేయబోతున్నామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాలను స్వీకరించి, వాటిని ప్రజా శ్రేయస్సుకు సాధనాలుగా మార్చడం ద్వారా తెలంగాణను ప్రపంచ ఆవిష్కరణ పర్యావరణ వ్యవస్థగా మార్చుతామని చెప్పారు. హైదరాబాద్‌లో క్వాంటమ్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను సర్కారు ప్రోత్సహిస్తుందన్నారు.



*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **N. Rahul Kumar**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.*